
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

26-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 207 పేజీలు: 8+4 వెల: 6.50


భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

కులగణనలో 'ఓపన్‌ఎండెడ్' వద్దు

5లో



వెలిగొండ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు (ఫైల్)

# 30 యేళ్ల సంకల్పం నెరవేరింది!

## వెలిగొండ 'వెలుగుల దండ'

## జలసిరులు - అభివృద్ధికి రెక్కలు

'ఎక్స్' వేదికగా తన భావాలను వ్యక్తం చేసిన చంద్రబాబు

31న ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం: సిఎం వెల్లడి

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి రైతు పొలానికి నీరు... ప్రతి యువకుడికి ఉపాధి... ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని సిబిఎన్ అనే నేను సంకల్పించినట్టు 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇంటింటికి కుళాయి ద్వారా పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలను ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత సమస్య చూపిస్తామంటూ భరోసా ఇచ్చారు, ఈ పోస్టులోనే 30యేళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన చేసిన ఫోటోను జత చేసారు. వెలిగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్దాపన చేసింది నేనే, ప్రారంభిస్తుంది తానేనని వ్యాఖ్యానించారు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు,సవాళ్లు, సమస్యలను అధిగమించి భగీరథ ప్రయత్నంతో, గొప్ప సంకల్పంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసినట్లు వివరించారు. తద్వారా కరువునేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నామని తెలిపారు. "తీవ్ర కరువు ప్రాంతంగా, అత్యంత వెనుకబాటుతనంతో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాలు మార్చేందుకు 30 యేళ్ల క్రితం తీసుకున్న సంకల్పం నేడు సాకారమైంది. ఉమ్మడి రాష్ట్రంలో నాడు ముఖ్యమంత్రిగా >>2



మంగళవారం న్యూఢిల్లీలో చిరాగ్ పాశ్వాన్ నుంచి అవార్డు అందుకుంటున్న సెర్ప్ అధికారి

## 'సెర్ప్'కు అవార్డు

**విజయవాడ,ఆగస్టు 25.ప్రభాతవార్త ప్రతినిధి:** సీడ్ క్యాపిటల్ మరియు హైయ్యర్ ఆర్డర్ ఎంటర్ప్రైజెస్ రుణాలు అందచేయడంలో, గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థ(సెర్ప్), ఆంధ్ర ప్రదేశ్‌కు జాతీయ స్థాయి అవార్డును మంగళవారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ న్యూఢిల్లీలో అందజేశారు. ఈ నెల ఆగస్టు 24, 25 తేదీలలో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఇండియా హేబిటేడ్ సెంటర్ న్యూఢిల్లీలో నిర్వ >>2

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట

10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా

181 కొత్త ఘాట్ల నిర్మాణం సహా 440 ఘాట్ల అభివృద్ధి

మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు

గోదావరి పుష్కరాలపై సిఎం చంద్రబాబు సమీక్ష



మంగళవారం సచివాలయంలో గోదావరి పుష్కరాలపై సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే యేడాది జూన్ 26 నుంచి జులై 7వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్అండ్‌బి, జల వనరులు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖలకు >>2



మంగళవారం సచివాలయంలో జూడా ప్రతినిధులతో సత్యకుమార్ యాదవ్

# జూడాల సమ్మె విరమణ

- మంత్రి సత్యకుమార్‌తో జూడా ప్రతినిధుల చర్చలు
- జూడాల డిమాండ్‌లపై సానుకూలంగా, సానుభూతితో పరిశీలిస్తాం
- స్టైపెండ్ పెంపుపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీ
- త్వరలోనే జూడా ప్రతినిధులతో సమావేశం
- రిటైర్మెంట్ వయసు పెంపుపైనా పునఃపరిశీలన
- నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పిహెచ్‌డి అభ్యర్థుల అంశాన్ని పరిశీలిస్తాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ
- రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ల (జూడా) డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిమితులను దృష్టిలోఉంచుకుని.. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైపెండ్, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణల్లో వీరికి అందుతున్న స్టైపెండ్ తదితర అంశాలను రాష్ట్రంలో అమలవుతున్న విధానంతో పోల్చి ఇప్పటికే కూలంకషంగా చర్చించామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారంనాడు జూడా ముఖ్య ప్రతినిధులు మంత్రి సత్య కుమార్, కార్యదర్శి జి వీర పాండియన్ ను కలిశారు. సమ్మెను విరమించి విధుల్లోనికి వెళ్లడం ప్రారంభించినట్లు ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కృతజ్ఞతలు >>2

## పోక్సో కేసులో నిందితుడికి 20యేళ్ల జైలు

రూ.5 వేల జరిమానా

కాకినాడ ప్రత్యేక కోర్టు తీర్పు

**రాజమహేంద్రవరం(అర్బన్), ఆగస్టు 25 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడికి కాకినాడ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం కఠిన శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు విలువరించింది. నేరం రుజువు కావడంతో చిర్రా ఆనంద్ కుమార్ అనే వ్యక్తికి 20యేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొలమూరు గ్రామానికి చెందిన 16యేళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి రాజానగరం ఎస్ఐ యు.వి.ఎస్. నాగబాబు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఈస్ట్‌జోన్ డిఎస్పీ ఎ.టి.వి. రవికుమార్ శాస్త్రీయ ఆధారాలు, వైద్య నివేదికలు, 164 సిఆర్‌పిసి ప్రకారం నమోదైన వాంగ్మూలాలను సేక >>2

# 'పవర్'లో ఏపి నం.1

- 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్‌ఎనర్జీలో 22 క్లస్టర్ల అభివృద్ధి
- సుజ్లాన్ భాగస్వామ్యంతో యువతకు నైపుణ్య శిక్షణ
- అనంతపురం అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, రెన్యువల్ ఎనర్జీ
- ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- కణేకల్లులో పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన



మంగళవారం హులికెర వద్ద నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**రాయదుర్గం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పునరుత్పాదక ఇంధన రంగంలో ఎపిని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఎపి నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటిందన్నారు. "ప్రస్తుత ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకురానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగావాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఎపిలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి అని వివరించారు.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

"ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో >>2

# తాటి వనం.. తీరానికి రక్షణ కవచం

- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- తాటి గింజల సేకరణ, నాటే ప్రక్రియ ప్రారంభం
- 5,499 హెక్టార్ల విస్తీర్ణంలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యం
- సీజన్ ప్రారంభంలోనే 13 లక్షల తాటి గింజలు సేకరించిన అటవీ శాఖ
- తాటి వనాల ఏర్పాటు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పిలుపు



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న గ్రేట్ గ్రీన్ వాల్ సంకల్పంలో కీలకమైన తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ మొదలయ్యింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రకృతి విపత్తుల సమయంలో గాలి నిరోధక వ్యవస్థగా తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పించనున్నాయి. మూడంచెల గ్రేట్ గ్రీన్‌వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు తాటి చెట్టు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి. ఉప్పు నేలలు, ఇసుక, బుసకతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతే కాదు బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత >>2

# పట్టణాల అభివృద్ధికి యుకె సహకారం



మంగళవారం అమరావతిలో మంత్రి నారాయణ సమక్షంలో మున్సిపల్ శాఖ - యుకె ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పంద దృశ్యం

మునిసిపాలిటీల్లో రూ.40 వేల కోట్లతో మౌలిక వసతుల కల్పన

ప్రపంచస్థాయి సాంకేతికత వినియోగం

వరల్డ్ క్లాస్ స్మార్ట్, లివబుల్ సిటీగా అమరావతి అభివృద్ధి

యుకె- ఎపి ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం: మంత్రి నారాయణ

**విజయవాడ. ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలికవసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్రప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం మంగళవారం అమరావతిలో కుదిరింది. వెలగపూడిలోని సచివాలయంలో నిర్వ >>2

# శ్రీశైలంలో విషాదం

అన్నదాన సత్రంలో ఐదుగురు ఆత్మహత్య

మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు

సత్యసాయి జిల్లా బత్తలపల్లి వాసులు

ఆర్థిక ఇబ్బందులతోనే బలవన్మరణం

పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి

**శ్రీశైలం ప్రాజెక్టు, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల క్షేత్రంలో వడ్డెర ప్రైవేట్ అన్నదాన సత్రంలో ఒకే కుటుంబ సభ్యులు ఐదు మంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన కుటుంబం. గతనెల 28న ఓ ఆటోలో వచ్చి వడ్డెర సత్రంలో రూమ్ 11ను తీసుకుని ఉంటున్నారు. అప్పటినుండి ప్రతిరోజు సత్రంలో భోజనానికి రావడం, బయట తిరగడం ఆలయానికి వెళ్లిరావడం చేస్తున్నారు. అయితే గత మూడు రోజులుగా రూమ్ నుండి ఎవరు బయటకు రాకపోవడం, పైగా దుర్వాసన రావడంతో సత్రం నిర్వాహకులు కిటికీలోనుంచి చూడగా ఉరివేసుకున్న దృశ్యాలుచూసి కంగుతిన్నారు. వెంటనే సత్రం నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. >>2




ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జున రావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్.వేదికపై సిఎం చంద్రబాబు నాయుడు

# లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జున రావు

లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్

సిఎం చంద్రబాబు, మంత్రులు, హైకోర్టు జడ్జిలు, డిజిపి హాజరు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావుతో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో లోక్ భవన్ దర్బార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ >>2




విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ చైర్మన్ గిరీష్ తంతి తదితరులు

# 'పవర్ఫ్‌'లో ఎపి నం.1

>> సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యం**

"మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా ఎఐ ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌదీ అరేబియాగా ఏపిని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి అని మంత్రి లోకేష్ వివరించారు.

**సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ 'తులసి తంతి' వారసత్వం మరోసారి కొనసాగుతోంది అని మంత్రి పేర్కొన్నారు.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

"ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీకూడా రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తున్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఏపికి వస్తాయి. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం అని మంత్రి లోకేష్ అన్నారు.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం..**

"ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడటం లేదు. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించుకుంటున్నాం అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపి అంబికా జి.లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సిఐఐ అజయ్ కపూర్, అద్వైత్ విబి రావు, టాటా పవర్ ఎండి, సిఐఐ సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హ్ అభయ్ సిన్హ్ పర్మార్, ఎన్‌ఆర్‌ఇడిసిఎపి లిమిటెడ్ విసి, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టొరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సిఎండి హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ పాల్గొన్నారు.

# జస్టిస్ మల్లిఖార్జున రావు

>> స్వీకారం చేయించారు. ఏపి ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత లోకాయుక్త రిజిస్ట్రార్ ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావును నియమిస్తూ గవర్నర్ జారీ చేసిన అపాయింట్‌మెంట్ వారెంట్‌ను చదివి వినిపించారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ (రిటైర్డ్) తల్లాప్రగడ మల్లిఖార్జునరావును గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, హైకోర్టు న్యాయమూర్తులు, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపి శాసనసభ సెక్రెటరీయేట్ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర న్యాయశాఖాధికారులు, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20యేళ్ల జైలు

>> రించి చార్జిషీట్ దాఖలు చేశారు. సిఐ వీరయ్య గౌడ్ దర్యాప్తును పర్యవేక్షించారు. కోర్టు విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పిపి పి. శ్రీదేవి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితుడిపై నేరం రుజువైంది. పోక్సో చట్టంలోని సెక్షన్ 3 ఆర్ /డబ్ల్యు 4(2) కింద 20యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలి. ఐపిసి 363 కింద మూడు నెలల సాధారణ జైలు, రూ.500 జరిమానా విధించారు. ఈ రెండు జైలుశిక్షలు ఏకకాలంలో అమలుకానున్నాయి. జరిమానా మొత్తాన్ని అప్పీల్ గడువు అనంతరం బాధితురాలికి పరిహారంగా అందించాలని కోర్టు ఆదేశించింది.



సముద్రతీర ప్రాంతాల్లో తాటి వనాల కోసం విత్తనాలు నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

# తీరానికి రక్షణ కవచం

>> నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిసృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి తాటి చెట్టు సొంతం. అందుకే పవన్ కల్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటును లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అందుకు దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ భావిస్తోంది. ఈ యేడాది తాటి కాయల సీజన్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో నాటే ప్రక్రియను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ సీజన్‌లో పవన్ కల్యాణ్ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్టు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# పట్టణాల అభివృద్ధికి యుకె సహకారం

>> హించిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, యుకె ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి పి. నారాయణ నాయకత్వంలో ఎపి ప్రతినిధి బృందం, యుకె ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యుకె డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యుకె సహకారం అందించనుందని తెలిపారు. బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్, సస్టైనబుల్ సిటీస్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీ వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం అందనుందని చెప్పారు. యుకెలోని వివిధ కంపెనీల బెస్ట్ ఎక్స్‌పర్టైజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేయడం ఈ భాగస్వామ్యం ద్వారా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.

లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ అమరావతి ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్‌లో భాగస్వామ్యం కావడం ఇప్పటికే ఉన్న సహకారానికి నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు యుకె ప్రతినిధులు ముందుకు వచ్చారని, యుకె డిప్యూటీ హై కమిషనర్, బిజినెస్ విభాగం డైరెక్టర్ జనరల్ సహా ప్రతినిధులు అమరావతికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారని మంత్రి తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకే యుకె ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈఅవగాహన ఒప్పందం చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం..**

ఆంధ్రప్రదేశ్- యుకె భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ-ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి. రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యుకె నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యుకె నైపుణ్యం**

అమరావతి అభివృద్ధిలో యుకె సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ + పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది. అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యుకె నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం..**

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన-అభివృద్ధి వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు.యుకెలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సిఆర్‌డిఎ కమిషనర్ విజయ రామరాజు, ఎపి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ రాహుల్, సిడిఎంఎ, ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యుకె ప్రతినిధి బృందంలో దక్షిణాసియా ట్రేడ్ కౌన్సిలర్ మార్క్ బిర్రెల్, డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, నేషనల్ లీడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిషికేష్ చందా, సౌత్ ఇండియా రీజినల్ హెడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోహిత్ చంద్రగిరి, గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా పాల్గొన్నారు.

# జూడాల సమ్మె విరమణ

>> తెలిపారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లు ప్రధానంగా స్టైపెండ్ పెంపుతో పాటు రిటైర్మెంట్ వయసు పెంచకూడదని జూడా ప్రతినిధులు ఇంతకుముందు డిమాండ్ చేశారని మంత్రి తెలిపారు. రిటైర్మెంట్ వయసు పెంపు అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ఆ అంశాన్ని కేవలం పరిశీలన మాత్రమే చేశామని చెప్పారు. జూడాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిపై మరోసారి పునఃపరిశీలన చేస్తామని వెల్లడించారు.

**స్టైపెండ్ పెంపు అంశంపై కమిటీ పరిశీలన**

స్టైపెండ్ పెంపు అంశంపై ప్రత్యేకంగా కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో జూడా సంఘాల నాయకులతో కమిటీ సమావేశమై వారి డిమాండ్లపై చర్చిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక పరిమితులు, అందుబాటులో ఉన్న వనరులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**నాన్ క్లినికల్ పోస్టులపైనా పునఃపరిశీలన**

నాన్ క్లినికల్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారిని నియమించే అంశంపైనా మరోసారి పునఃపరిశీలన చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త వైద్య కళాశాలలను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడిందని, అందులో భాగంగానే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. వాటికి తగిన స్పందన రాని పరిస్థితుల్లో కొన్నిచర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపైనా జూడాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలిస్తామని స్పష్టం చేశారు.

**సిఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం**

జూడాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పరిమితులపై జూడా నాయకులకు కూడా అవగాహన ఉందన్నారు. అందువల్ల ఇరువర్గాల మధ్య చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. 9,500 మంది వైద్యుల సేవలు కీలకంరాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపు 9,500 మంది జూడాలు సేవలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. పేద, సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతున్నారని, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల్లో జూడాల పాత్ర కీలకమని చెప్పారు. సమ్మె కారణంగా అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జూడాలు మానవతా దృక్పథంతో సమ్మె విరమించడం అభినందనీయమన్నారు.

ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మె విరమించిన జూడా నాయకులకు, డాక్టర్లందరికీ మంత్రి సత్యకుమార్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

## జూనియర్ డాక్టర్ల సమ్మెపై హైకోర్టులో విచారణ

### సమ్మె విరమిస్తున్నట్లు న్యాయస్థానానికి తెలిపిన జూడాలు

**విజయవాడ. ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** జూనియర్ డాక్టర్ల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై ఎపి హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సమ్మె విరమిస్తున్నట్లు జూడాల సంఘం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టుకు నివేదించింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని జూడాల సంఘం అభ్యర్థించింది. దీంతో రెండు వారాల్లో నిర్ణయం తీసుకో వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు జూడాల సంఘం నివేదించింది. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎపి జూడా) ఆధ్వర్యంలో ఈనెల 11న తొలిదశ, 12 నుంచి రెండోదశ ఆందోళనలు కొనసాగాయి. అత్యవసర సేవలు మాత్రమే అందిస్తూ 16వ తేదీ వరకు నిరసనలు తెలిపారు. 15 స్టైపెండ్ పెంచాలన్న జూడాల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడంతో 17 నుంచి మూడో దశ ఆందోళనలో భాగంగా అత్యవసరంతో పాటు అన్నిసేవలూనిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశారు.

## వారం - వర్జ్యం

26-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.త్రయోదశి ఉ.7.58
న.శ్రవణ రా.12.46
వ.తె.5.00-ఉ.6.42
దు.ఉ.11.44-మ.12.34
రాహు మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కష్టాలు ఎప్పుడు వంటరిగా రావు.

**వృషభం :** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఇంటాబయట ప్రోత్సాహం.

**మిథునం :** ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి మీ ఆత్మసాక్షికి విరుద్ధంగా ఓ కార్యక్రమాన్ని చేపడతారు. ఆహ్వానాలు.

**కర్కాటకం :** ఖచ్చితమైన ప్రణాళికలను రూపొందించు కుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వస్తువులు కొనుగోలు.

**సింహం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల ద్వారా విలువైన సమాచారం అందుకుంటారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల సలహాలు తీసుకుంటారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరం వుండండి. వాహనాలు కొనుగోలు యత్నాలు.

**వృశ్చికం :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్త్రా లాభం.

**ధనుస్సు :** మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మకరం :** వ్యాపారాలను ప్రారంభించడానికి గాను కావలసిన వనరులను సమకూర్చుకునే యత్నాలను ప్రారంభిస్తారు.

**కుంభం :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు.

**మీనం:** భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. జీవిత భాగస్వామి సహాయం సహకారాలను అందుకుంటారు. ధనలాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

>> సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సిఎం సూచించారు.

**2027 పుష్కరాలకు భారీగా భక్తులు..**

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవాదాయపర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఎఐ వినియోగం**

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఎఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సిసిటివి ఎంట్రీఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి..**

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు- పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు తీగ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌నుంచి కొవ్వూరువరకు రోడ్లు అభివృద్ధిచేయనున్నారు. రాజమహేంద్రవరం- పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంచేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావర్తి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సిఎం సూచించారు.

# శ్రీశైలంలో విషాదం

>> ఆత్మకూరు డి.ఎస్.పి రామాంజి నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, మెయిన్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను సుధాకర్(36), గోగుల ఆదిలక్ష్మి 50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ముగ్గురు అక్కలలో ఇద్దరుఅక్కలకు పెళ్లిళ్లుఅయిన భర్తలు వదిలేయడం, ఒక అక్కకు పెళ్లి చేయకపోవడం తీవ్ర అప్పులు కావడంతో ఓ అక్క కొడుకుతో సహా మొత్తం ఐదు మంది శ్రీశైలం వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ద్వారా సమాచారం తెలుస్తుంది.విషయం తెలుసుకున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఇఒ ఎం.శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్న సత్రంలోని రూమును పరిశీలించారు. మృతుల వివరాలను డిఎస్పీ రామాంజి నాయక్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రంలో ఒకే కుటుంబం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.

# సంకల్పం నెరవేరింది!

>> 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాను. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టును నా చేతుల మీదుగా ప్రారంభిస్తున్నాను. 10.7 టిఎంసిల నీటిని నల్లమల సాగర్‌కు రీలీజ్ చేయబోతున్నాం. ఈ చారిత్రక ఘట్టానికి ఈ నెల 31వ తేదీ మార్కాపురం జిల్లా వేదిక కాబోతోంది. ఫేజ్-1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2తో 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు. అలాగే లక్షలాది మందికి మంచి నీటితో తరతరాలుగా కరువుతో పోరాడిన ప్రజలకు ఉపశమనం కల్పించడమే మా లక్ష్యం అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. "వెలిగొండ జలవిజయంతో కరువు ప్రాంతంలో కృష్ణమ్మతో జలహారతి ఇస్తున్నాం. నెర్రలు బారిన నేలను కృష్ణా జలాలతో తడపబోతున్నాం. ఈ నెల 31వ తేదీ నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులుతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడుగుతుంది. ఈ జలంతో జీవం జీవితం... సాగు-బాగు. పశ్చిమ ప్రకాశం ప్రజల ఎన్నో యేళ్ల కల అయిన మార్కాపురంజిల్లాను ఏర్పాటు చేసి ఆ ఆకాంక్షను నెరవేర్చాం. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తున్నాం. నేషనల్ హైవేలు, పోర్టులతో ఈ ప్రాంతానికి లాజిస్టిక్స్ లోటు లేకుండా చేస్తున్నాం. బెంగుళూరు- అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తున్నాం అన్నారు.

# 'సెర్ప్'కు అవార్డు

>> హించిన దేశవ్యాప్త పిఎం ఎఫ్ఎంఈ కాంక్లేవ్ నందు ఈ అవార్డును బహుకరించారు. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ మైక్రో ఎంటర్ప్రైజెస్ సీడ్ క్యాపిటల్ కాంపోనెంట్ కింద ఆమోదించబడిన పనితీరు ప్రమాణాల ఆధారంగా స్వయం సహాయక సంఘ మహిళలకు అందిస్తున్న సేవలు, నిధుల వినియోగం, యూనిట్ల అభివృద్ధి తదితర అంశాల్లో వివిధ రాష్ట్రాల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల పనితీరును కేంద్ర ఆహార శుద్ధి మంత్రిత్వ శాఖ మూల్యాంకనం చేసింది. ఈ మూల్యాంకనంలో సెర్ప్ ఎపి సమగ్ర పనితీరు ఆధారంగా ఉత్తమ పనితీరు కనబరిచిన విజేతల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ సందర్భంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాస్వాన్ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ తరఫున జీవనోపాధుల విభాగపు డైరెక్టర్ డాక్టర్ శివ శంకర ప్రసాద్, అదనపు డైరెక్టర్ కె సరళ , కన్సల్టెంట్ రమ్య ఈ అవార్డును స్వీకరించారు.ఎస్ హెచ్ జి మహిళలకు సీడ్ కాపిటల్ ద్వారా, పీఎం ఎఫ్ఎంఈ పథకం ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను బ్యాంకుల ద్వారా అందించి, మహిళలను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దడానికి సెర్ప్ చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ అవార్డు రాష్ట్రంలోని మహిళా ఎంటర్ ప్రెన్యూర్స్ ని మరింత ప్రోత్సాహన్ని అందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు, మహిళల ఆర్థిక సాధికారత మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కరుణ వాకాటి తెలిపారు.

# నాలెడ్జ్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం

## ● డిసెంబర్ చివరికి క్వాంటం కంప్యూటింగ్ భవనం పూర్తి ● జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభించే దిశగా చర్యలు ● మంత్రి పొంగూరు నారాయణ

**సచివాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త :** అమరావతి రాజధాని నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. హైదరాబాద్‌ను ఐటి హబ్‌గా అభివృద్ధి చేసిన తరహాలో అమరావతిని క్వాంటం కంప్యూటింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా సుమారు 45,216చ.అ. విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్వాంటం ల్యాబ్ కోసం ప్రత్యేకమైన నిర్మాణ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. "రూమ్ విథిన్ రూమ్" కాన్సెప్ట్‌తో ల్యాబ్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. భూమి నుంచి వచ్చే సీస్మిక్ వైబ్రేషన్స్, పరిసర ప్రాంతాల నుండి వచ్చే ట్రాఫిక్ తదితర శబ్దాలు క్వాంటం కంప్యూటింగ్ పరికరాల పనితీరుపై ప్రభావం చూపకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు



తెలిపారు. ఇందుకోసం జర్మన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.

**క్వాంటం వ్యాలీలో రెండు భారీ టవర్లు:** క్వాంటం కంప్యూటింగ్ భవనం పక్కనే రెండు భారీ టవర్లు నిర్మించేందుకు ప్రభుత్వ ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. ఒక్కో టవర్ 48అంతస్తులతో 202మీటర్ల ఎత్తు ఉండేలా డిజైన్ చేసినట్లు చెప్పారు. రెండు టవర్లకు కలిపి సుమారు 37లక్షల చ.అ.విస్తీర్ణం అందుబాటులోనికి రానుందని తెలిపారు. హైదరాబాద్ సైబర్ టవర్స్ తరహాలో కాకుండా, అంతకంటే మెరుగైన స్థాయిలో క్వాంటం వ్యాలీ టవర్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి నారాయణ తెలిపారు.

**డిసెంబర్ చివరి నాటికి పూర్తి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన దిశానిర్దేశం మేరకు డిసెంబర్ చివరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ 15నాటికి ఎల్ అండ్ టి సంస్థ ఎంఇపి పనులు కోసం భవనాన్ని అప్పగించేలా చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు, క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందంజలో నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ స్పష్టంచేశారు. జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను అందుబాటులోనికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంటం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# అద్భుత నగరంగా అమరావతిని నిర్మిద్దాం

## సెక్రటేరియేట్, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఇంటీరియర్ డిజైన్లపై నార్మన్ పోస్టర్స్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలో అత్యంత అద్భుత నగరంగా అమరావతిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. పర్యాటక ఆకర్షణీయంగా నగరం ఉండాలన్నారు. విస్తారమైె రోడ్లు, రవాణా వ్యవస్థలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నామన్నారు. రాజధానిలో ప్రతి నిర్మాణం కళాత్మకంగా, సాంకేతికంగా అపూర్వంగా ఉండాలన్నారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న సెక్రటేరియేట్, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఇంటీరియర్ డిజైన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధుల బృందం ఇంటీరియర్ డిజైన్లను ప్రజెంట్ చేసింది. దీనిపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. అమరావతి అంటే ఇట్టే ప్రపంచమంతా గుర్తించాలన్నారు. విద్య, వైద్య రంగాల్లోను, సాంకేతికపరంగా నగరం ప్రత్యేకంగా




ఉండాలన్నారు. ఈ నగరంలో నిర్మాణాల ఇంటీరియల్ డిజైనింగ్ విషయంలో అత్యంత నైపుణ్యత ఉండాలన్నారు. నగరంలో ఒక ప్రదేశం నుంచి మరో ప్రాంతానికి సునాయాసంగా వెళ్ళగలిగే దిశలో రవాణా వ్యవస్థ డిజైనింగ్ ఉండాలన్నారు. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించి ఇప్పటికే మనం అనుకున్న దిశలో నిర్మాణాలు ఉండాలన్నారు. ఏ విషయంలో రాజీలేకుండా రాజధానిని నిర్మిద్దామన్నారు. ఈ సమీక్షలో మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధి శాఖ, సీఆర్డీఏలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజధానిలో ఏడుచోట్ల ఎనర్జీ స్టేషన్లు

## - టెండర్లను ఆహ్వానించిన సిఆర్‌డిఎ



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఏడుచోట్ల విద్యుత్ వాహన ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. దీనికోసం టెండర్లను ఆహ్వానించింది. స్టేషన్ల ఏర్పాటుకు 18.25 ఎకరాలను కేటాయించింది. అనంతవరంలో ఒకటి, కురగల్లులో మూడు, నేలపాడులో రెండు, వెలగపూడిలో ఒకటి ఏర్పాటు చేయనున్నారు. అమరావతి రోడ్డు నెట్‌వర్క్‌ని పౌర సౌకర్యాల ఏర్పాటులో భాగంగా సమీకృత, బహుళ ఉపయోగ 'ఎనర్జీ స్టేషన్లను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు టెండర్లలో పేర్కొంది. భవిష్యత్లో పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి, ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్, రిటైల్, ఫుడ్ అండ్ బెవరేజ్, వెల్‌నెస్ వంటి సదుపాయాలూ కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

సెక్రటేరియట్, లెజిస్లేచర్, జ్యుడీషియరీ అనుబంధ ప్రభుత్వ కార్యాలయాల వాహనాలకు 24 గంటలూ అందుబాటులో ఉండాలని పొందుపరిచారు. జాతీయ విద్యుత్ వాహన మొబిలిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసే ఈ కేంద్రాలకు సంబంధించి అమరావతి ప్రయోగాత్మక కేంద్రంగా ఉండాలని నిర్ణయించినట్లు టెండర్లలో పేర్కొన్నారు. ముఖ్యమైన ఆర్టీరియల్ ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ల వెంట ప్రతిఒక్కరూ చేరుకునేలా వీటిని పెట్టాలని ప్రతిపాదించారు.

భవిష్యత్‌లో వచ్చే హైడ్రోజన్ వాహనాలకు ఇంధనం నింపే కేంద్రాలుగా మార్చేలా ఈ కేంద్రాలు మారుతాయని తెలిపారు. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 33యేళ్ల కాలం, అవసరమైతే మరో 33యేళ్లు కాలపరిమితిని పొడిగించనున్నట్లు టెండర్లలో పేర్కొన్నారు. ఒక కంపెనీకి మూడు స్టేషన్లు మాత్రమే ఇస్తామని తెలిపారు. వార్షిక లీజు అద్దె ఇంధన, ఇంధనేతర ఆదాయంపై నిర్దిష్ట శాతం కమీషన్ చెల్లించే ప్రాతిపదికన భూ భాగాలను కేటాయించనున్నట్లు వివరించారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

T.N.No.02/2026-27/CE/SE(P)/EE(PD-I)/GVMC/ Dt: 25.08.2026

Number of Works : 01 (One), Value of Works (ECV) : Rs.116.35 Crores
Downloading starting Date : 27.08.2026 @ 5.00 PM
Downloading End Date : 16.09.2026 @ 3.00 PM
Last date for Submission of bid : 16.09.2026 @ 5.00 PM
Further Details at http://www.apeprocurement.gov.in
O/o the Executive Engineer (PD-I) Division : 9848308824 Sd/- Commissioner


# అక్రమ సంపాదనతో భారీగా ఆస్తుల కొనుగోలు

## కుటుంబసభ్యుల ఖాతాల్లో కోట్ల రూపాయలు జమ

## కారుమూరి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** వైసిపి హయాంలో వెలుగుచూసిన మద్యం రవాణా కుంభకోణం కేసులో నిందితుడుగా వున్న మాజీ మంత్రి, వైసిపి నేత కారుమూరి నాగేశ్వరరావు రిమాండు రిపోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు కీలక విషయాలు వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేయగా సోమవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచి రిమాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలిసిందే. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో కారుమూరి పాత్రతోపాటు ఆయన కుటుంబసభ్యులు ఎంతమేర లబ్ధి పొందారనే వివరాలను ఇడి అధికారులు మంగళవారం నాంపల్లిలోని ఇడి కోర్టుకు రిమాండు రిపోర్టులో సమగ్రంగా వెల్లడించారు. ఈ స్కాంకు సంబంధించి ఎపి బెవరేజెస్ నాటి ఎండి వాసుదేవరెడ్డితో పాటు కీలక సూత్రధారిగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డిని, కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్ రెడ్డిని ఇదివరకే అరెస్టు చేయగా తాజాగా నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఈడీ వెల్లడించింది. మద్యం రవాణా కుంభకోణంలో కారుమూరి నాగేశ్వరరావు ఒక ముఠాను ఏర్పాటుచేసి సర్కారు ఖజానాకు 195.33 కోట్ల రూపాయల మేరకు నష్టం కలిగించారని ఇడి పేర్కొంది. ఈ స్కాంలో కొల్లగొట్టిన డబ్బులో రూ.11.95 కోట్లు కారుమూరి ఖాతాలో వెళ్లిందని, దీంతో పాటు రూ18.09 కోట్ల మనీలాండరింగ్ జరిగిందని ఈడీ పేర్కొంది. కారుమూరి అప్పట్లో మంత్రిగా వుండడం, రాజకీయంగా బలంగా వుండడంతో అక్రమాలకు పాల్పడ్డాడని ఈడీ పేర్కొంది. తన ఖాతాలో వచ్చిన డబ్బులతో కారుమూరి పాత అప్పులను తీర్చడం, పెద్దఎత్తున స్థిరచరాస్తులను కొన్నట్లు ఈడీ తెలిపింది. తన పుట్టిన రోజు వేడుకలను ఈ డబ్బులతోనే ఘనంగా జరుపుకున్నాడని, ఖరీదైన వాచీలు కొనడంతో పాటు విమానాల్లో అనేక ప్రాంతాలకు పర్యటించినట్లు ఈడీ తెలిపింది. ఇక రాజ్ కసిరెడ్డి నెలకు రూ.50 నుంచి 60 లక్షల వరకు తీసుకునేవాడని ఈడీ వెల్లడించింది. మొదట అనుమాని తుడుగా కారుమూరి నాగేశ్వరరావుకు పది నోటీసులు ఇచ్చామని, అయితే ఆయన విచారణకు రాకుండా కేసు ముందుకు సాగకుండా, విచారణ జరగకుండా చూసేందుకు తన పలుకుబడిని వాడారని, తప్పించు కుతిరిగారని తెలిపింది. మద్యం అక్రమ రవాణాలో సంపాదించిన డబ్బులను తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించడంలో కారుమూరి పాత్ర వుందని పేర్కొంది. మద్యం అక్రమ రవాణాలో పలువురికి కారుమూరి సబ్ కాంట్రాక్టులు ఇప్పించి అందులో 50శాతం వాటా పొందాడని, ఇలా సంపాదించిన డబ్బులను కారుమూరి కుమారుడు సునీల్ రెడ్డి, భార్య కీర్తి, మామ ప్రతాప్ రెడ్డి, తల్లి కారుమూరి లక్ష్మీ కిరణ్, సోదరి దీపికా, ఆమె మామ అచ్చప్ప రామూర్తిల బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ తన రిమాండు రిపోర్టులో వెల్లడించింది. మద్యం రవాణాలో ఒక్కో మద్యం కేసుపై కిలోమీటర్‌కు రూ13ల చొప్పున దోచుకున్నారని, ఈడీ తెలిపింది.


Ref B1/155/2026 dt.14.08.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

**ఫారం నెం: VI (ఎ)**

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

**ప్రాధమిక ప్రకటన**

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన ఏలూరు జిల్లా **వేలేరుపాడు** మండలం, **రాళ్ళపూడి గ్రామము** నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద **కూనవరం** మండలం, **పెద్ద ఆర్కూరు** గ్రామం లోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా భూమి , పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, చింతూరు,మరియు ఆర్&ఆర్ అధికారి చింతూరు యూనిట్, చింతూరు, పోలవరం జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె12011/74/20051ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10.05.2020వ తేదిన జారీ చేసిన జి. ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి ఆర్ పురం యూనిట్1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాధమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి ఆర్ పురం యూనిట్1 , చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తివ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

**షెడ్యూలు**

జిల్లా: ఏలూరు | మండలం: వేలేరుపాడు | గ్రామం : రాళ్ళపూడి

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | మొత్తము విస్తీర్ణం (య.గుంటలు ) | భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.గుంటలు ) | విస్తీర్ణం (య. సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరము | దక్షిణం | చెట్లు కట్టడములు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 1 | 5.12 | 5.12 | 5.300 | khalsa | చను పల్లి అప్పారావ్ తండ్రి సరవయ్య | 97 | 97 | 97 | 97 | |
| 2 | 2 | 2.00 | 2.00 | 2.000 | khalsa | పొయమ్మ రాజులు తండ్రి రాజులు | 77 | 73,72 | 74 | 71 | రాటి 2 |
| 5 | 8 | 2.38 | 2.38 | 2.950 | G.D | పుకి చిన్న భీమయ్య తండ్రి రామయ్య | 97 | 11 | 97 | 10&9 | రాటి 6 |
| 7 | 11 | 1.19 | 1.19 | 1.475 | G.D | తుర్రమ్ సంకురమ్మ భర్త ముత్యాలు | 8 | 12 | 97 | 10 | రాటి 4 |
| 10 | 14 | 1.06 | 1.06 | 1.150 | G.D | సోయం మహాలక్ష్మి భర్త బజారు | 13 | 15 | 13 | 15 | రాటి 10 |
| 11 | 17 /ఇ | 2.31 | 2.31 | 2.775 | G.D | అగరం రాముడు తండ్రి కన్నయ్య | 16 | 144 | 18&140 | 141&142 | |
| 12 | 19 | 1.37 | 1.37 | 1.925 | G.D | పొడి వెంకమ్మ తండ్రి గంగయ్య | 20 | 18 | 31 | 16 | రాటి 5 |
| 13 | 25 /2 | 1.11 | 1.11 | 1.275 | G.D | కుంజ లక్ష్మమ్మ య్య తండ్రి కన్నయ్య | 97 | 28 | 26 | 24 | రాటి 4 |
| 14 | 25/ఇ | 1.11 | 1.11 | 1.275 | G.D | | 97 | 28 | 26 | 24 | రాటి 4 |
| 15 | 14 | 3.00 | 3.00 | 3.000 | G.D | కర్సం తమ్మయ్య తండ్రి వెంకయ్య | 25 | 29 | 27 | 21 | రాటి 3 |
| 16 | 42 | 1.05 | 1.05 | 1.125 | G.D | సోయమ్మ రాజులు తండ్రి రాజులు | 41 | 83 | 40 | 45 | |
| 17 | 51/అ | 1.09 | 1.09 | 1.225 | G.D | సోయం రాజులు తండ్రి ముత్యాలు | 25 | 29 | 27 | 21 | |
| 18 | 51/అ | 1.10 | 1.10 | 1.250 | G.D | తుర్రమ్ సంకురమ్మ తండ్రి ముత్యాలు | 18&140 | 52 | 50 | 139 | |
| 19 | 132/అ | 0.36 | 0.36 | 0.900 | G.D | తుర్రం మంగమ్మ తండ్రి మల్లయ్య | 127 | 133 | 131 | రామవరం 81 | రాటి 4 |
| 20 | 132/అ | 0.36 | 0.36 | 0.900 | G.D | తుర్రం నాగయ్య తండ్రి మల్లయ్య | 98 | 97 | 97 | 98 | రాటి 2 |
| 21 | 132/ఇ | 0.36 | 0.36 | 0.900 | G.D | తుర్రం మల్లయ్య తండ్రి బుచ్చయ్య | 98 | 97 | 97 | 98 | రాటి 4 |
| 22 | 135 | 2.07 | 2.07 | 2.175 | G.D | గొల్లమందల మరియమ్మ తండ్రి వెంకయ్య | 136 | 136 | 134 | 136 | రాటి 7 |
| 23 | 142/1 | 1.07 | 1.07 | 1.175 | G.D | పుకి కన్నమ్మ భర్త బుచ్చయ్య | 144 | 141&17 | 17 | 143 | |
| TOTAL | | 32.31 | 32.31 | 32.775 | | | | | | | |

Place: వి.ఆర్.పురం యూనిట్ - 1
Date : 14-08-2026

కె.నాగమల్లేశ్వరరావు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
వి.ఆర్.పురం యూనిట్ - 1, చింతూరు.

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం


## గంజాయి పట్టివేత

**చీరాల, ఆగస్టు 25 ప్రభాతవార్త:** చీరాల రైలు మార్గంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను చీరాల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల కట్టడికి చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ పట్టివేత జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తమిళ నాడు రాజధాని చెన్నైకి చెందిన బాల శ్యాంప్రసాద్(19), అరవిందన్ శంకర్(18) అనే ఇద్దరు యువకులు మరో వ్యక్తితో కలిసి పార్వతీపురంలో గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం దానిని చెన్నైకి తరలించేందుకు రైలులో ప్రయాణిస్తుండగా, బాపట్ల- చీరాల మధ్య పోలీసులు రైలు తనిఖీలు చేపట్టడాన్ని గమనించారు. పట్టుబడతామనే భయంతో 24వ తేదీ రాత్రి చీరాల రైల్వేస్టేషన్‌లో దిగిపోయారు. నిందితుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో, చీరాల ఎస్పీడీవో సూచనల మేరకు వన్‌టౌన్ ఎస్ఐ హారిక నేతృత్వంలోని పోలీసు బృందం పట్టణంలోని దండుబాట రోడ్డు టీ జంక్షన్ వద్ద నిఘా పెట్టింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, 11 కిలోల గంజాయి లభ్యమైంది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా) (CIN:L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV-A- (నియమం 8(6) నిబంధన చూడండి) స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6) ఏర్పాటుతో చదువబడే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకంగా రుణగ్రహీత/లు)/సహ-రుణగ్రహీత(లు), తనఖాదారులు(లు) మరియు హామీదారులు(లు) (ఎవరైతే సెక్యూరిటీ క్రెడిటార్కు తనఖా ద్వారా ఆర్థిక రుణ సౌకర్యాన్ని పొందారో వారికి) AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకొనబడిన వారికి ఈ ప్రకటన జారీ చేయబడుతోంది. ఇక నుండి ఆపై అది AUSFBకి రిఫర్ చేయబడుతుంది. ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంక్ లిమిటెడ్ ఏదైతే ఇప్పుడు 01వ ఏప్రిల్ 2024 నుండి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ లోనికి మరియు విలీనమైందో దాని నుండి క్రింద వివరింపబడిన స్థిరాస్తులు. స్వాధీనం చేసుకొన్న సెక్యూర్డ్ ఆస్తుల క్రింద పట్టికలో పేర్కొన్న మొత్తం రికవరీ నిమిత్తం 'ఏది ఎక్కడ' 'ఎలా ఉన్నవీ అక్కడ అలా' 'ఏవి ఎలా ఉన్నవీ' మరియు 'అక్కడ ఏదో అలాగే' ప్రాతిపదికన తదుపరి వచ్చే వడ్డీ, ధర, ఛార్జీలు మరియు ఖర్చులు AUSFBకి అనగా సెక్యూర్డ్ క్రెడిటార్కు బకాయి కారణంగా ఇవేలం ద్వారా విక్రయించబడతాయి.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వెబ్సైట్ **https://sarfaesi.auctiontiger.net** ద్వారా బహిరంగ ఇవేలం నిర్వహిస్తున్నారని మీకు తెలియజేస్తున్నాము.

| రుణ ఖాతా నం. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, తనఖాదారులు, హామీదారుడి పేరు | డిమాండ్ నోటీస్ను 13(2) యొక్క తేదీ & మొత్తం | స్వాధీనతా తేది | ఆస్తి కొరకు రిజర్వ్ ధర | ఆస్తి కొరకు బయానా | ఇ-వేలం తేదీ & సమయం | బిడ్ సమర్పణ తేది | టెండర్ దాఖలు యొక్క ఇ-వేలం ప్రదేశం | సంప్రదించు వ్యక్తి & ఆస్తి దర్శించుతేదీ |
|---|---|---|---|---|---|---|---|---|
| (Loan A/C No.) L22660000579761 పర్రి వెంకటేశ్వర్లు (రుణగ్రహీత) పర్రి రేవతి (సహ-రుణగ్రహీత) | 21-ఆగస్ట్-24 రూ.13,27,259/- రూ.పదమూడు లక్షల ఇరవై ఏడు వేల రెండు వందల యాభై తొమ్మిది మాత్రమే. 13-ఆగస్ట్-24 నాటికి | 11-మే -26 | రూ. 27,30,000/- రూ.ఇరవై ఏడు లక్షల ముప్పై వేలు మాత్రమే | రూ. 2,73,000/- రూ. రెండు లక్షల డెబ్బై మూడు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ చిరునామా : 1వ అంతస్తు, హరిహరనగర్ నం. 7, 1200/3 మంగమూరు రోడ్, వార్డు నం. 35 ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ 523001 | పర్రి వెంకటేశ్వర్లు 9989156979 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ పరిధి, కొత్తపట్నం మండలం, రంగాయపాలెం గ్రామ పంచాయతీ, రంగాయపాలెం గ్రామం, సర్వే నం. 561/2, డోర్ నం. 1-146, అసెస్‌మెంట్ నం. 241. ఈ ఆస్తి పరిధిలో మొత్తం 3523.6 చదరపు అడుగులు లేదా 48 గడీల 67.6 చదరపు అడుగులు/391.5 చదరపు గజాలు/327.33 చదరపు మీటర్ల స్థలం మరియు దానిపై ఉన్న 319 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన RCC భవనం అన్ని అమరికలు మరియు అనుబంధ హక్కులతో సహా ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం: 391 చదరపు గజాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (Loan A/C No.) L23660002106836 & L22660001430344 కోకి సుబ్బారెడ్డి (రుణగ్రహీత) కోకి అరుణ (సహ-రుణగ్రహీత) | 15-మే-25 రూ.10,22,763/- రూ.పది లక్షల ఇరవై రెండు వేల ఏడువందల అరవై మూడు మాత్రమే. 15-మే-25 నాటికి | 16-జూన్ -26 | రూ. 13,20,000/- రూ.పదమూడు లక్షల ఇరవై వేలు మాత్రమే | రూ. 1,32,000/- రూ. ఒక లక్ష ముప్పై రెండు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : వార్డ్ నం.23, నం. 23/1/21/1/2 సంత బజార్ వీధి, ఉడ్‌నగర్ కాలనీ, చీరాల, ఆంధ్రప్రదేశ్ -523155 | పర్రి వెంకటేశ్వర్లు 9989156979 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, బాపట్ల ఆర్.డి. మురుప్రోలువారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మురుప్రోలువారిపాలెం గ్రామంలో గల డి. నంబర్ 264/1లో 0-07 1/2 సెంట్లు లేదా 350.9 చదరపు గజాల స్థలం. ఇందులో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ACC ఇంటి నిర్మాణం పాత ఇంటి నంబర్ 10-108, ప్రస్తుత ఇంటి నంబర్ 2-116, అసెస్‌మెంట్ నంబర్ 316 మరియు దానికి సంబంధించిన అన్ని ఫిక్చర్లు అలాగే ఈజ్‌మెంట్ హక్కులు కలిగి ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం: 350 చదరపు గజాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (Loan A/C No.) L23660000268674 మార్నె ఆదిశేషురెడ్డి (రుణగ్రహీత) మార్నె వెంకటేశ్వరమ్మ (సహ-రుణగ్రహీత) | 28-ఫిబ్రవరి-25 రూ.7,64,239/- రూ.ఏడు లక్షల అరవై నాలుగు వేల రెండు వందల ముప్పై తొమ్మిది మాత్రమే. 24-ఫిబ్రవరి-25 నాటికి | 11-జూన్ -26 | రూ. 8,50,000/- రూ. ఎనిమిది లక్షల యాభై వేలు మాత్రమే | రూ. 85,000/- రూ. ఎనభై ఐదు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : వార్డ్ నం.23, నం. 23/1/21/1/2 సంత బజార్ వీధి, ఉడ్‌నగర్ కాలనీ, చీరాల, ఆంధ్రప్రదేశ్ -523155 | శెల్లా ప్రవీణ్ 8008801095 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, బాపట్ల SRO బాపట్ల ఆర్‌డి పరిధిలోని ఆడవి గ్రామ పంచాయతీ, కొత్త వాడరేవు గ్రామం ఆడవి గ్రామం. D.No 577/5 లోని మొత్తం 0-13 ఎకరాల స్థలంలో, 0-05 1/2 ఎకరాలు లేదా 266.2 చదరపు గజాలు విస్తీర్ణం గల స్థలం మరియు దానిపై ఉన్న RCC భవనం D.No 6-225, అసెస్‌మెంట్ నం. 1551. ఈ స్థలంలో 660 చదరపు అడుగుల విస్తీర్ణంలో RCC భవనం ఉంది; దీనితో పాటు అన్ని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులు అనుబంధ హక్కులు కూడా వర్తిస్తాయి. మొత్తం విస్తీర్ణం: 266 చదరపు గజాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (Loan A/C No.) L23630000000430 ఒస్సారి వీరన్న (రుణగ్రహీత) ఒ.మల్లీశ్వరి (సహ-రుణగ్రహీత) | 15-మే-24 రూ.10,85,572/- రూ. పది పది లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల డెబ్బై రెండు మాత్రమే. 02-మే-24 నాటికి | 01-జూన్ -26 | రూ. 19,30,000/- రూ. పంతొమ్మిది లక్షల ముప్పై వేలు మాత్రమే | రూ. 1,93,000/- రూ. ఒక లక్ష తొంభై మూడు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : వార్డ్ నం.4, 1వ అంతస్తు రాజ స్ట్రీట్, నందికొట్కూరు వగిద్యాల రోడ్, నందికొట్కూరు, ఆంధ్రప్రదేశ్ 518401 | తొగట విజయ్ 9182357270 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సర్వే నంబర్ 476లో 242 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం మరియు ఇల్లు ఇంటి నంబర్ 2-102, అసెస్‌మెంట్ నంబర్ 361. ఇవి నంద్యాల జిల్లా, నందికొట్కూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని వగిద్యాల గ్రామ పంచాయతీ గ్రామం మరియు మండలంలో ఉంది. విస్తీర్ణం: 242 చదరపు గజాలు; నిర్మాణ విస్తీర్ణం గ్రౌండ్ ఫ్లోర్: 1080 చదరపు అడుగులు. కొలతలు: తూర్పు పడమర: 25 అడుగులు, ఉత్తర దక్షిణం : 41.5 అడుగులు. మొత్తం విస్తీర్ణం: 242 చదరపు గజాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (Loan A/C No.) L22660000765331 సర్వేపల్లి వెంకయ్య (రుణగ్రహీత) సర్వేపల్లి మంగలమ్మ (సహ-రుణగ్రహీత) | 18-జూలై-24 రూ.5,46,448/- రూ.ఐదు లక్షల నలభై ఆరు వేల నాలుగు వందల నలభై ఎనిమిది మాత్రమే. 17-జూలై-24 నాటికి | 23-జూన్ -26 | రూ. 9,10,000/- రూ. తొమ్మిది లక్షల పది వేలు మాత్రమే | రూ. 91,000/- రూ. తొంభై ఒక్క వేయి మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ చిరునామా : 1వ అంతస్తు, హరిహరనగర్ నం. 7, 1200/3 మంగమూరు రోడ్, వార్డు నం. 35 ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ 523001 | పర్రి వెంకటేశ్వర్లు 9989156979 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా-ఒంగోలు సబ్‌డివిజన్ - కొత్తపట్నం మండలం - పదర్తి గ్రామం, పంచాయతీ పరిధి - సర్వే నంబర్ 500: అన్ని రాకపోకలు మరియు అనుబంధ హక్కులతో కూడిన 1904 చదరపు అడుగులు లేదా 26.32 గడీలు/211.59 చదరపు గజాలు/176.860 చదరపు మీటర్లు విస్తీర్ణం కలిగిన స్థలం. కొలత: 211.55 చదరపు గజాలు.

**ఇ-వేలం అమ్మకం నిబంధనలు మరియు షరతులు:**

1). సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం "ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే", "ఏది ఉందో అలాగే", "ఏది ఉందో అలాగే" మరియు "అక్కడ ఏదీ" ఆధారంగా సెక్యూర్డ్ క్రెడిటర్ అంటే AUSFB తరపున జరుగుతుంది మరియు పేర్కొన్న ఆస్తిపై ఎటువంటి తెలిసిన చిక్కులు లేవు.

2). ఆన్లైన్ ఇవేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ డాక్యుమెంట్, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ విషయంలో బోర్డు రిజల్యూషన్ మరియు ఫోటో ఐడి, చిరునామా రుజువును బయానాతో పాటు సమర్పించాలి, దీనిని MSME AUCTION POOL ACCOUNT OF AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, కరెంట్ ఖాతా నం. 1921201121711599 AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఐదవ మరియు ఆరవ అంతస్తు సన్నీ బిగ్ జంక్షన్ STC ఖస్రా నం. 64 నుండి 67, గ్రామ్ సుఖ్లెపురా న్యూ ఆతిష్ మార్కెట్ జైపూర్ 302020, IFSC కోడ్: AUBL0002011. ఆన్‌లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోలేరు. ఇంకా బిడ్డర్ సమర్పించిన ఏదైనా EMD రద్దు చేయబడిన చెక్కు కాపీతో RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్ను ఈ క్రింది ఇమెయిల్ IDకు అంటే auction.aubank.inకు పంపాలి.

3) ఆసక్తిగల పాల్గొనేవారు/బిడ్డర్లు అందరూ మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌ను సందర్శించాలని అభ్యర్థించారు. ఇ-వేలం అమ్మకాల ప్రక్రియలో పాల్గొనడానికి నిబంధనలు & షరతులు మరియు auctions.aubank.in ఇమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

దయచేసి గమనించండి: పైన పేర్కొన్న తేదీన టెండర్/ఇంటర్ సే బిడ్డింగ్ ద్వారా అమ్మకం గురించి పైన పేర్కొన్న రుణ ఖాతా యొక్క రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/ తనఖాదారులకు నియమం 8(6)తో కలిపి చదవబడిన నియమం 9(1) కింద ఇది 30 రోజుల నోటీసు కూడా. ఇచ్చిన నోటీసు వ్యవధిలో రుణగ్రహీత వారి బకాయిలను పూర్తిగా తిరిగి చెల్లించకపోతే ఆస్తి అమ్మబడుతుంది.

తేది: 25/08/2026 ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

వార్త


మితభాషి ఎక్కువగా వినగలుగుతాడు కనుక అతనే అధికంగా నేర్చుకుంటాడు.

- లాబ్ సాంగ్‌రపా

## ఉల్లికి పాట్లు!

ఈ భూప్రపంచం మీద 'వాన రాకడ ప్రాణంపోకడ' గురించి చెప్పగలిగే ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం పెరుగుతూనే ఉంది. కానీ మార్కెట్లోకి 'ఉల్లి రాకడ ధరల పోకడల' గురించి చెప్పే ఏ శాస్త్రము అందుబాటులో లేదు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రజ్ఞులు అంచనాలు కూడా తారుమారవుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానం ఉపయోగపడక ఉల్లిధరల విషయంలో ఎప్పుడూ ఒక అడుగు వెనకాలే ఉంది. ఒక సీజన్లో ఉల్లిధర పెరిగితే, మరో సీజన్లో ఉల్లి ధర తగ్గుతుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యం చేసుకోలేక ఉల్లి రైతు సతమతమవుతున్నాడు. ఉల్లి సాగుకు దూరమౌతున్నాడు. నిన్నమొన్నటి వరకు రైతుకు గిట్టుబాటుధర లేకమార్కెట్ యార్డుల్లోనే ఉల్లిని వదిలేసే పరిస్థితి ఉండగా, నేడు అదే ఉల్లి వినియోగదారుల జేబుకు చిల్లుపెడుతోంది. ఉల్లి ధర మళ్లీ సామాన్యుడి వంటింట్లో మంటలు రేపుతోంది. లోపభూయిష్టమైన వ్యవసాయ మార్కెట్ వ్యవస్థ తెచ్చిపెట్టే అనర్థమిది. ప్రస్తుతం దేశంలోని ప్రధాన ఉల్లి మార్కెట్లలో సరఫరా తగ్గడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, రవాణా సమస్యలు వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. పంటసాగు విస్తీర్ణం తగ్గడం, రుతుపవనాలు ఆలస్యం కావడం వంటివి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. దేశంలోనే అతిపెద్ద ఉల్లి ఉత్పత్తిదారు మహారాష్ట్రలో ఈసారి ఖరీఫ్ పంట దిగుబడి 5 నుంచి 7శాతం వరకు తగ్గడమే ఈధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒక సీజన్లో ధరలు పడిపోతే రైతు నష్టపోతాడు. మరుసటి సీజన్లో రైతులు సాగు తగ్గిస్తే తగిన దిగుబడి లేకధరలు పెరుగుతాయి. ప్రధానంగానేమోటా, ఉల్లి విషయంలో ఏటా ధరల చక్రం ఇదేమాదిరి పునరావృతమవుతున్నా, శాశ్వత పరిష్కార మార్గం దొరకడం లేదు. ఉల్లి సంక్షోభం కేవలం ధరల సమస్య కాదు. ఇది వ్యవసాయ విధానాల వైఫల్యానికి అద్దం. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోయి సామాన్యుడికి పక్కలు చూపిస్తుండటంతో, వాటిని అదుపులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బఫర్ స్టాక్‌లోని ఉల్లిని మార్కెట్‌కు తరలించేందుకు 'కందా ఎక్స్‌ప్రెస్'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా, ఉల్లి బఫర్ నిల్వలను నాసిక్ నుంచి ఢిల్లీ, చెన్నై, కొచ్చి, గువాహటి వంటి నగరాలకు తరలించి సరఫరాను పెంచి ఆయా ప్రాంతాల్లో ధరలను అదుపు చేసే చర్యలు చేపట్టింది. ఇటువంటి అత్యవసర చర్యలు తాత్కాలికంగా మాత్రమే ధరలను నియంత్రిస్తాయి. కానీ ప్రతిసారీ సంక్షోభం వచ్చినప్పుడు బఫర్ స్టాక్ విడుదల చేయడం కంటే, ఉల్లి ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వ్యవస్థను సమగ్రంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. రాయలసీమలో వర్షాభావ పరిస్థితులతో ఉల్లిసాగు గణనీయంగా తగ్గింది. ఉల్లి ధరలు జూన్‌లో కిలోకు సుమారు రూ.25 నుంచి ఆగస్టులో రూ.60 వరకు పెరిగినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లోఆంధ్రప్రదేశ్‌లో గిట్టుబాటు ధర లేక కొందరు రైతులు ఉల్లిపంటలను మార్కెట్ యార్డుల్లో వదిలేసిన ఘటనలు నమోదయ్యాయి. రైతు ఉత్పత్తి చేసినప్పుడు ధర లేదు. కొరత ఏర్పడినప్పుడు కూడా వినియోగదారుడికి గిట్టుబాటు ధర దక్కడం కష్టం. రైతుకు కనీస గిట్టుబాటు ధర, శాస్త్రీయ నిల్వ సదుపాయాలు, సమయానుకూల ప్రభుత్వ కొనుగోళ్లు అవసరం. వినియోగదారుడికి మాత్రం స్థిరమైన సరఫరా, పారదర్శక మార్కెట్ ధరలుండాలి. రైతు వినియోగదారుల మధ్య ఉన్న మార్కెట్ గొలుసులో అనవసరమైన మధ్యవర్తిత్వం, నిల్వదారుల దోపిడీ, కృత్రిమకొరతకు అవకాశం లేకుండా పర్యవేక్షణ పెరగాలి. రైతు ఉత్పత్తులు పెంచడమే కాదు, ధరల స్థిరత్వం కూడా ప్రభుత్వ బాధ్యతే. ధరల అస్థిరతకు శాశ్వత పరిష్కారం కావాలి. ఒక సమతుల్య మార్కెట్ వ్యవస్థను నిర్మించాలి. రైతుకు న్యాయమైన ధర, వినియోగదారుడికి అందుబాటు ధర ఈ రెండింటినీ సాధించగలిగినప్పుడే వ్యవసాయమార్కెట్ విజయవంతమైనట్లవుతుంది. శనివారం నాటికి దేశంలో ఉల్లి సగటు రిటైల్ ధర కిలోకు రూ.42కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఇది దాదాపు 45 శాతం, గత నెలతో పోలిస్తే 19 శాతం అధికం. ముఖ్యంగా ఢిల్లీలో కిలోఉల్లి ధర రూ. 65కి చేరగా (గతేడాది ఇదే సమయానికి రూ. 35), చెన్నైలో రూ. 58కి (గతేడాది రూ. 33) విక్రయిస్తున్నారు. కేరళ, అసోం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా ధరలు గణనీయంగా పెరిగాయి. మార్కెట్లలో సరఫరా పెంచి, ధరలు మరింతపెరగకుండా నిరోధించడమే తమ లక్ష్యమని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధిఖరే ధృవీకరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థలు సుమారు 1.2 లక్షల టన్నుల ఉల్లిని సేకరించాయని, ప్రభుత్వంతో పాటు రైతులవద్ద కూడా తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్పినవిధం. 'ధరలస్థిరీకరణ నిధి' కింద ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంతో... ఒక పక్క పశ్చిమాసియా యుద్ధ వాతావరణం నేపథ్యం దాదాపు అన్ని నిత్యావసర వస్తువులు, చమురు ధరలపెరుగుతుండగా, తాజాగా ధరలను అదనంగా ఎత్తుకు తీసుకుపోయింది. మహారాష్ట్రలో నిల్వ ఉంచుతున్న ఉల్లిలో 50–70శాతం దెబ్బతినడం కూడా ఉల్లి సరఫరాకు ఆటంకంగా ఉందని భోగట్టా. రాష్ట్రాల వ్యాపారులపై కేంద్రం స్టాక్ లిమిట్ నిర్దేశించడం, ఎగుమతులపై ఆంక్షలు, 40శాతం ఎగుమతి సుంకం విధించడం మంచిదేమో ఆలోచించాలి. అప్పుడే ఉల్లిధరల ఘాటు శాంతిస్తుంది. గతంలో 2024 అక్టోబర్‌లోనూ ఉల్లిధరల నియంత్రణకు ఇలాంటి ప్రత్యేక రైళ్లనే వినియోగించారు. ఏదైనా ఇలాంటి సందర్భాల్లో శాశ్వత పరిష్కారం మేలు.

మనలోని ప్రతిభను గుర్తించి దానిని వెలికితీసి రాణింపునకు తీసుకురావడానికి ప్రయత్నించేవారే మంచి మిత్రులు.



హెన్రీఫోర్డ్

ఈశతాబ్దాన్ని తప్ప మిగతా అన్నింటినీ, ఈ దేశాన్ని తప్ప మిగిలిన అన్ని దేశాలను ఉత్సాహంగా కీర్తించేవాడు మూర్ఖుడు.



సర్ విలియం గిల్బర్ట్

## ప్రజావాక్కు

### రైతుది కష్టం, దళారిది లాభం

దేశానికి వెన్నెముక రైతని అందరూ ఒప్పుకున్న విషయమే. ఇటీవల ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడులో గౌర్మెట్ పాప్ కార్నికా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తి చేసిన నూతన పాప్ కార్నికా వంగడాన్ని ఆవిష్కరించిన సమయంలో ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ గుర్తు చేసారు. కాని మన దేశంలో ప్రతి రోజు అన్నంపెట్టే రైతు పడేకష్టాలు వర్ణనాతీతం. ప్రకృతి వైపరీత్యాల వలన సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, కరవురావడంలేదా అకాలవర్షాలు, తుఫాన్ల వల్ల చేతికొచ్చిన పంట నీట మునగడం. భారీ పెట్టుబడులు పెట్టుట వలన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, ట్రాక్టర్ వగైరా పనులకు, కోతలు, రవాణా కోసంవేల రూపాయలు ఖర్చు అవుతుంది. గిట్టు బాటు ధరలేకపోవడం వలన కష్టపడిపండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే సరైన మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. కావున రైతులకు ప్రోత్సాహాలు పెంచి ఆదుకోగలగాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### గిరిజన కోఆర్డినేటర్లను నియమించాలి

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు అయ్యే సంక్షేమ పథకాల గురించి గిరిజనులకు అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించే గిరిజన కో ఆర్డినేటర్ అవసరం. గిరిజనసంక్షేమ శాఖలో, గురుకులాలలో పనిచేస్తున్న లెక్చరర్స్, టీచర్స్‌ను ఎంపిక చేసి వారికి టిఎ డిఎ ఇచ్చివాహన సౌకర్యం కల్పించి ప్రతినెల ప్రతి మండలంలో అవగాహన చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. గిరిజన తండాలకు వాహన సౌకర్యం, రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, విద్య, వైద్య సౌకర్యం, వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఈ ప్రోగ్రాం అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

### పేదింటి కల నెరవేరిన వేళ

సమాజంలో మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల కుటుంబాలు చిన్నప్పటినుండి అష్టకష్టాలు పడుతూ ఉన్నదో లేనిదోతింటూ సంవత్సరాల తరబడిరెక్కలు ముక్కలు జేసుకుని ఇల్లు నిర్మించినప్పుడు గాని ఏవైనా కార్యక్రమాలు చేసినప్పుడు ఆ కుటుంబంలోని ఆనందం మాటల్లో వర్ణించలేనిది. కావున ప్రభుత్వ పథకాల్లో నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతే

యువత, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, తీవ్రవాద నిర్మూలన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం స్వాగతించదగినదే. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత గురించి మాట్లాడటం అవసరం. అయితే ప్రసంగాల్లో వినిపించే హామీలు యువత జీవితాల్లో మార్పుగా కనిపించినప్పుడే వాటికి నిజమైన విలువ ఉంటుంది. నేటి యువతకు ఆకర్షణీయమైన ప్రకటనల కంటే స్పష్టమైన లక్ష్యాలు, నిర్ణీత గడువులు, కనిపించే ఫలితాలు అవసరం. ప్రభుత్వం ప్రకటించే ప్రతి ప్రధాన కార్యక్రమానికి ఎంతమందికి ప్రయోజనం కల్పించాలి, ఎప్పటిలోగా లక్ష్యాన్ని చేరుకోవాలి, అమలుకు బాధ్యత వహించే శాఖ ఏది, ఇప్పటివరకు ఎంత పురోగతి సాధించామన్న వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నిర్దిష్ట కాల వ్యవధుల్లో పురోగతిని బహిరంగంగా సమీక్షిస్తే పాలనా వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. పార్లమెంట్‌తో పాటు ప్రజలు కూడా హామీల అమలును అంచనా వేసే అవకాశం ఉంటుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కల్కి స్వపక్షమా, ప్రతిపక్షమా?

భూమన్ కరుణాకరరెడ్డి ఆక్రమణలను స్వాధీనం చేసుకున్నారు సంతోషం. అదే జిల్లాలో కల్కి అనే దొంగస్వామి ఆక్రమించినఅంజూర్ అటవీ భూములను ఎపుడు స్వాధీనం చేసుకుంటారు? ఆ పక్కనే వరదయ్య పాలెం మండలంలో కల్కి ఆక్రమించిన దళితుల భూములను దళితులకు ఎపుడు స్వాధీనం చేస్తారు కరుణాకరరెడ్డి ప్రతిపక్షం, కల్కి మీ పక్షమా? 20 సంవత్సరాలనుండి తిరుపతి జిల్లాలో కల్కి ట్రస్టు వారు బీఎన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామ పరిధిలోని 295 సర్వే నంబర్‌లో అంజూర్ అటవీ భూమిని అక్రమించి విదేశీయులనురప్పించి, అటవీ నిబంధనలకువ్యతిరేకంగా, వాళ్లను రాత్రులు అక్కడే వసతి కల్పించి, భజనలు యాగాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కనుక తిరుపతి జిల్లాలో కల్కి అక్రమాలపై నిగ్గు తేల్చాలి

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### విద్యార్థుల సంఖ్య పెరిగేదెలా?

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికిగల కారణాలను లోతుగా అధ్యయనం చేసి, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

-కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం వచ్చేస్తుందా?

*సామాజిక న్యాయం అంటే ఒకరిని తగ్గించడంకాదు, వెనుకబడిన వారిని పైకి తీసుకురావడం. అసలు ప్రశ్న ఉద్యోగాల సంఖ్యతోనే ముగియదు. ఎవరు విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు? ఎవరు పరిశోధన చేస్తున్నారు? ఎవరు పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరు విధానాలు రూపొందిస్తున్నారు? ఎవరి స్వరం మీడియా, న్యాయవ్యవస్థ, కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థల్లో బలంగా వినిపిస్తోంది? ఇవన్నీ ప్రాతినిధ్యానికి సంబంధించినప్రశ్నలే. అందుకే దేశం ఇప్పుడు రిజర్వేషన్‌పై కేవలం ఉంచాలా? తొలగించాలా?"అనే ద్వంద్వ ప్రశ్నలో చిక్కుకోకూడదు. ఎవరికి ఇంకా అవకాశం లేదు? ఎవరి ప్రాతినిధ్యం ఇంకా తక్కు? ఎవరి స్వరం నిర్ణయ వ్యవస్థకు చేరడం లేదు? అన్నప్రశ్నలకు సమాధానం వెతకాలి. రిజర్వేషన్లను మెరుగుపరచాలి. అవసరమైన చోట సంస్కరించాలి. నిజంగా వెనుకబడినవారికి చేరేలా చేయాలి. కానీ సామాజిక అసమానత తొలగిపోయిందనే సాక్ష్యం లేకుండానే రిజర్వేషన్ తొలగించాలని చెప్పడం సామాజిక అసమానతల చరిత్రకు అకాల ముగింపు పలకడమే అవుతుంది.*

దుంద్రా కుమారస్వామి

జంతర్ మంతర్‌లో 'రిజర్వేషన్ హటావో' నినాదం వినిపించింది. కుల ఆధారిత రిజర్వేషన్లు వద్దని, ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక కావాలని డిమాండ్లు వచ్చాయి. 'ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలి' అన్న మాటకు సహజంగానే ఆకర్షణ ఉంటుంది. పేదరికంలో ఉన్న ప్రతి యువకుడికీ అవకాశం రావాలన్న ఆకాంక్ష కూడా న్యాయమైనదే. కానీ దేశం ఇప్పుడు అడగాల్సిన అసలు ప్రశ్నవేరొకటి. రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం నిజంగానే వచ్చేస్తుందా? లేక సామాజిక అసమానతను కనిపించకుండా చేయడమే జరుగుతుందా? రిజర్వేషన్‌ను కేవలం ఉద్యోగంలో ఒకసీటు, విద్యలో ఒక సీటుగా చూడటం దాని అసలు ఉద్దేశాన్నిచిన్నదిగా చేయడమే. భారత రాజ్యాంగం రూపుదిద్దుకున్న సమాజం శతాబ్దాలుగా సమాన అవకాశాలతో నడిచిన సమాజం కాదు. కులం ఆధారంగా వృత్తి, విద్య, సామాజిక గౌరవం, నివాసం, అధికారానికి ప్రవేశం నిర్ణయించబడిన చరిత్రమన ముందు ఉంది. అందుకే రాజ్యాంగ నిర్మాతలు సమానత్వాన్ని ప్రకటించడంతో ఆగలేదు. సమాన అవకాశాలు అందని వర్గాలకు ప్రత్యేక అవకాశాలకుకూడా మార్గం సుగమం చేశారు. ఇక్కడే ఆర్థిక వెనుకబాటుతనం, సామాజిక వెనుకబాటుతనం మధ్య తేడాను గుర్తించాలి. ఒక పేద కుటుంబానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాడు. అది నిజమే. అతనికి విద్య, స్కాలర్‌షిప్, కోచింగ్, ఉపాధి, ఆర్థిక సహాయం అందాలి. కానీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడితేఆర్థిక సమస్య తగ్గవచ్చు. సామాజిక వివక్ష మాత్రం కేవలం ఆదాయం పెరిగిందని తొలగిపోదు. ఒక వ్యక్తి ఆదాయం పెరిగినా, అతని సామాజిక గుర్తింపు, కులపరమైన అనుభవం, సంస్థల్లో ప్రాతినిధ్యం వంటి ప్రశ్నలు అలాగే ఉండవచ్చు. అందుకే 'పేదలందరికీ ఒకే రిజర్వేషన్' అనే వాదన వినడానికి సమానత్వంలా కనిపించినా, అది సామాజిక వెనుకబాటుతనాన్ని పూర్తిగా అంచనా వేయగలదా అన్నది పరిశీలించాలి. పేదరికం జేబును ప్రభావితం చేస్తుంది. సామాజిక వివక్ష మనిషి అవకాశాలను, గౌరవాన్ని, సంబంధాలనుప్రభావితం చేస్తుంది. రెండింటికీ పరిష్కారాలు అవసరం. కానీ రెండింటినీ ఒకే కొలమానంతో కొలవడం సరైన విధానం కాదు. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్‌ను సమానత్వానికి వ్యతిరేకమైన మినహాయింపుగా మాత్రమే చూడలేదు. 2024లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ఉద్దేశాన్ని విశ్లేషిస్తూ, చారిత్రకంగా కొద్దిమంది సమూహాల ఆధిపత్యంలో ఉన్న పరిపాలనా వ్యవస్థలో వెనుకబడిన వర్గాలకు ప్రాపర్ లుక్ ఇన్ కల్పించడం, వారికి పరిపాలనలో, పాలనలో వాటా కల్పించడం రిజర్వేషన్ లక్ష్యమని న్యాయపరమైన చర్చనునమోదు చేసింది. 2026లోనూ సుప్రీంకోర్టు ఆర్టికల్ 14, 15, 16, పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రతికూలతలను తొలగించేందుకు రాష్ట్రం తగిన చర్యలు తీసుకోవచ్చని, రిజర్వేషన్లు సమాన అవకాశాన్ని సాధించే ఒక మార్గమని పేర్కొంది. అంటే రాజ్యాంగ దృష్టిలో రిజర్వేషన్‌కు మూల ప్రశ్న ఎవరు పేద? అనేది మాత్రమేకాదు. ఎవరు వెనుకబడ్డారు? ఎవరు తగిన ప్రాతినిధ్యంపొందలేదు? ఎవరు నిర్ణయ వ్యవస్థలోకి ప్రవేశించలేకపోయారు?" అన్నదీ



అంతే ముఖ్యమైన ప్రశ్న. ఆర్టికల్ 342ఎ కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల రాష్ట్రాలవారీ గుర్తింపుకు రాజ్యాంగపరమైన వ్యవస్థను కొన సాగిస్తోంది. అయితే ఇక్కడ మరో నిజాన్ని కూడా ఒప్పుకోవాలి. ఎసి, ఎస్టీ, బిసి/ఒబిసిలను ఒకే రకమైన సామాజిక సమూహాలుగా చూడటం సరైంది కాదు. ముఖ్యంగా ఒబిసి వర్గంలోనే విద్య, ఉద్యోగం, ఆర్థికస్థితి, రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్ర అంతర్గత తేడాలున్నాయి. కొన్ని వర్గాలుముందుకు వెళ్లాయి. మరికొన్ని అత్యంత వెనుకబడిన స్థితిలోనే ఉన్నాయి. అందుకే ఒబిసి రిజర్వేషన్‌పై చర్చలో క్రీమీ లేయర్, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రయోజనం, డేటా ఆధారిత సమీక్ష వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ఇదే విషయంలో సుప్రీంకోర్టు కూడా ఒబిసిలలో క్రీమీ లేయర్‌ను వేరు చేయడం, నిజంగా అవసరమైన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనం చేరేలా చూడడం వంటి అంశాలను ప్రస్తావించింది. రిజర్వేషన్ వ్యవస్థలో లోపాలుంటే వాటినిసరిదిద్దాలి. కానీ లోపాలున్నాయని మొత్తం వ్యవస్థనే తొలగించడంపరిష్కారం కాదు. ప్రయోజనాలు నిజంగా అర్హులైన వారికి చేరేలా చేయడం అసలు పరిష్కారం. ఇక్కడ ప్రతిభ అనేపదాన్నీ ఒకసారి ప్రశ్నించాలి. పరీక్షలో వచ్చిన మార్కులే ప్రతిభకు పూర్తి కొలమానమా? ఒక విద్యార్థికి చిన్నప్పటి నుంచే మంచి పాఠశాల, ప్రైవేట్ కోచింగ్, పుస్తకాలు, ఇంట ర్నెట్, చదువుకు అనుకూలమైన వాతావరణం లభిస్తేమరొక విద్యార్థి ఉపాధ్యాయుల కొరత, పేదరికం, సామాజిక వెనుకబాటుతనం మధ్య చదివితే ఇద్దరినీ ఒకే ప్రారంభ రేఖ వద్దనిలబెట్టినట్టు ఎలా భావించగలం? పోటీకి ముందు సమాన అవకాశాలు ఉన్నాయా అన్న ప్రశ్న లేకుండా, పోటీ ఫలితాన్ని మాత్రమే మెరిట్‌గా పిలవడం అసంపూర్ణమైన విశ్లేషణ. ఇదేసమయంలో రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్న వారి ప్రశ్నలను కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. రిజర్వేషన్ ఎంతకాలం? ప్రయోజనం ఎవరికి చేరుతోంది? నిజంగా వెనుకబడినవారికి అందుతోందా? ఒకే కుటుంబాలు తరతరాలుగా ప్రయోజనం పొందుతున్నాయా? క్రీమీలేయర్ పరిమితులు సమర్థంగా అమలవుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలి. సామాజిక న్యాయం పేరుతో వ్యవస్థలోని లోపాలను దాచడంకూడా సామాజిక న్యాయంకాదు. కానీ ఆ ప్రశ్నలకు సమాధానం రిజర్వేషన్ రద్దు అని చెప్పడం మాత్రం తార్కికంగా సరిపోదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి. పేద యువతకు కోచింగ్, స్కాలర్‌షిప్‌లుపెంచాలి. ఉన్నత విద్యలో నిలకడైన అవకాశాలు కల్పించాలి. ఒబిసిలలో అత్యంత వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎస్సి, ఎస్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు విస్తరించాలి. అగ్రవర్ణ పేదల ఆర్థిక వెనుకబాటుతనాన్నీ ప్రభుత్వం వదిలిపెట్టకూడదు. సామాజిక న్యాయం అంటే ఒకరిని తగ్గించడంకాదు, వెనుకబడిన వారిని పైకి తీసుకురావడం. అసలు ప్రశ్న ఉద్యోగాల సంఖ్యతోనే ముగియదు. ఎవరు విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు? ఎవరు పరిశోధన చేస్తున్నారు? ఎవరు పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరు విధానాలు రూపొందిస్తున్నారు? ఎవరి స్వరం మీడియా, న్యాయవ్యవస్థ, కార్పొరేట్‌సంస్థలు, విద్యా సంస్థల్లో బలంగా వినిపిస్తోంది? ఇవన్నీ ప్రాతినిధ్యానికి సంబంధించినప్రశ్నలే. అందుకే దేశం ఇప్పుడు రిజర్వేషన్‌పై కేవలం ఉంచాలా? తొలగించాలా?"అనే ద్వంద్వ ప్రశ్నలో చిక్కుకోకూడదు. ఎవరికి ఇంకా అవకాశం లేదు? ఎవరి ప్రాతినిధ్యం ఇంకా తక్కు? ఎవరి స్వరం నిర్ణయ వ్యవస్థకు చేరడం లేదు? అన్నప్రశ్నలకు సమాధానం వెతకాలి. రిజర్వేషన్లను మెరుగుపరచాలి. అవసరమైన చోట సంస్కరించాలి. నిజంగా వెనుకబడినవారికి చేరేలా చేయాలి. కానీ సామాజిక అసమానత తొలగిపోయిందనే సాక్ష్యం లేకుండానే రిజర్వేషన్ తొలగించాలని చెప్పడం సామాజిక అసమానతల చరిత్రకు అకాల ముగింపు పలకడమే అవుతుంది. ●

# 'వందేమాతరం'పై ఇంత రాద్ధాంతం దేనికి!

జయసూర్య

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' త్రేతాయుగం నాటి శ్రీమద్రామాయణంలోని తల్లి మాతృభూమి గురించిన ప్రశంస ప్రస్తుత కలియుగ భారతావనిలో జనని, జన్మభూమిగా మాతృభూమి, బానిస శృంఖలాలు ఛేదించే స్వాతంత్ర్యోద్యమసమరంలో 'వందే మాతరం' అయింది. వందేమాతరం అంటే "తల్లీ! నీకు ప్రణామం" అధర్వణ వేదంలోని పృథివీ సూక్తంలో అభివర్ణించారు రుషిపుంగవులు. ఆ ప్రాచీన పవిత్ర భావన మరింత ప్రగాఢమై దేశమాత ఆవిర్భవించింది. దేవీదేవతలు ఆరాధనలోంచి దేశమాత జనించింది. వందేమాతరం జప మంత్రంగా దేశభక్తి నినాదమైంది. వందేమాతరం, మాతృభూమి పట్ల ఆధ్యాత్మిక శక్తిని ఉద్భవింపచేసే రణతంత్రం అయింది. జన్మయిచ్చిన భూమి పట్ల అనన్య భక్తి నిర్మింప చేసింది. బెంగాల్ సమర యోధులు, మేధావులకు పుట్టిల్లు బంకించంద్రఛటర్జీ, వైభవాన్వితమైన మాతృభూమికి స్వేచ్ఛా, విముక్తి సాధనకు దేశభక్తి రగిలించాలంటే, దైవ భక్తిలోంచి దేశభక్తి స్ఫూరింపచేసే ఆనందమఠం నవలగా రచించారు. స్వరూపాలుగా జగద్ధాత్రి, కాళి ఉగ్రరూపాలతో పాటూ భారతావనని దివ్యమంగళ స్వరూపంగా అభివర్ణించి, సంతాన తెగకు చెందిన సన్యాసుల స్వాతంత్ర్య దీక్షాలక్ష్యం ఆ నవలలో విపులీకరించబడింది. దేశభక్తులైన సంతానులు, సన్యాసులు దట్టమైన కీకారణ్యంలో శిథిల దుర్గం అయిన ఆనందమఠంలో రహస్యంగా నివసిస్తుంటారు. ఘోర కరవు కాటకాల కారణంగా నాటి జమీందార్ మహేంద్ర సింగ్ కుటుంబం అడవులపాలై విడిపోతారు. భార్య కల్యాణి దోపిడీ దొంగల బారి నుండి తప్పించుకుని ఆనందమఠంలో ఆశ్రయం పొందుతుంది. సత్యానంత ఆదేశాలనుసారం భావానంద మహేంద్రసింగ్‌ను అరణ్యంలో వెతుకుతుంటాడు. ఇంతలో యాభై మంది సాయుధ సిపాయి దళం, ఆంగ్లేయ సైనికాధికారి కమాండర్‌గాకంపెనీ ఆదాయ నిధులు కోల్‌కత్తా అరణ్య మార్గంలో తీసుకుని వెళ్తుంటారు. దేశభక్తులైన సన్యాసులు జీవానంద నాయకునిగా ఆ నిధిని దోపిడీతో కొల్లగొట్టారు. ఆంగ్ల సైనికాధికారిని సంహరించి, సిపాయిలను పరాజితులు చేసి లూటీ చేస్తారు. శత్రుసంహారం, లూటీ దోపిడీ దేశభక్తులైన సంతానులు నేరాలుగా పరిగణించరు. మహేంద్ర, భావానందలు సిపాయిల నిర్బంధానికి గురి అయి తప్పించుకుని ఆనంద మఠంవైపు వెళ్తుండగా, సన్యాసుల లూటీ, దోపిడీ, దౌర్జన్యాలను మహేంద్ర విమర్శిస్తాడు. అప్పుడు భావానంద ఆకాలంలో రాజ్యమేలుతున్న అణచివేత, నిరంకుశ పాలన, అరాచకం, దారిద్ర్యస్థితిగతుల నుండి నాటి పాలనాధికారి, నవాబు రక్షణ కల్పించలేనందున అసమర్థునికిహక్కులేదని, అందువలన లూటీ దోపిడీ న్యాయమైన చర్యలని సమర్థిస్తాడు. భావోద్రేక భక్తి ఉద్విగ్న తన్మయత్వంతో కవి బంకించంద్రుడు దేశమాత మాతృభూమి స్వర్గతుల్యమని సుజలం, సుఫలం మలయ శీతలమైన దేవీ మాతృస్వరూపాన్ని వందేమాతరంగా గానం చేస్తాడు. 1875 నవం బరులో గేయరూపంలో ఆవిర్భవించిన వందేమాతరం, ఆయన సంపాదకత్వంలో ప్రచురితమయ్యే 'బంగదర్శన్' పత్రికలో ప్రచురింపబడింది. బంగదర్శన్ పత్రిక 1880- 1881 మధ్యకాలంలోఆనంద మఠ్ నవలనుధారావాహికగా ప్రచురించింది. ఆ నవలలో వందేమాతరం గీతం యధాతథంగా పొందుపరచబడింది. 1876లో యదునాథ భట్టాచార్య అనే కవి ఈ గీతం మల్హార్‌రాగంలో పాడారు. 1882లో ఆనందమఠం నవల పుస్తకంగా ప్రచురితమైంది. 1872-1875 మధ్య రాత ప్రతిగా ఉందని చరిత్ర భావి స్తోంది. 1885 జాతీయ కాంగ్రెస్ కోల్‌కత్తా సమావేశంలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ దేశిరాగంలో స్వరబద్ధం చేసి స్వయంగా పాడి శ్రోతలను ముగ్ధులు చేశారు. జాతీయ కాంగ్రెస్ మహాసభలలో వందేమాతరం పాడటం అప్పటి నుంచే ప్రారంభమైంది. 1836జూన్ 26న జన్మించిన బంకించంద్ర ఛటర్జీ 1894 ఏప్రిల్ 8న స్వర్గస్థుడైనాడు. 58 ఏళ్ల జీవించిన మహాదార్శనిక అక్షర శిల్పి తన 44 యేటా ఈ గేయం రచించారు. ప్రప్రథమంగా భారత జాతీయ పితామహుడు దాదాభాయనౌరోజీ సమక్షంలో జాతీయ కాంగ్రెస్‌ద్వితీయ మహాసభలో 450 మంది ప్రతినిధులు, ఈదేశ భక్తిగేయం ఆలపించి ఉత్తేజితుల య్యారు. 1905 నాటికి కాశీ భారత జాతీయ కాంగ్రెస్‌లో గోపాలకృష్ణగోఖలే సూచనపై రవీంద్రుని మేనకోడలు సరళా దేవి చౌదురాణి ఈ గేయాన్ని ఆలపించారు. బాలగంగాధర తిలక్ మాటలలో చెప్పాలంటే భారత జాతీయ పునరుజ్జీవానికి, వందేమాతరం ఒక మంత్రనాదం. నాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించినా వందేమాతరం సంప్రదాయసొసైటీ అధ్యక్షునిగా కోల్‌కత్తా నగర వీధులలో మానవేంద్రనాథ్ రాయ్ మార్చింగ్ సాంగ్‌గా నిర్వర్తించేవారు. 23చరణాలున్న వందేమాతరం, మొదటి రెండు స్టాంజాలు మాత్రమే మాతృదేశభక్తికి సంబంధించినవిగా గుర్తించబడుతున్నాయి. 7 పాదాల తొలి స్టాంజాలే గుర్తింపు పొందాయి. 150 వసంతాల తర్వాత, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు 2026 వందేమాతరం బిల్లుగా తెచ్చింది. మొత్తం 6 చరణాల భాగాల సంపూర్ణ గేయం లోని మొదటి రెండు చరణాలు మాత్రమే 1950 జనవరి 24 భారత రాజ్యాంగ సభ అధికారిక ఆమోదయోగ్యంగా సుమారు 76 సంవత్స రాలకు పైగా మాతృదేశాన్ని తల్లిగా వందేమాతరం పాడి పూజిస్తున్నాం. ఇప్పుడు ఎందుకీ అనర్థ రాద్ధాంతం? ●

(రచయిత : సీనియర్ జర్నలిస్టు)

# పర్యాటకంతో ఆర్థిక వృద్ధి సాధించగలమా?

దుంగ జయరాం

భారత్‌లో 2025లో 428.7 కోట్ల దేశీయ పర్యాటక సందర్శనలు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 45.55శాతం పెరుగుదల. దేశంలో పర్యాటకానికి ఉన్న విస్తృత డిమాండ్‌ను ఈ గణాంకం స్పష్టం చేస్తోంది. అయితే అసలు ఆర్థిక ప్రశ్న పర్యాటకసందర్శనలు ఎన్ని అన్నది కాదు. ప్రతి పర్యటన ద్వారా ఎంత ఆదాయం, ఉపాధి, స్థానిక వ్యాపారం, పెట్టుబడి సృష్టించగలుగుతున్నామన్నదే. పర్యాటకాన్ని ఆర్థిక శక్తిగా మార్చాలంటే భారత్ సంఖ్యల పెరుగుదల నుంచి ఒక్కో పర్యాటకుడి ద్వారా సృష్టించే విలువ పెరుగుదల వైపు మళ్లాలి. పర్యాటకం ఇప్పటికే భారత ఆర్థికవ్యవస్థలో గణనీయమైన పాత్రపోషిస్తోంది. పర్యాటక మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం2023-24లో ఈ రంగం రూ.15.74 లక్షల కోట్ల ఆర్థిక విలువను సృష్టించింది. ఇది దేశ స్థూలదేశీయోత్పత్తిలో 5.22 శాతం. పర్యాటక రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన ఉపాధి 8.463 కోట్లకు చేరింది. పర్యాటకుడి ఖర్చు రవాణా, వసతి, ఆహారం, కొనుగోళ్లు, వినోదం, స్థానిక ఉత్పత్తులు, సేవల్లో చలామణి అవుతుంది. అందుకే పర్యాటకం అనేక రంగాలను ఒకేసారి కదిలించగల ఆర్థిక గొలుసు. ఈ గొలుసు ఎంత బలంగా పనిచేస్తుందన్నదే పర్యాటకం సృష్టించే విలువను నిర్ణయిస్తుంది. ఒక ప్రదేశాన్ని కొన్ని గంటలు చూసి వెళ్లిపోయే పర్యాటకుడి వ్యయం పరిమితంగా ఉంటుంది. అదే పర్యాటకుడు రెండు మూడు రోజులు ఉండి సమీప ప్రాంతాలను సందర్శిస్తే వసతి, భోజనం, రవాణా, కొనుగోళ్లు, మార్గదర్శక సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆదాయం పెరుగుతుంది. అందువల్ల ఎంతమంది వచ్చారు? అనేదానితో పాటు ఎంతకాలం ఉన్నారు, ఎంత ఖర్చు చేశారు, ఆ ఖర్చులో ఎంత భాగం స్థానికంగా చలామణి అయింది?" అన్నదీ కొలవాలి. దీనికి గమ్యస్థానాలను విడివిడిగా కాకుండా పర్యాటక మార్గాలుగా అభివృద్ధి చేయాలి. దేవాలయాలు, వారసత్వ కట్టడాలు, సముద్ర తీరాలు, వన్యప్రాణి ప్రాంతాలను సమీప ఆకర్షణలతో అనుసంధానించి నాణ్యమైన వసతి, రహదారి-రైలు-విమాన సౌకర్యాలు, పరిశుభ్రత, స్థానిక ఆహారం, సాంస్కృతిక అనుభవాలు, కొనుగోళ్లు, వినోదం అందుబాటులోకి తేవాలి. రవాణా మౌలిక వసతులను కూడా కేవలం ప్రయాణ సౌకర్యాలుగా కాకుండా ప్రాంతీయ ఆర్థికవ్యవస్థలను మార్కెట్లతో కలిపే వసతులుగా చూడాలి. అప్పుడు పర్యాటక ఆదాయం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాలకు విస్తరిస్తుంది. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్నఉంది.



పర్యాటకుడు ఖర్చు చేసిన ప్రతి రూపాయిలో ఎంత భాగం స్థానిక ఆర్థిక వ్యవస్థలోనే మిగులుతోంది? హోటళ్లు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తే అది వ్యవసాయఆదాయంగా మారుతుంది. పర్యాటకుడు కళాకారుడి ఉత్పత్తిని కొనుగోలు చేస్తే అది కుటుంబ ఆదాయంగా మారుతుంది. స్థానిక వాహనదారులు, మార్గదర్శకులు, భోజనశాలలు, గ్రామీణ వసతి కేంద్రాలు కూడా ఆ ఖర్చులో భాగస్వాములవుతాయి. ఈ స్థానిక అనుసంధానం పెరిగితే పర్యాటక వ్యయపు ఆర్థిక గుణక ప్రభావం బలపడుతుంది. అందుకే స్థానిక ఆహారం, కళలు, సంగీతం, సంప్రదాయ వృత్తులు, ప్రకృతి అనుభవాలను పర్యాటక ఉత్పత్తులుగా మలచడంతో పాటు స్థానిక ఉత్పత్తులకు మార్కెట్లు కల్పించాలి. ఉపాధి విషయంలోనూ సంఖ్య కంటే నాణ్యత ముఖ్యం. విదేశీ భాషలు, వంటకళ, వారసత్వ వివరణ, అతిథి సేవలు, సాహస పర్యాటకభద్రత, ప్రచార నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంది. శిక్షణ పొందిన వారిసంఖ్య కంటే శిక్షణ తర్వాత లభించిన ఉద్యోగాలు, వేతనాలు, ఉత్పాదకత ఎంత పెరిగాయన్నదే నైపుణ్య కార్యక్రమాల విజయానికి కొలమానం కావాలి. అంతర్జాతీయ పర్యాటకంలో భారత్‌కు మరింత పెద్ద అవకాశం ఉంది. 2025లో విదేశీ పర్యాటకుల రాక 91.5 లక్షలుగానమోదై, అంతకుముందు ఏడాదితో పోలిస్తే 8.07 శాతం తగ్గింది. భారతదేశ భౌగోళిక వైవిధ్యం, వారసత్వం, ఆధ్యాత్మికత, వన్యప్రాణులు, వైద్య సేవలు, వంటకాలు, సాహస పర్యాటకానికి ఉన్న అవకాశాలను ప్రపంచ మార్కెట్లకు లక్ష్యంగా పరిచయం చేయాలి. వీసా ప్రక్రియను సులభతరం చేయడం, అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని విస్తరించడం, చివరి దశ రవాణాను మెరుగుపరచడం కూడా అవసరం. విదేశీ పర్యాటకులు దేశంలోకి విదేశీ కొనుగోలు శక్తిని తీసుకువస్తారు. 2025లో పర్యాటకం ద్వారా భారత్‌కు సుమారు రూ. 2.7 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్య ఆదాయం లభించినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయం కూడా తగ్గింది. కాబట్టి లక్ష్యం కేవలం ఎక్కువ మంది విదేశీ పర్యాటకులను ఆకర్షించడం కాకుండా ఎక్కువ రోజులు ఉండే, అనేక ప్రాంతాలను సందర్శించే, అధిక విలువైన అనుభవాలపై ఖర్చు చేసే పర్యాటకులను ఆకర్షించడం కావాలి. పరిశుభ్రత, భద్రత, పారదర్శక ధరలు, విశ్వసనీయ సేవలు, సమయ పాలన ఈ వ్యూహంలో కీలకం. ప్రపంచ ప్రయాణ, పర్యాటక మండలి అంచనాల ప్రకారం 2026లో భారత పర్యాటకరంగం 8.5శాతం వృద్ధితో 286.1బిలియన్ డాలర్ల ఆర్థిక సహకారం అందించవచ్చని అంచనా. 2036నాటికి ఇది527 బిలియన్ డాలర్లకు చేరవచ్చని కూడా అంచనా ఉంది. ఈ సామర్థ్యాన్ని అందుకోవడం పర్యాటకుల సంఖ్యపైనే కాకుండా మౌలిక వసతులు, గమ్యస్థానాల నాణ్యత, స్థానిక వ్యాపారాల అనుసంధానం, నైపుణ్యాలు, ప్రైవేటు పెట్టుబడులు, ఒక్కో పర్యాటకుడి వ్యయ సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ●

# కులగణనలో 'ఓపెన్ఎండెడ్' వద్దు



## కులాల డ్రాప్‌డౌన్ జాబితా చేర్చండి

## ప్రధాని మోడీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ

### తెలంగాణ, బీహార్‌ల విధానాన్ని అనుసరించాలని సూచన

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక సంయుక్త లేఖ రాశారు. జనాభా లెక్కలలో కుల సమాచారాన్ని సేకరించడానికి ప్రతిపాదించిన 'ఓపెన్ఎండెడ్' విధానం వల్ల ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో నమోదు చేసే అవకాశం ఉందని, తద్వారా డేటా తప్పుగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. దానికిబదులుగా, ఫారంలో "కులాల డ్రాప్‌డౌన్ జాబితా"ను చేర్చాలని వారు కోరారు. "ఖచ్చితమైన డేటా లేకుండా భారత దేశంలో సామాజిక న్యాయ విధానాలను సమర్థ వంతంగా రూపొందించలేము" అని పేర్కొంటూ కుల గణనను సరిగ్గా నిర్వహిస్తేనే వివిధ కులాల సంఖ్యా బలం, సామాజిక ఆర్థిక స్థితిపై ఖచ్చితమైన అంచనా సాధ్యమవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. "జనాభా గణన సమయంలో కుల వివరాలను నమోదు చేయడానికి ప్రభుత్వం 'అపరిమితమైన' ప్రశ్నల విధానాన్ని ఎంచుకుంది, ఇది తప్పుదోవ పట్టించే పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం, ఒక వ్యక్తి తన కులానికి ఏ పేరు చెప్పినా, అది ఉన్నది ఉన్నట్లుగానే నమోదు చేయబడుతుంది" అని ఖర్గే, రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఒకే కులాన్ని తరచుగా వేర్వేరు పేర్లు, ఉప కులాలు, భాషా వైవిధ్యాలతో పిలుస్తారని గుర్తుచేశారు. ఒకే కులానికి చెందిన వారిని వేర్వేరు పేర్లతో నమోదు చేస్తే, "ఒకే కులం వేలాది విభిన్న నమోదులుగా విడిపోయే అవకాశం ఉంది" అని హెచ్చరించారు. "దీనివల్ల లక్షలాది కుల పేర్లు పుట్టుకొస్తాయి, కుల గణన నుండి పొందిన మొత్తం డేటాసెట్ నిరుపయోగంగా మారుతుంది" అని కాంగ్రెస్ నాయకులు ఎత్తి చూపారు. ఒక వర్గం కచ్చితమైన జనాభా గణనను నమోదు చేయకపోతే, "వారి స్థితిపై చేసే ఏ అంచనా అయినా అనివార్యంగా లోపభూయిష్టంగా ఉంటుంది" అనిపేర్కొన్నారు. "ఇది వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాలకు నష్టం కలిగిస్తుంది. అంతేకాకుండా విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ పద్ధతి భారతదేశంలోని ఒబిసి జనాభా వాస్తవ పరిమాణాన్ని వెల్లడించడంలో విఫలమవుతుంది. ఎందుకంటే ఈ జనాభా లెక్కలలో 'వెనుకబడిన తరగతి' అనే పదాన్నే చేర్చలేదు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే "కులాల డ్రాప్‌డౌన్ జాబితా"ను రూపొందించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. "షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల గణన కోసం ఉపయోగించే పద్ధతి ఇది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వంటి ప్రభుత్వ జాబితాలు, భారత మానవ శాస్త్ర సర్వే (ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నుండి సేకరించిన సమాచారం ఆధారంగా ఇలాంటి జాబితాను సులభంగా రూపొందించవచ్చు" అని పేర్కొన్నారు.

తెలంగాణ, బీహార్‌లలో నిర్వహించిన కుల సర్వేలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించారని, కేంద్ర ప్రభుత్వం కూడా అదే విధానం అనుసరించాలని సూచించారు. "ప్రస్తుత పద్ధతిలో కుల గణన నిర్వహించడాన్ని తాము అంగీకరించము. ప్రభుత్వం ప్రస్తుత ప్రశ్నాపత్రాన్ని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదించిన తర్వాత కొత్తదాన్ని రూపొందించాలి" అని డిమాండ్ చేశారు.



# రంగంలోకి 'మాలిస్'

## అమెరికా ఆవిష్కరించిన తాజా ఆయుధం

## 463 కి.మీ దూరం నుంచే కూల్చేసే శక్తివంతమైన క్షిపణి

**వాషింగ్టన్, ఆగస్టు 25:** ఆధునిక యుద్ధ వ్యూహాలపై పదునుపెడుతోన్న అమెరికా తాజాగా సరికొత్త ఆయుధాన్ని సిద్ధం చేసింది. సుదూరం నుంచే శత్రు ముప్పును ఛేదించేలా సరికొత్త ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని యుఎస్ నేవీ ఆవిష్కరించింది. 'మాలిస్'గా పిలిచే ఈ దీర్ఘశ్రేణి క్షిపణి వందల కిలోమీటర్ల దూరం నుంచే విమానాలను కూల్చగలదని అగ్రరాజ్యం చెబుతోంది. ఇంతకీ ఏమిటీ క్షిపణి? దీని ప్రత్యేకలేమిటి?

**మాలిస్.. 'రేంజ్' వేరు**

మాలిస్ క్షిపణి సాంకేతిక పేరు ఎఐఎం-424 ఎల్ఆర్ఎఎఎం. రేథియాన్ సంస్థతో కలిసి అమెరికా నైకాదళం అత్యాధునిక ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని అభివృద్ధి చేసింది. పొడవు 4.11 మీటర్లు.. 680 కిలోల బరువుండే ఈ క్షిపణిలో సాలిడ్ ప్రొపెల్లెంగ్ రాకెట్ మోటార్ ప్రొపల్షన్ అమర్చారు. దీని సాంకేతికతను యుఎస్ నేవీ పూర్తిగా బయటపెట్టనప్పటికీ.. శత్రువు టార్గెట్‌ను గుర్తించిన వెంటనే.. దాన్ని కూల్చివేసేలా రూపొందించారు. 250 నాటికల్ మైళ్ల (463 కిలోమీటర్ల) దూరంలో ఉండే లక్ష్యాలను ఇది ఛేదించగలదు. గగనతల లక్ష్యాలను టార్గెట్ చేసే క్షిపణుల్లో ఇదే ఇప్పటివరకు అంత్యంత లాంగ్ రేంజ్ మిసైల్. దీంతో అమెరికా యుద్ధ విమానాలు లక్ష్యాలకు చేరువగా వెళ్లాల్సిన పని ఉండదు. అప్పుడు యుద్ధ క్షేత్రంలో అగ్రరాజ్యం వైపు తక్కువ నష్టం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఏ యుద్ధవిమానాల్లో వాడుతారు?**

ఎఐఎం-424 క్షిపణిని ప్రధానంగా ఎఫ్-35సి యుద్ధ విమానాల కోసం డిజైన్ చేశారు. దీంతోపాటు ఎఫ్/ఎ-18ఇ/ఎఫ్ సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్లలోనూ వీటిని అమర్చేందుకుకూడా పరీక్షలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన టెస్ట్ ఈవెంట్‌లో ఈ క్షిపణులను యుద్ధ విమానాలకు అమర్చిన ఫొటోలను అమెరికా నేవీ విడుదల చేసింది. మరోవైపు, చైనా కూడా ఇలాంటి దీర్ఘశ్రేణి క్షిపణులపై దృష్టి పెట్టింది. వేల మైళ్ల దూరంలో ఉన్న గగనతల లక్ష్యాలను ఛేదించే హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్స్‌ను తయారుచేస్తున్నట్లు సమాచారం. ఈ క్షిపణులు దాదాపు 2,414 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవని అంచనా. అంటే.. చైనా నుంచి అమెరికా గగనతాన్ని లక్ష్యంగా చేసుకోవచ్చని సమాచారం. అయితే, ఈ క్షిపణికి సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతం బీజింగ్ వద్ద కనీసం 3,150 బాలిస్టిక్ క్షిపణులు, 300 గ్రౌండ్‌క్రూజ్ మిసైళ్లు ఉన్నాయని అంచనా.




# మహిళలకూ కమాండో శిక్షణ

## ఎన్ఎస్‌జి కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** భారతదేశ ఉగ్రవాద నిరోధక వ్యవస్థలో మహిళల కార్యాచరణ సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో, మనేసర్‌లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) శిక్షణా అకాడమీ, రాష్ట్ర పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) మహిళా సిబ్బంది కోసం మొట్టమొదటి మహిళా కమాండో కన్వర్షన్ కోర్సు (ఎంసిసిసి)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని 'నారీ శక్తి'లో ఒక కొత్త మైలురాయిగా అభివర్ణిస్తూ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో క్లిష్టమైన ప్రత్యేక పాత్రలకోసం మహిళా సిబ్బందిని సిద్ధం చేయడమే ఈ కోర్సు లక్ష్యమని ఎన్ఎస్‌జి పేర్కొంది. శారీరకంగా దృఢంగా, సాంకేతికంగా నైపుణ్యం కలిగి, కార్యాచరణకు సిద్ధంగా ఉన్న మహిళా కమాండోలను అభివృద్ధి చేయడానికి ఈ 12 వారాల ఇంటెన్సివ్ కోర్సును రూపొందించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కఠినమైన శారీరక కండిషనింగ్, ఆయుధాల నిర్వహణ, మార్క్‌మ్యాన్‌షిప్, వ్యూహాత్మక జోక్యం, బందీల రక్షణ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు సంబంధించిన ఇతర ప్రత్యేక అంశాలు ఉంటాయి. వివిధ భద్రతా దళాల నుండి ఎంపిక చేయబడిన మహిళా సిబ్బందికి, దళం ప్రత్యేక ఉగ్రవాద నిరోధక నైపుణ్యాన్ని విస్తరించడం ద్వారా, వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధికి అతీతంగా వెళ్లడమే ఎన్ఎస్‌జి శిక్షణా అకాడమీ ఉద్దేశ్యం. ఎన్ఎస్‌జి ప్రకారం, ఈ కోర్సు శిక్షణ పొందిన కార్యాచరణ సిబ్బంది విస్తృత సమూహాన్ని సృష్టించడంలో సహాయపడుతుంది. అదే సమయంలో, ఉమ్మడి వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహిస్తూ, భారతదేశ భద్రతా వ్యవస్థలో పాలుపంచుకుంటున్న వివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేస్తుంది.

# రెండువారాల్లోగా లొంగిపోవాలి...

## తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా వాదనలు వినిపించారు. తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు. అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు. ఈనెల 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.

# ఇక పైలట్లకు ప్రతి యేటా డోప్ టెస్టులు

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఇకపై పైలట్లకు ప్రతి యేడాది డోప్ టెస్టులు నిర్వహించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై డిజిసిఎ దృష్టి సారించిందని, దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న నిబంధనల్ని పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. అలాగే, కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఇటీవల ఎయిరిండియా విమానం గాలిలో ఉండగా, కుదుపులకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీనికి గల కారణాలపై విచారించగా పైలట్ గంజాయి సేవించినట్లు తేలింది. పైలట్లు మత్తులో ఉండటం వల్ల విమాన ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుంది. అందువల్ల పైలట్లు ఇలా నిషేధిత డ్రగ్స్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని గుర్తించేందుకు డోప్ టెస్టులు నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది.

# బీహార్ సిఎం ఇల్లు ముట్టడి యత్నం

## ఉద్రిక్తంగా మారిన పాట్నా వీధులు



**పాట్నా, ఆగస్టు 25:** బీహార్ రాజధాని పాట్నా రోడ్లు మంగళవారం రణరంగాన్ని తలపించాయి. వందలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి నివాసాన్ని ముట్టడించేందుకు దూసుకెళ్లారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే 70వ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఈ ఆందోళన చేపట్టారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో చారిత్రాత్మక గాంధీ మైదాన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ క్రమంగా తీవ్రరూపం దాల్చింది. నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసంవైపు దూసుకెళ్లకుండా పోలీసులు మార్గమంతటా భారీగా బారికేడ్లను ఏర్పాటు చేసినప్పటికీ, ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు వాటిని తోసుకుంటూ ముందుకు సాగారు. బారికేడ్లను బద్దలు కొట్టుకుని వస్తున్న అభ్యర్థులను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు పలుచోట్ల లాఠీఛార్జ్ చేయడంతోపాటు వాటర్ కెన్లను ప్రయోగించారు. అయినా సరే వెనక్కి తగ్గనివిద్యార్థులు, పోలీసుల హెచ్చరికలను దాటుకుంటూ సిఎం నివాసానికి చేరువగా వెళ్లడం విశేషం. నిజానికి పట్నాలోని గర్దానీబాగ్ ప్రాంతంలో పోటీపరీక్షలు, ఉద్యోగనియామకాలకు సంబంధించి అభ్యర్థులు కొద్దిరోజులుగా నిరంతర నిరసనలు తెలుపుతున్నారు. నిరసనకారుల ప్రతినిధులతో ప్రభుత్వం సోమవారం జరిపిన చర్చలు సానుకూలంగానే ముగిసినప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు నెరవేరేవరకు వెనక్కి తగ్గేది లేదని అభ్యర్థులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే గాంధీమైదాన్ నుంచి సిఎం నివాసానికి మార్చ్‌ను ప్రకటించి అమలు చేశారు. ప్రభుత్వం తరఫున కేవలం జూనియర్ అధికారులతో మాట్లాడించి విషయాన్ని దాటవేస్తున్నారని, ఈసారి నేరుగా ముఖ్యమంత్రే తమతో చర్చలు జరపాలని విద్యార్థి నేత సౌరవ్‌కుమార్ స్పష్టంచేశారు. తమ తరఫున ఒక ప్రతినిధి బృందాన్ని సిఎం లేదా విద్యాశాఖమంత్రి వద్దకు పంపడానికి సిద్ధంగా ఉన్నామని, వారిద్దరూ తప్ప వేరే ఏఅధికారితోనూ మాట్లాడేది లేదని, సిఎం నుంచి అధికారిక ప్రకటన వస్తేనే నిరసన విరమిస్తామని విద్యార్థి నాయకులు తేల్చిచెప్పారు. ఒకవైపు అభ్యర్థుల ఆందోళనలు ఉధృతంగా సాగుతుండగానే, మరోవైపు బీహార్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సహయోగ్ శివిర్ పేరిట ఒక నూతన కార్యక్రమాన్ని ప్రకటించింది. ప్రభుత్వం ఎంతటి సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ, 70వ బిపిఎస్‌సి పరీక్ష అక్రమాలపై కచ్చితమైన చర్యలు తీసుకునేవరకు పోరాటాన్ని ఆపేది లేదని నిరుద్యోగులు భీష్మించుకూర్చోవడంతో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

# భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

### ఎన్నికల యంత్రాంగం ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబంగా అభివర్ణన



**లక్నో, ఆగస్టు 25:** భారత ప్రజాస్వామ్యానికి 'బూత్ స్థాయి అధికారులు' (బిఎల్‌ఒ) పునాది వంటివారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం లక్నోలో నిర్వహించిన సమావేశంలో ఆయన బిఎల్‌ఒలతో ముచ్చటించారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతోమాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒల కీలక పాత్రను, వారి అంకితభావాన్ని, పారదర్శకతను ప్రశంసించారు. "బిఎల్‌ఒలు భారత ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ బూత్ పరిధిలోని ఓటర్లకు తమ పారదర్శకత, అంకితభావం ద్వారా సుపరిచితులు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగాకూడా గుర్తింపు, గౌరవం పొందుతున్నారు" అని సిఇసి జ్ఞానేష్ కుమార్‌అన్నారు. బిఎల్‌ఒల అనుభవాలను తెలుసుకోవడం, వారిసూచనలను స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్న భారతదేశాన్ని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల యంత్రాంగం భారీ స్థాయిని నొక్కి చెబుతూ, జ్ఞానేష్ కుమార్ దీనిని "ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం"గా అభివర్ణించారు.

ఇఎల్‌సి 2.0, ఇసిఐఎన్ఇటి ప్రాంతీయ సదస్సులో సిఇసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ స్థాయిలలోని ఎన్నికల అధికారులను అనుసంధానించే వేదికగా ఇసిఐఎన్ఇటి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సుమారు నాలుగు, ఐదు నెలల క్రితం ప్రారంభించిన ఈ యాప్, ఈ యేడాది చివరి నాటికి భారతదేశంలోని అతిపెద్ద అప్లికేషన్లలో ఒకటిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక ప్రధాన ప్రాంతాల మొత్తం ఓటర్ల జనాభా కంటే భారతదేశ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. "భారత దేశంలో సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్య కేవలం ఒక గణాంకం మాత్రమే కాదు, ఇది చాలా ముఖ్యమైనది. అమెరికా, కెనడా, దక్షిణ అమెరికా, మొత్తం ఐరోపా, మొత్తం ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల ఓటర్ల సంఖ్యను కలిపినా, అప్పటికీ సుమారు ఎనిమిది కోట్ల మంది ఓటర్లు మిగిలే ఉంటారు. మీరు అటువంటి భారీ ప్రజాస్వామ్యంలో భాగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం" అని పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిర్వహించే భారీ స్థాయి కార్యకలాపాల గురించి కూడా జ్ఞానేష్ కుమార్ ప్రస్తావించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వమైన భారత ప్రభుత్వం 65 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, అతిపెద్ద ప్రైవేట్ సంస్థ అయిన వాల్‌మార్ట్ సుమారు 20 లక్షల మందికి ఉపాధినిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో, 1.8 కోట్ల మంది సిబ్బందితో కలిసి పనిచేసే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా మారుతుంది" అని ఆయన అన్నారు.

# దేశీయ పరిశ్రమలకే డిఆర్‌డిఒ క్షిపణి టెక్నాలజీ

## రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఆయుధాల తయారీలో స్వయం సమృద్ధి సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద ఊతం లభించింది. దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు వీలుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఈ సాంకేతికత బదిలీ (టిఒటి) భారతీయ కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంది. "రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' (స్వయం సమృద్ధి) లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక కీలక అడుగుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు" అని రక్షణ శాఖ 'ఎక్స్' వేదికగా తెలిపింది. రష్యా వంటి దేశాల నుండి ఆయుధాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, దేశంలో బలమైన రక్షణ తయారీ రంగాన్ని నిర్మించడం లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది.

"ఈ సాంకేతికత బదిలీ, భారతీయ పరిశ్రమలు తమ అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా స్వదేశీ ఉత్పత్తిని చేపట్టేలా చేయడం ద్వారా రక్షణ రంగ వ్యవస్థలో వాటి భాగస్వామ్యాన్ని పెంచడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది" అని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. దేశీయ తయారీ పరిశ్రమ సామర్థ్యాలను మెరుగుపరచడం, రక్షణ పారిశ్రామిక పునాదిని బలోపేతం చేయడం, సరఫరా గొలుసులో ఎంఎస్ఎంఇలు, అలాగే ఇతర సాంకేతిక భాగస్వాముల భాగస్వామ్యాన్ని కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ విధానం క్షిపణి వ్యవస్థల అభివృద్ధి నుండి పారిశ్రామిక ఉత్పత్తికి విజయవంతమైన పరివర్తనను సాధ్యం చేస్తుంది. అధునాతన రక్షణ వ్యవస్థల అభివృద్ధి, తయారీ కోసం భారతీయ పరిశ్రమ సామర్థ్యాలను వినియోగించుకోవడంలో డిఆర్‌డిఒ చేస్తున్న నిరంతర కృషిని ఇది ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు.

# మా వద్ద రెండు సంవత్సరాల ప్రణాళిక ఉంది

## అమెరికా ఆంక్షలకు ఇరాన్ కౌంటర్



**టెహ్రాన్, ఆగస్టు 25:** ఇరాన్‌పై కొన్ని నెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్ర రాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యుఎస్ ఆర్థిక స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళికఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్‌పై ఆంక్షలు విధించడం కొత్తేంకాదు. ఇరాన్‌కు ప్రపంచడంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్ట డమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యుఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేద న్నారు. 'అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూనమ్మరు. అమెరికా ఆంక్షల ప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారు' అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## చైనా ఉపాధ్యక్షుడు హన్‌జెంగ్‌తో అజిత్ దోవల్ భేటీ



**బీజింగ్, ఆగస్టు 25:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఆయన చైనా ఉపాధ్యక్షుడు హన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. చైనా విదేశాంగమంత్రి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సెంట్రల్ కమిటీ సభ్యుడు వాంగ్‌యి ఆహ్వానం మేరకు అజిత్ దోవల్ అక్కడ పర్యటిస్తున్నారు. చైనాకు చెందిన వివిధ ప్రజా ప్రతినిధులతో భేటీలో భాగంగా చైనా ఉపాధ్యక్షుడు హన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పే అంశాలతోపాటు, సరిహద్దు వివాదంపైకూడా చర్చలుజరిపారు. సరిహద్దులో వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా చూడటమే లక్ష్యంగా ఈ భేటీ జరిగింది. అలాగే, ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు ఇతర ద్వైపాక్షిక అంశాలపై కూడా చర్చించారు.

## ఢిల్లీలో నిరసనలపై ఇక ప్రత్యేక నిఘా

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఢిల్లీలో వరుసగా జరుగుతున్న నిరసనలు, వాటి వల్ల తలెత్తే శాంతి భద్రతల సమస్యపై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించబోతున్నారు. ఈ నిరసనల్ని ముందుగా గుర్తించేందుకు ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత పటిష్టంచేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శ్రీకారంచుట్టారు. ఇటీవల జంతర్ మంతర్‌వద్ద సిజెపి నిరసన సందర్భంగా తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింతపటిష్టం చేయాల్సిందిగా ఢిల్లీపోలీస్ కమిషనర్ ఆదేశించారు.

## డేరాబాబాకు 17వ సారి పెరోల్

**రోహ్‌తక్, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబాకు మరోసారి పెరోల్ దొరికింది డేరా బాబా అత్యాచారం కేసులో 20 యేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయనకు మరో 21 రోజుల పెరోల్ మంజూరైంది. 2017లో శిక్ష పడిన తర్వాత ఇది ఆయనకు ఇది 17వ తాత్కాలిక విడుదల కావడం గమనార్హం. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలు నుంచి ఈ రోజు తెల్లవారుజామున రామ్ రహీమ్ బయటకు వచ్చారు. పెరోల్ కాలంలో సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలో ఆయన ఉండనున్నారు.

## ఢిల్లీలో 2,300 దాటిన స్వైన్‌ఫ్లూ కేసులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 25:** దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య 2,300 దాటిందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ వెల్లడించారు. కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత వైద్య పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ స్పష్టం చేశారు. ఇవి వారానికొకసారి నమోదయ్యే సాధారణ గణాంకాల్లో భాగమేనని బహల్ తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న హెచ్‌వన్ఎన్‌వన్ వైరస్ 2009లో కనిపించిన సాధారణ స్ట్రెయిన్‌నేనని, ఇందులో కొత్తదనం ఏమీ లేదని చెప్పారు. ఇప్పుడు దీనిని స్వైన్‌ఫ్లూ అని కాకుండా సీజనల్ ఫ్లూగా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## స్వరాష్ట్రంలో చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు!




**సూరత్, ఆగస్టు 25:** గుజరాత్‌లోని సూరత్‌లో ఓ చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు పెట్టడంపై వివాదం చెలరేగింది. నాన్‌పురాలోని లక్కడ్‌కోట్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన హోల్‌సేల్ చేపల మార్కెట్ ప్రవేశద్వారం దగ్గర 'శ్రీ నరేంద్ర మోడీ హోల్‌సేల్ ఫిష్ మార్కెట్' పేరుతో ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అందులో ప్రధాని మోడీ ఫొటోతో పాటు సూరత్ ఫిష్ మర్చంట్ అసోసియేషన్ పేరు కూడా ఉంది. దీనిపై కొందరు స్థానిక చేపల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ శాఖాహారి కావడంతో ఆయన పేరును చేపల మార్కెట్‌కు పెట్టడం సరైన నిర్ణయం కాదని కొందరు వ్యాపారులు ప్రశ్నించారు.

# పిఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు

- ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలి
- రచ్చుమర్రిలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ పరిశీలన



పీఎం సూర్యఘర్ సోలార్‌ను పరిశీలిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు

**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త;** పిఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్‌కుమార్ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరులశాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు, దాని పనితీరు, సామర్థ్యం, లబ్దిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలను మంత్రులు అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన ప్లాంట్లు కనీసం 20 సంవత్సరాల పాటు సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ యోజన ప్రధాన ఉద్దేశ్యం ప్రతి కుటుంబానికి సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అని మంత్రి పేర్కొన్నారు. పథకం ద్వారా లబ్ధిదారులకు వాస్తవ ప్రయోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రచ్చుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్లాంటట్2 కిలో వాట్ల సామర్థ్యంతో ఉందని అధికారులు వివరించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు 60 శాతం వరకు సబ్సిడీ అందుతున్నట్లు తెలిపారు. లబ్దిదారులకు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం, సహాయక సేవలు అందిస్తున్నట్లు అధికారులు తలెఎఇపారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని, తద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సహకరించాలని మంత్రులు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆదోని ఆర్డీఓ అరుణదేవి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ప్రదీప్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫొటో జర్నలిస్టు నైపుణ్యం, శ్రమ కలగలిసిన కళాకారుడు

- సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ సురేశ్ కుమార్

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫొటో జర్నలిస్టు నైపుణ్యం,శ్రమ కలగలిసిన కళాకారుడని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ పేర్కొన్నారు. ఫొటో కాంటెస్ట్2026 అవార్డుల ప్రధానోత్సవం మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. సి.ఆర్.మీడియా అకాడమీ, ఎపి స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చరర్ కమీషన్ ఈ కార్యక్రమ నిర్వహణకు తోడ్పాటునందించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక ఫొటో వార్తకు ప్రాణం పోస్తుందనడం అతిశయోక్తి కాదన్నారు. ఒకఅంశాన్ని చిత్రం(ఫొటో)తో పాటు వివరించడం సంఘటనను పాఠకులకు మరింత చేరువ చేస్తుందన్నారు. తమ నలభై యేళ్ళ జర్నలిస్టు అనుభవంలో ఫిల్మ్ కెమెరాలు, డిజిటల్ కెమెరాలు, చివరికి స్మార్ట్ ఫోన్ కెమెరాలు వాడకం చూశామని, అన్ని దశల్లోనూ ఫొటోల నాణ్యత ఒకేలా ఉందని చెప్పలేమన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఫొటోగ్రఫీ రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, దానిపై ఫొటో జర్నలిస్టులు నూతన, సాంకేతిక తను అలవర్చుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజూ 530 కోట్ల ఫొటోలు తీస్తున్నట్లు ఒక సర్వేలో వెల్లడైందన్నారు. ఇదంతా స్మార్ట్ ఫోన్ల వల్లనే సాధ్యం అవుతోందన్నారు. అయితే, సాధారణ ఫొటోలు, వార్తల కోసం తీసే ఫొటోలతోపాటు కళాత్మక ఫొటోగ్రఫీని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గతంలో "ఇలస్ట్రేటెడ్ వీక్లీ"వంటి పత్రికలు కళాత్మక ఫొటోగ్రఫిని, ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించేవన్నారు. తాను క్లిక్ మనిపించిన ఫొటోను మనస్సుతో అనుభూతి చెంది, ఆనందించడం ఫొటో జర్నలిస్టులందరికీ అనుభవంలో ఉంటుందన్నారు. సంఘటనకు అతి చేరువలో వుండి, ఓపిగ్గా నిరీక్షించడం ద్వారా ఫొటో జర్నలిస్టులు ఎన్నో చారిత్రాత్మక ఫొటోలు తీయగలిగారన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగింపును సూచించే ప్రసిద్ధ ఫొటో అలాంటి వాటిలో ఒకటని ఆయన గుర్తు చేశారు. సమాజంలోని మార్పులను ప్రజల జీవన విధానాన్ని, ప్రకృతి అందాలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో జరిగే సంఘటనలను భవిష్యత్తు తరాలకు భద్రపరచడంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు.

## 28నప్రభుత్వ ఉద్యోగులరాష్ట్రస్థాయి సదస్సు



**విజయవాడ, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** ఉద్యోగుల సమస్యలు, తమకు రావాల్సిన వేతన బకాయిల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టనున్న ఉద్యమానికి తరలిరావాలని ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అమరావతి జె.ఎ.సి. విజ్ఞప్తిచేసింది. ఉద్యమంలో భాగంగా ఈ నెల 28వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులనుజె.ఎ.సి సభ్యులు మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చిన ఎ.పి.జె.ఎ.సి. అమరావతి, ఛైర్మన్ బొప్పరాజు ఆధ్వర్యంలో నాయకుల బృందం విజయవాడ ఎ.పి. ఎన్.జి.ఒ భవన్ కి వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు, ఎ.పి.జె.ఎ.సి. ఛైర్మన్ ఏ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణలను కలసి ఉద్యోగుల, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వివరించారు. ప్రధానంగా ఉద్యోగులబకాయిలపై ప్రభుత్వం గత రెండేళ్లుగా స్పందించనందున, ఎ.పి.జె.ఎ.సి. అమరావతి ఉద్యమ కార్యాచరణకు వివరించారు. ఈసందర్భంగా బొప్పరాజు గారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలైనా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన వెంటనే నిర్ణయాలు వెల్లడిస్తాయని, కానీ కూటమి ప్రభుత్వం గత నెల 22వ తేదీన చర్చలు జరిపి నెల రోజులు దాటినప్పటికీ ఎటువంటి నిర్ణయాలు ప్రకటించలేదని, ఇది చాలా బాధాకరమని, కాబట్టి ఉద్యోగులు అందరూ గతంలో మాదిరి రెండు జేఏసీ లు కలిసి ఉద్యమం చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొప్పరాజుతో పాటు సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు, ఉద్యమ కమిటీ అధ్యక్షుడు టి వి ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మన్నర్తి నాగేశ్వరావు, మహిళా విభాగం రాష్ట్ర ఛైర్ పర్సన్ పారే లక్ష్మి ్మ, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి ్మ, వి.ఆర్.ఒ.లసంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జి.అనుపమ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, రాజధాని నగర అధ్యక్షుడు రవి ప్రసాద్,ప్రధానకార్యదర్శి మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

- 15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# దొంగల కుటుంబం

**నెల్లూరు క్రైం, ఆగస్టు 25, ప్రభాతవార్త - వైద్యం:** రైల్వే రక్షణ, ప్రయాణికుల భద్రతను ధ్యేయంగా మలుచుకుని నెల్లూరు ప్రభుత్వ రైల్వే పోలీసులు భారీ విజయం సాధించారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఘరానా దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో సొత్తును రికవరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జి. మురళీధర్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న దొంగతనాలపై రైల్వే పోలీసులు రైల్వే ఐజీ రాజకుమారి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. అందులో భాగంగా డీఎస్పీ జి. మురళీధర్ పర్యవేక్షణలో నెల్లూరు రైల్వే సీఐ ఎ. సుధాకర్, గూడూరు ఎస్ఐ ఎం. నారాయణ, నెల్లూరు ఎస్ఐ ఎన్. హరి చందనలతో కూడిన మూడు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలు గూడూరు, బొగ్గులదిబ్బకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తాళ్ళూరు అనిల్ కుమార్, తాళ్ళూరు సునీల్, షేక్ కాలేషా అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అరెస్ట్ అయిన ముగ్గురూ కూడా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. వీరికి తల్లిదండ్రుల సరైన ఆదరణ లేకపోవడం, స్థిర నివాసం లేకపోవడంతో చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. జల్సాల కోసం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. వీరంతా పాత నేరస్తులు కాగా, గతేడాది ప్రకాశం జిల్లా ఇంకొల్లు పోలీస్ స్టేషన్, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

## శ్రీశైలంలో క్యూకాంప్లెక్సు

**శ్రీశైలం ప్రాజెక్ట్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి 10వ సమావేశం పరిపాలన భవనంలో నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొనగా, సమావేశంలో మొత్తం 18 అంశాలు చర్చించారు. వీటిలో 15 అంశాలు ఆమోదించారు. మిగతా 3 అంశాలను వాయిదా వేశారు. సమావేశ ప్రారంభంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సామాన్య భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించే సామాన్య భక్తుల సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా క్షేత్రాన్ని దర్శించే ప్రతీ భక్తుడిని ఒక అతిథిగా భావిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనను చేపడతామని వివరించారు. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తుల సౌకర్యార్థం ప్రతీ శని,ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నవేళలో శ్రీస్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా కేవలం రాత్రి వేళలో మాత్రమే శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన క్యూకాంప్లెక్సు నిర్మాణ పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్ దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. మొత్తం ఒకేసారి 12వేల మంది భక్తులు వేచివుండే విధంగా 3 అంతస్తులుగా ఈ క్యూకాంప్లెక్సు నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు సిద్ధవట ఆలయంలో నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

## తిరుమల సమాచారం

### మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆనందనిలయంలోని సంపంగి ప్రాకారంలో మలయప్పస్వామి ఉత్సవ మూర్తులకు 3రోజులు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం సాయంత్రం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం తిరుమలేశుని ఆలయం లోపల సంపంగి ప్రాకారంలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి యాగశాలలో హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఉభయదేవేరులతో మలయప్పస్వామి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్ఒ అల్లం సురేంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### 28న గోవిందరాజస్వామి ఆలయంలో శ్రావణ ఉపకర్మ



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో 28వ తేదీ శ్రావణ ఉపకర్మను ఆగమోక్తంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు గోవిందరాజస్వామి, శ్రీ కృష్ణస్వామిని మంగళవాయిద్యాల నడుమకపి లతీర్థంలోని ఆళ్వార్‌తీర్థానికి ఊరేగింపుగా తీసుకువెళతారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు ఆర్.ఎస్. మాడ వీధిలోని వైఖానసాచార్యుల ఆలయంలో భూసమేత గోవిందరాజస్వామికి ఆస్థానం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకుంటారు. శ్రావణ పౌర్ణమి పర్వదినాన నిర్వహించే ఈ పవిత్ర శ్రావణ ఉపకర్మలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళానుగ్రహాన్ని పొందాలని టిటిడి కోరింది.

### ఆర్టీసీ విద్యుత్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసి విద్యుత్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసి విద్యుత్ బస్సుల డ్రైవర్స్ యూనియన్ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ జయచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.బాలసుబ్రహ్మణ్యంతో బాటు డ్రైవర్‌లు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మునీంద్ర, అధ్యక్షుడు మునయ్య, కోశాధికారి యువరాజు, కేవస్ నాయక్, వి. సోమశేఖర్, పీకే రెడ్డి, యు.విజయకుమార్, ఎం. ప్రవీణ్, సి. సోమశేఖర్, వి. హేమంత్, సి. అనిల్ కుమార్, బి. వినోద్ కుమార్, ఎస్కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# వేళాపాళా లేని సర్వదర్శనం టోకెన్లు జారీ !

- ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ కోటాకోసం భక్తుల అవస్థలు
- అర్ధరాత్రి దాటాక గంటన్నరలోపే మూసివేత




**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి దేశ వ్యాప్తంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సామాన్యభక్తుల తాకిడితో తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టిటిడి జారీచేస్తున్న సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లకు వేళాపాళా లేకుండా పోయింది. ఈ టోకెన్లు ఎప్పుడు జారీచేస్తారో.. ఎప్పుడు అయిపోతాయో అనే సమాచారం కూడా తెలియకుండా భక్తులు అవస్థలు పడుతున్నారు. రద్దీ పెరిగితే ఈ టోకెన్లు జారీకి సమయం సందర్భం లేకపోతోంది. అధికారుల ఇష్టారాజ్యంగా మారిందనేది భక్తుల నుండి వినిపిస్తున్న విమర్శలు. రోజువారీగా 10వేల సర్వదర్శనం టోకెన్లు, 2వేలు దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారి మెట్టు మార్గం) విడుదల చేస్తున్నారు. ఈ టోకెన్లకోసం దాదాపు ఏడెనిమిది గంటల సమయం తిరుపతిలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసం వసతిసముదాయం, రైల్వేస్టేషన్ సమీపంలోని విష్ణునివాసంతోబాటు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరి ఉంటారు. భక్తుల రద్దీ పెరిగితే టిటిడి తలనొప్పిని తగ్గించుకునేందుకు ఈ టోకెన్లు ఎప్పుడు బడితే అప్పుడు జారీ చేస్తుండటం జరుగుతోంది. సాధారణంగా తిరుపతిలో ఆఫ్‌లైన్ కౌంటర్లలో మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో ఈ సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాల్సి ఉంది. ఈ టోకెన్లు అందుకున్న భక్తులు ఆ రోజుగానీ, మరుసటిరోజుగానీ తిరుమలకు చేరుకోవచ్చు. అయితే వీరికి ఎలాంటి వసతి సౌకర్యం గదులు కేటాయించరు. భక్తులు ఆలయం ముందుగానీ, తిరుమలలోనే పార్కుల్లో, ఖాళీస్థలాల్లో, కాటేజీల వద్ద, యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకునే వెసలుబాటు ఉంది. ఇలా రోజుకు 12వేలమంది వరకు సామాన్యభక్తులు ఆఫ్‌లైన్‌లో టోకెన్లు పొంది తిరుమలకు వస్తుంటే ఎలాంటి టోకెన్లు, దర్శన టిక్కెట్లు లేని భక్తులు 30వేలమంది వరకు వస్తున్నారనేది టిటిడి అంచనా. అయితే తిరుమలలో వసతి మాత్రం వీరికి కేటాయించరు. **ఆఫ్‌లైన్‌కు పెరుగుతున్న డిమాండ్:**సాధారణంగానే తిరుమలకు దేశం నలుమూలల నుండి భక్తులు తరలివస్తున్నారు. మరీ వారాంతంలో ఈ భక్తుల సంఖ్య 50వేల మంది వరకు ఉంటుంది. వారాంతంలోనూ 10వేల సర్వదర్శనం టోకెన్లు మాత్రమే జారీచేస్తుండటంతో మిగిలిన వాళ్ళు సాధారణ సర్వదర్శనంపై ఆధారపడుతున్నారు. ఇలా రద్దీపెరిగితే 24గంటల పైగా భక్తులు నిరీక్షణ తప్పడంలేదు. ఇక లక్షలాదిమంది భక్తులు తమ ఇష్టదైవాన్ని శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా తనివితీరా వీక్షించాలని తపన పడుతుంటారు. అలాంటి వారికి ఆలయంలోపల బంగారువాకిలిలో జయవిజయుల వరకే మహాలఘు దర్శనం చేసి పంపుతున్నారు. ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న టైమ్‌స్లాట్ టోకెన్ల కోసం ఇప్పటికీ సమయం సందర్భం లేకుండా ఉండటంతో క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు గంట సమయంలోనే ఈ టోకెన్లన్నీ జారీ అయిపోతున్నాయి. దీన్నిబట్టి సామాన్యభక్తులు స్వామివారి దర్శనానికు ఎంతటి ఆసక్తి చూపుతున్నారనేది తెలుస్తుంది. టిటిడి కూడా ఎప్పటికప్పుడు భక్తులకు సంతృప్తికర, సులభ దర్శనం చేయించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతిరోజూ తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు 90వేల మంది వరకు ఉండటం విశేషం. టిటిడి పాలకమండలి, అధికారులు సామాన్యభక్తులకు దేవుని దర్శనమ్ మరింత తక్కువసమయంలో సంతోషంగా చేయించాలనే తపనతో వినూత్నంగా ఆలోచన చేస్తున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. టోకెన్లతో కొండకు వచ్చినా సాధారణ సర్వదర్శనమ్‌లోనే వైకుంఠమ్ 2నుండి, రద్దీ పెరిగితే ఆలయం వెలుపల క్యూలైన్ల నుండి ప్రవేశించాల్సిన కష్టం భక్తులకు తప్పడంలేదు.

## బ్రహ్మోత్సవాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత

**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేందుకు టిటిడి ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఇకపై ప్రతి మంగళవారం "క్లీనింగ్ డే" ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంటోందని భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. వారం రోజుల పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల పరిసరాల్లో పేరుకుపోయే వ్యర్థాలు, మురికి తదితరాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేసి సంపూర్ణంగా శుభ్రం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు సురక్షితమైన సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుపతికి దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రయాణికుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం, అనుమతించిన ప్రయాణికుల సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, వాహనాలను నిర్లక్ష్యంగా నడపడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. తిరుమల పోలీస్, తిరుపతి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు వివిధ స్టాండ్‌ల అసోసియేషన్ సభ్యులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్య, అలిపిరి ఎవిఎస్ఒ రమేష్‌కృష్ణ, ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్, ఈ సందర్భంగా డ్రైవర్లకు బ్రహ్మోత్సవాల సమయంలో పాటించాల్సిన ట్రాఫిక్, రవాణా మరియు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

## నకిలీ బంగారం తాకట్టు

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం తిరుపతినగరంలో ముగ్గురు కేటుగాళ్ళు కుదువవ్యాపారులను నమ్మించి నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో నగదుతో ఉడాయించారు. ఈ ఉదంతం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. తిరుపతిలో వివిధ ప్రాంతాల్లో కేటుగాళ్ళు మూడు కుదువ దుకాణాల్లో దాదాపు 60 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ. 5.24లక్షలు నగదు తీసుకున్నారు. తిరుపతి లక్ష్మీపురం సర్కిల్లో ఉన్న భవాని పాన్ బ్రోకర్, దేవేంద్ర పాన్ బ్రోకర్, ఎల్ ఎస్ నగర్ లోని వినాయక కుదువ దుకాణాల్లో వ్యాపారులు మోస పోయారు. అంకిత, భాస్కర్ నాయుడు పేర్లతో ఉన్న ఆధార్ కార్డులు చూపించి నగదు పొందినట్లు పోలీసుల ఫిర్యాదులో ఉంది. ఆ బంగారు నగల హాల్ మార్క్ నమ్మి నగలు తీసుకొని కుదువ పెట్టుకున్న వ్యాపారస్తులు. సాధారణంగా నగలను చూసి డబ్బులు తీసుకోవడం పరిపాటి. అయితే తిరుపతిలో కుదువ వ్యాపారులు (పాన్‌బ్రోకర్స్) చిరునామాల కోసం ఆధార్‌కార్డులు, తెలిసిన నమ్మకైన వ్యక్తులతోనే వ్యాపార లావాదేవీలు సాగిస్తారు.

# శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో రాష్ట్ర మంత్రులు

### ఆశీర్వదించిన పీఠాధిపతి



**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త;** మంత్రాలయంలోని ప్రసిద్ధ శ్రీ గురు రాఘవేంద్రస్వామి మఠాన్ని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి.జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ గురు రాఘవేంద్రస్వామివారి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్రతీర్థ స్వామివారు మంత్రులకు శేషవస్త్రం కప్పి, ఫల మంత్రాంక్షింతలు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్ల మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రులు మఠం దర్శనానికి ముందుగా మంచాలమ్మ గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జిల్లాభివృద్ధి, సుఖ సంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.

## దుర్గమ్మవారి సేవలో నూతన ఏపీ లోకాయుక్త



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని నూతన ఏపీ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ డీఈఓ కిషోర్ కుమార్ అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలు మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. **- నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని బాపట్ల జిల్లా పేటేరు గ్రామంకు చెందిన భావన రుషి మంగళవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ఉచితాలకు వ్యతిరేకం

- ప్రభుత్వాలు ఉచితాలకు స్వస్తి పలకాలి
- విద్య, వైద్యం ఉచితంగా అందించాలి
- విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**వింజమూరు(నెల్లూరు), ఆగస్టు 25 ప్రభాతవార్త:** విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా దేశ ప్రగతికి ఉపయోగపడేలా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, పట్టుదలతో లక్ష్యాలను సాధించి దేశానికి సేవ చేయాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఒక పవిత్ర ధర్మమని, అధ్యాపకులు తమ ప్రవర్తనతో, వాత్సల్యంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా సెల్ ఫోన్ రిపేరింగ్, టీవీ, రిఫ్రిజిరేటర్, మోటార్ రివైండింగ్, నర్సింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల యువత సొంత కాళ్లపై నిలబడుతున్నారని తెలిపారు. కేవలం సాధారణ డిగ్రీల వల్ల ఉపయోగం లేదని, వృత్తి విద్యా విధానం వల్లనే నిజమైన ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తి, సమయపాలన, మన కట్టు బొట్టు, ఆటపాటలపై గౌరవం పెంపొందించాలన్నారు. వేషభాషలు, కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమనిగర్వించాలన్నారు. తెలుగు భాషను తప్పక నేర్పించాలని, తెలుగు మీడియంలో చదువుకున్న వారు సైతం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. పిల్లలు పెద్దలతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు.ప్రభుత్వాలు నడిపే పెద్దలు ప్రజలను ఉచితాల నుంచి దారి మళ్లించాలని వెంకయ్య నాయుడు సూచించారు. "నేను ఉచితాలకు వ్యతిరేకం. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోతే ఉచితాలు ఎలా ఇస్తారు? అడిగినా, అడగకపోయినా అన్నీ ఫ్రీ ఇవ్వడం సరికాదు. ఫ్రీ ఇవ్వాల్సి వస్తే విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. రోడ్లు, కరెంటు, మంచినీరు, రైతుకు 24 గంటల విద్యుత్, ఆసుపత్రిలో వైద్యులు, మందులు ఉండేలా చూడాలి" అని అన్నారు. బస్సుల్లో అందరికీ ఉచితం కాకుండా అంగవైకల్యం కలిగిన వారికి మాత్రమే ఇవ్వాలని, స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లైనా ఇంకా ఉచితాలు ఇవ్వడం అర్థరహితమన్నారు. దేశ ప్రజల కోసం ప్రధాని మోదీ ఏటా రూ.82 వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు బియ్యం అందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని కావడం మనందరి అదృష్టమని, దానికి గొప్ప చరిత్ర ఉందని అన్నారు. దానిపై ఇంకా కొందరు రాజకీయం చేయడం సరికాదని, మన పూర్వీకులను గౌరవించుకోవడం మన సంప్రదాయమని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

**దగదర్తి, (నెల్లూరు) ఆగస్టు 25 ప్రభాతవార్త:** మండలంలోని దుండిగం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కాప దామోదర్ (47) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుండిగం ప్రజలు, అధికారుల వివరాల ప్రకారం దామోదర్ తన ద్విచక్ర వాహనాన్ని గ్రామంలోని రహదారి వద్ద ఉంచి, సమీప బీడు పొలాల్లో సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్ల వద్ద మృతి చెంది ఉన్నాడు 11 కెవి వైర్లను చూసుకోకుండా చెయ్యి తగిలి మృతి చెంది ఉంటాడా లేక అతనే వైర్లు తాకి మృతి చెంది ఉంటాడా అని అనుమానంతో వ్యక్తం చేస్తూ దుండిగం ప్రజలు చెప్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉండగా, నెల్లూరులో ఇంటర్ చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## క్రీడా కార్యక్రమాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

### అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా



**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా కేంద్రంలో జరుగుతున్న అమరావతి ఛాంపియన్ స్పోర్ట్స్ మీట్ నేపథ్యంలో క్రీడాకారులకు పూర్తిభద్రత కల్పిస్తున్నారు. తిరుపతిలోని తారకరామ స్టేడియం, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, పద్మావతి విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో తిరుపతి జిల్లా పోలీసులు శక్తి బృందాలను మోహరించి ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు. శాప్స్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సూచనలతో క్రీడా కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులు, మహిళలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో శక్తి బృందాలు నిరంతరం పర్యటిస్తూ అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహిళ అదనపు ఎస్పీ ఎం. శ్రీలత పర్యవేక్షణలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ప్రజల భద్రత, మహిళలు-చిన్నారుల రక్షణకు జిల్లా వ్యాప్తంగా పోలీసుల గస్తీ, నిఘా అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి.

## సుప్రీంకోర్టులో వైఎస్సార్సీపీకి ఎదురుదెబ్బ

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ ఆదేశాలతో తమ సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేశారని, అలాగే కర్నూలు, గుంటూరు జిల్లాల్లోని 4 కేసులపై వైఎస్సార్సీపీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్‌నాగు ధర్మాసనం నిరాకరించింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

## స్క్రబ్బర్ స్కామ్ నిందితుల రిమాండ్ పెంపు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాషా అల్లా స్క్రబ్బర్ స్కామ్‌లో నిందితుల రిమాండ్ గడువు నేటితో ముగిసింది. వారిని అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి, ఆ నిందితుల రిమాండ్‌ను కూడా సెప్టెంబర్ 8 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో నిందితులు పలువురి స్క్రబర్ల విక్రయాలు ఇతర అంశాలపై మోసగించి, రూ.కోట్లు కొల్లగొట్టారు. దాంతో నిందితులపై పోలీసుల కేసు నమోదు చేసారు. నిందితులపై ఇతర జిల్లాల్లోను కేసులున్నాయి. ప్రస్తుతం వీరు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

## సాయికృష్ణ కేసు నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితుల జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగిసింది. దీంతో రిమాండ్‌లో ఉన్న నాగరాజు సహా ఇతర నిందితులను అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, వారి రిమాండ్‌ను సెప్టెంబర్ 8 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సాయికృష్ణ కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో లాకప్‌డెత్ అయ్యాడు. ఈ విషయాన్ని నిందితుల రిమాండ్ రిపోర్టులో సిట్ స్పష్టం చేసింది. ఈ కేసులో నిందితులందరిని పోలీసులు కోర్టు కస్టడీకి తీసుకుని విచారించారు. ప్రస్తుతం వీరంతా రిమాండ్‌లో ఉన్నారు.

## ఉమెన్ ఎపిఎల్ వేలం

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమెన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వేలం విజయవాడలో కొనసాగుతుంది. 191 మంది క్రీడాకారిణులు ఈ వేలంలో పాల్గొన్నారు. జనాలుగు ఫ్రాంచైజీలు ఒక్కొక్కటి రూ.15 లక్షలతో ప్లేయర్లను కొనుగోలు చేసేందుకు వీలుగా ఈ వేలం సాగుతుంది. ఈ లీగ్‌కు అంబాసిడర్‌గా మిథాలీరాజ్ వ్యవహరిస్తారు. సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ వేలంలో అమరావతి ఈ ఛాంపియన్స్ ఫ్రాంచైజీ పలువురు కీలక క్రీడాకారిణులను సొంతం చేసుకుంది. హేమసాయి రమ్యను రూ.55 వేలకు, క్రరి సాయిపూజితను రూ.50 వేలు, నక్కా సనాను రూ.45 వేలు, ఒరుగంటి సాహితీశ్రీని రూ.40 వేలకు దక్కించుకుంది. బి.సాయిదీప్తి, తాళ్లూరి మల్లిక, బొడ్డుపల్లి తనిష్కను, సహస్రారెడ్డిని ఒక్కొక్కరినీ రూ.30 వేలకు దక్కించుకుంది. ఈ వేలంలో అమరావతి ఈఛాంపియన్స్ ఫ్రాంచైజీ పలువురు కీలక క్రీడాకారిణులను సొంతం చేసుకుంది. విశాఖకు చెందిన షబ్నంను రూ.1.30 లక్షలకు ఆ జట్టు కొనుగోలు చేసింది. నీరగట్టు అనూషను అత్యధికంగా రూ.2.10 లక్షలకు దక్కించుకుంది. అలాగే బ్యాటర్ పరసా రంగలక్ష్మిని రూ.లక్షకు సొంతం చేసుకుంది. వికెట్ కీపర్ కాట్రగడ్డ దీక్షను రూ.1.90 లక్షలకు ఈఛాంపియన్స్ కొనుగోలు చేసింది.

## వెలిగొండ ప్రాజెక్టుకు జలకళ

# మార్కాపురం జిల్లాలో సంబరాలు

- మార్కాపురం పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ



**మార్కాపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు దశాబ్దాల నిరీక్షణకు ఐదు రోజుల్లోపు తెరపడనుంది.. కరువు దుర్భిక్షంతో అల్లాడిపోతున్న పశ్చిమ ప్రాంతంలో త్వరలో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కనుంది. వెలిగొండ టన్నెల్స్ ద్వారా కృష్ణా జలాలను నల్లమల్ల సాగర్‌లోకి విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తుంది. కృష్ణమ్మ జలకళతో పశ్చిమ ప్రాంత ప్రజల కష్టాలు తీరిపోనున్న రోజులు దగ్గరలో రానున్నాయి. వెలిగొండ రెండవ టన్నుల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పోరాటం చేశారు. సైకిల్ యాత్ర, రిలే నిరాహార దీక్షలు చేపట్టి మొదటి టన్నుల వల్ల ప్రజలు జరుగుతున్న అన్యాయంపై అలుపెరగని పోరాటం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. రెండవ టన్నుల అవశ్యకతను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ టన్నెల్ మంజూరు చేసింది. అయితే రెండవ టన్నెల్ కోసం అహర్నిశలు పోరాటం చేసి సాధించారు.త్వరలో విడుదల కానున్న వెలిగొండ నీటి విడుదల తో మార్కాపురం జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మార్కాపురం పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 31వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు కు ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమైన ట్రాక్టర్ల ర్యాలీ కాలేజీ రోడ్, దోర్నాల బస్టాండ్, అమ్మవారి శాల, గడియార స్తంభం సెంటర్, కంభం బస్టాండ్, కోర్టు సెంటర్, పూల సుబ్బయ్య కాలనీ మీదుగా శ్రీ అల్లూరు పోలేరమ్మ దేవస్థానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూటమినేతలు దేవస్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు.

**నేడు భారీ బైక్ ర్యాలీ** బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీశ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుండి శ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు కార్యకర్తలు, బిజెపి నాయకులు కార్యకర్తలు వేల సంఖ్యలో బైకులతో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ట్రాక్టర్ ర్యాలీలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి పి.వి కృష్ణారావు, టిడిపి యువ నాయకులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఘన వీడ్కోలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు వీడ్కోలు కార్యక్రమంలో ప్రసగంగిస్తున్న సీజె జస్టిస్ లీసా గిల్

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణారావుకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సమక్షంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికింది.హైకోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణారావు పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గోపాల కృష్ణారావు నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు.జస్టిస్ గోపాల కృష్ణారావు ఉమ్మడి కృష్ణా జిల్లా చల్లపల్లిలో 1964 ఆగస్టు30న జన్మించారని, చల్లపల్లి, మచిలీపట్నంల్లో పాఠశాల, కళాశాల విద్యను పూర్తి చేశారన్నారు. 1989వ సంవత్సరంలో బార్ కౌన్సిల్ సభ్యుడిగా, న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణులై జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారన్నారు. జనవరి 2023లో హై కోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని, 2024 ఆగస్టులో ఏపీ హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు. జస్టిస్ గోపాల కృష్ణారావు తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని తెలిపారు. తదుపరి జిల్లా, సెషన్స్ జడ్జీగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పదవీ విరమణ అనంతరం జస్టిస్ గోపాల కృష్ణారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేయనున్న జస్టిస్ గోపాల కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అంతకు ముందు అదనపు సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డి జస్టిస్ గోపాల కృష్ణారావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసిపిదే విజయం

- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల తీర్పు ఖాయం: వైఎస్ జగన్



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే వైసిపిదే విజయమని, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్నారు. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని, ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కోఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని, సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వైఎస్ జగన్ వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన్న అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసిపి- కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్ ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, జగన్ 2.0 సూపర్ యాప్ యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60- 70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారు.

## ఎఐఇ నియామక పరీక్షకు 81 శాతం హాజరు

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న నియామక పరీక్షల్లో భాగంగా రోజు మంగళవారం 81 శాతం హాజరయ్యారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ పరీక్షకు మొత్తం 5,120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 4,040 మంది ఈ పరీక్షకు హాజరయ్యారని, అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన టెలికాం పరీక్షకు 4,764 మంది హాజరు కావాల్సి ఉండగా, 3,967 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలియజేశారు.

## ఎసిబి డిఎస్పీ పేరుతో సైబర్ మోసం



**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎసిబి అధికారి పేరుతో తిరుపతిలోని ఓ విశ్రాంత అధికారిని నమ్మించి సైబర్ నేరస్తుడు రూ.2 లక్షలు నగదు బదలీ చేసుకున్నాడు. ఈ ఉదంతంపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తిరుపతికి చెందిన వై. వెంకటరమణకు ఐదురోజుల క్రిందట గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎసిబి డిఎస్పీగా పరిచయం చేసుకున్నాడు. ఈయన సర్వీసులో ఉన్న సమయంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, రూ.5 లక్షలు చెల్లించకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపి పెన్షన్ ప్రయోజనాలను నిలిపివేయిస్తామని బెదిరించాడు. బెదిరింపులకు భయపడిన బాధితుడు సైబర్ నేరస్థుడు సూచించిన ఫోన్ నంబర్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.2 లక్షలు బదలీ చేశాడు. మళ్ళీ మరో రూ.3లక్షలు చెల్లించాలంటూ మరుసటి రోజు మరో నంబర్ నుండి ఫోన్ చేసి వేధించడంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు అలిపిరి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు సంబంధిత సైబర్ నేరం, మోసం తదితర వర్తించే చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో నిందితులను గుర్తించి, వారి కదలికలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించి, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం దర్యాప్తు కొనసాగిస్తోంది.

## తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణకు సీనియర్ డిసిఎంగా పదోన్నతి





**తిరుపతి, ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కుప్పాల సత్యనారాయణకు గుంతకల్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (సీనియర్ డిసిఎం)గా పదోన్నతి లభించింది. సీనియర్ డీసీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో బాటు తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా కూడా తన సేవలనుకొనసాగించనున్నారు. కుప్పాల సత్యనారాయణ రైల్వే శాఖలో స్టేషన్ మాస్టర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేషన్ మాస్టర్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ తదితర కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. రైల్వే శాఖ నుండి డిప్యూటేషన్‌పై సిబిఐలో రెండేళ్లపాటు విధులు నిర్వర్తించారు. అనంతరం తిరిగి రైల్వే శాఖలో చేరి లైజన్ ఆఫీసర్‌గా, సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు.



## క్యూర్ పరిధిలో టిజి సేఫ్ దాడులు

### 15 టన్నుల నాణ్యతలేని ఆహారవస్తువుల జప్తు

### పలు సంస్థలకు నోటీసులు, ఒక దుకాణం లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మంగళవారం నాడు క్యూర్ (ఓఆర్ఆర్) పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలు, వ్యాపార సంస్థలపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. ఈ నెల 22వ తేదీన మొదటి సారిగా దాడులు నిర్వహించిన టిజి సేఫ్ మూడు రో జుల వ్యవధిలో మరోదఫా దాడులు చేబట్టింది. కల్తీ ఆహార వస్తులను గుర్తించి తొలగించడం, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల విక్రయాలను అడ్డుకోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న టిజి సేఫ్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 15 బృందాలు పాల్గొనగా 32 చోట్ల తనిఖీలు జరిగాయి. దాడుల సందర్భంగా అనేకచోట్ల ఆహార వ స్తువుల విక్రయాల కేంద్రాల వద్ద పరిశుభ్రత లేకపోవడం వెలుగు చూసింది. గడువు ముగిసిన వస్తువులను అమ్ముతున్న వైనం రట్టయ్యింది. ఆ హార వస్తువులను నిలువ వుంచే పద్దతులు సవ్యంగా లేక పోవడం గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలను మంచివిగా చెబుతూ అమ్ముతున్న ట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు చాలాచోట్ల కనిపించలేదు. ఆహార వస్తువుల ప్యాకింగ్ అనేకచోట్ల సవ్యంగా లేదు. 35 ఆహార వస్తువుల శ్యాంపుల్స్ సేకరించగా బాచుపల్లిలో బర్ఫీఘర్ స్వీట్ షాప్‌లో కనీస ప్రమాణాలు లేకుండా మిఠాయిలు తయారు చేస్తున్నందు కు దీని లైసెన్స్‌ను రద్దు చేశారు. 12 దుకాణాల ప్రమాణాలు సరిగ్గా లేకపోవడంతో వాటిని వెంటనే మెరుగు పరచుకోవాలని నోటీసులు ఇచ్చారు. నాలుగు దుకాణాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దాడుల సందర్భంగా నాణ్యత లేకుండా వున్న 15 టన్నుల ఆహార వస్తువులను టిజి సే ఫ్ అధికా రులు జప్తు చేశారు. వీటి విలువ 30 లక్షల రూపాయలు వుంటుందని అధికారులు తెలిపారు.

# అబద్ధాదలు చెప్పి పెళ్ళి చేసారు, నా గొంతు కోసారు

- మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై కోడలు మేఘన సంచలన ఆరోపణలు



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ వ్యవహారం ఏపీలో సంచలనంగా మారింది. జోగి కుటుంబంపై కోడలు మేఘన సంచలన ఆరోపణలు చేశారు. అన్నీ తెలిసే తన గొంతు కోశారంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు అండగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని అందరికీ తెలిపేందుకు మీడియా ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఇలాంటి రోజు వస్తుందని, ఆడపిల్లగా ఇలా మాట్లాడాల్సి రావడం చాలా బాధగా ఉందని ఆవేదన చెందారు. "నాకు జరిగిన అన్యాయాన్ని ఎదుర్కొని గట్టిగా నిలబడ్డాను. ఈరోజు ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు గర్వంగా ఫీలవుతున్నా. జోగి రమేశ్, వారి కుటుంబ సభ్యులు నాపై నిందలు వేస్తున్నారు. 2025 మేలో జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌తో నాకు పెళ్లి చేశారు. మా నాన్న నా సంతోషం కోసం ఎంతో కష్టపడి ఈ పెళ్లి జరిపారు. జోగి రమేశ్ మీద నమ్మకంతో వారింటికి కోడలుగా పంపారు. అందరి ఆడపిల్లలాగా ఎన్నో ఆశలతో ఆ ఇంట్లో అడుగు పెట్టాను. కొన్ని రోజులకే నన్ను ఇబ్బందులు పెట్టడం ప్రారంభించారు. ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి విడిపోవడం అనేది సహజం. కానీ రాజీవ్‌కు ఉన్న ప్రాబ్లమ్ ఆ కుటుంబ సభ్యులు అందరికీ తెలుసు. అయినా నాకు అతనితో పెళ్లి చేసి, తెలిసి తెలిసి అమ్మాయి గొంతు కోయడం అనేది పెద్ద నేరం. జోగి రమేశ్‌కు కూడా ఒక కూతురు ఉంది. ఆమెకు ఇలా జరిగితే ఏం చేస్తారు. అసలు లోపం ఉందని తెలిసి నాతో ఎలా పెళ్లి చేశారో జోగి రమేశ్ చెప్పాలి. మా ఇద్దరి మధ్య గొడవలు రావడం వల్లే విడిపోయారని జోగి రమేశ్ చెబుతున్నారు. అసలు మా ఇద్దరి మధ్య ఎటువంటి గొడవ వచ్చిందో ఆయన చెప్పాలి. అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకే జోగి రమేశ్ నిన్న మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు తెలియజేయాలనే నేడు నేను మీడియా ముందుకు వచ్చాన్ను అని చెప్పుకొచ్చారు. జోగి రమేశ్ నిన్న సింపథీ కోసం, రాజకీయం కోసం మాట్లాడినట్లుగా ఉంది. అసలు వాస్తవాలు ఏమిటో నేను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాను. త్వరలోనే అన్ని విషయాలు అందరికీ తెలుస్తాయి. మా వివాహం జరిగిన తర్వాత ఉన్న ఇబ్బందులను మా మావయ్య, అత్తయ్యకే వివరించాను. సమస్యలను పరిష్కరించకుండా అదనపు కట్నం తేవాలంటూ మా అత్తయ్య నన్ను హింసించింది. మాకు పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. తాము చెప్పిందే చేయాలని బెదిరించారు. అదనపుకట్నం తీసుకువస్తే నువ్వు హ్యాపీగా ఉంటావు.. అప్పుడే అతనికి ఫీలింగ్స్ వస్తాయని అత్త మాట్లాడింది. తల్లి స్థానంలో ఉన్న శకుంతల, అర్థం చేసుకోకుండా నన్నే తప్పు బట్టారు. మా పెళ్లికి ముందు హిందువులమని చెప్పి మాకు పెళ్లి చేశారు. కానీ వారి కుటుంబం మొత్తం క్రిస్టియన్స్, ఇంట్లో హిందూ పూజలు అస్సలు చేయరు. నేను చిన్ననాటి నుంచి హిందూ పూజలు చేయడం అలవాటు. నేను వారింటికి వెళ్లిన తర్వాత కూడా ఒక్క హిందూ దేవుళ్ల ఫొటో కూడా లేదు. నేను దేవుళ్ల ఫొటో తెచ్చి పూజ చేస్తుంటే అడ్డుకుని కొట్టారు. ఎవరి నమ్మకం వాళ్లది.. కానీ మాకు క్రిస్టియన్ మతం తీసుకున్నట్లు కూడా చెప్పలేదు. హిందువులమే అని చెప్పి... మాకు ఆ ప్రకారం పెళ్లి చేశారు.. అంటే ఇది కూడా మెసం చేయడం కాదా. ఎవరినో కలిస్తే.. నడిపిస్తున్నారని చెబుతున్నారు. కానీ మా వద్ద ఇంకా చాలా ఆధారాలు ఉన్నాయి.. వాటిని కూడా త్వరలోనే బయట పెడత్మా అని తెలిపారు. అత్తగా ఉన్న శకుంతల అనేక రకాలుగా నన్ను ఇబ్బందులు పెట్టారు. కొడుకు లోపం గురించి మాత్రం మాట్లాడకుండా నిందలు నా పై మోపుతున్నారు. నేను పూజలు చేసుకునే సమయంలో అడ్డుకుని.. చేతిలో ఉన్న హారతి, అగర్ బత్తీలు లాగి పడేశారు. మీ దేవుళ్లు కూడా ఒక దేవుళ్లేనా... ఇవన్నీ ఆవేదన వ్యక్తం చేశారు.



# నెక్సో ఛాంపియన్‌షిప్.. శుభంకర్ 46వ స్థానం

**స్కాట్లాండ్‌బి:** ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ లింక్స్‌లో జరిగిన 2026 నెక్సో ఛాంపియన్‌షిప్ చివరి రౌండ్‌లో ఈవెన్‌పార్ 72 స్కోరు సాధించిన భారత గోల్ఫ్ క్రీడాకారుడు శుభంకర్ శర్మ, 46వ స్థానంలో నిలిచాడు. మూడు బర్డీలు, మూడు బోగీలు నమోదు చేసిన శర్మ, 73, 72, 75, 72 రౌండ్ల తర్వాత నాలుగు ఓవర్ 292 స్కోరుతో టోర్నమెంట్‌ను ముగించాడు. తోటి భారత ఆటగాడు యువరాజ్ సంధు ఈ వారం ప్రారంభంలో కట్ మిస్ అయ్యాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్కాట్ జేమీసన్ తన స్వదేశంలో రెండవ డీపీ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకోవడానికి, చివరి రౌండ్‌లో 67 స్కోరుతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. 42 ఏళ్ల అతను 11అండర్ పార్ స్కోరుతో ముగించి, ఇంగ్లాండ్‌కు చెందిన మాథ్యూ జోర్డాన్ కంటే రెండు షాట్లు ముందున్నాడు. జామీసన్ చివరి రౌండ్‌ను రాత్రికి అగ్రస్థానంలో ఉన్న షాన్ నారిస్ కంటే మూడు షాట్లు వెనుకబడి ప్రారంభించినప్పటికీ, ఫ్రంట్ నైన్‌లో మూడు బర్డీలతో ఆ లోటును త్వరగా పూడ్చాడు. స్ట్రోక్‌ను ప్రభావితం చేసే పరిస్థితులను మెరుగుపరిచే చర్యలకు సంబంధించిన రూల్ 8.1ను ఉల్లంఘించినందుకు నారిస్‌కు తదనంతరం రెండుస్ట్రోక్ పెనాల్టీ విధించబడింది, దీంతో జామీసన్ టర్న్ వద్ద స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించాడు.

ఆట



# దులీప్ ట్రోఫీ.. సెమీఫైనల్‌కు ఈస్ట్ జోన్

**న్యూఢిల్లీ:** ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్‌ను ఒక ఇన్నింగ్స్ మరియు 210 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ భారీగా 467 పరుగులు చేయడంతో ఈ ఘన విజయం సాధ్యమైంది. ఆ తర్వాత వారు తమ ప్రత్యర్థులను రెండు ఇన్నింగ్స్‌లలో 111 మరియు 146 పరుగులకే ఆలౌట్ చేశారు. షాబాజ్ అహ్మద్ అద్భుతమైన 167 పరుగులతో విజయాన్ని నిలబెట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో అనుకుల్ రాయ్ ఐదు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను ఖరారు చేశాడు. ఈస్ట్ జోన్ తొలుత తడబడి, ఐదు వికెట్ల నష్టానికి 138 పరుగులకే పరిమితమై, ఆ తర్వాత పుంజుకుంది. వారు చివరికి 112.5 ఓవర్లలో 467 పరుగులు సాధించారు. షాబాజ్ 244 బంతుల్లో 17 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 167 పరుగులు చేసి, జట్టును పునరుద్ధరించాడు. సుదీప్ కుమార్ ఘరామి క్రీజులో అద్భుతమైన సహకారం అందించాడు. అతను 185 బంతుల్లో 25 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 146 పరుగులు చేశాడు. ఈ జోడీ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించడానికి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో తడబడిన నార్త్ ఈస్ట్ జోన్, తమ తొలి ఇన్నింగ్స్‌లో 42.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.

# భారీ ఆధిక్యం దిశగా భారత్

## 236 రన్స్‌తో వెనుకబడిన శ్రీలంక



**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించి భారీ ఆధిక్యంతో విజయానికి చేరువలో ఉంది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసి, టీమిండియా కంటే 236 పరుగులు వెనకబడి ఉంది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. ఇక 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, కామిందు మెండీస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకు పోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండీస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశవ నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా, సోనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరోవికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.



# డబ్ల్యూటిఎ టోర్నీ కోకో గాఫ్‌కు టైటిల్


**సిన్సినాటి:** యూఎస్ ఓపెన్ సమీపిస్తున్న తరుణంలో, సిన్సినాటిలో జరుగుతున్న డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో జెస్సికా పెగులాపై 6-2, 6-4 తేడాతో కోకో గాఫ్ ఆధిపత్యం చెలాయించి, 2026లో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ నంబర్ ఫోర్ గాఫ్, ఈ ఏడాది మయామి, రోమ్‌లలో జరిగిన ఫైనల్స్‌లో ఓటమిపాలైన తర్వాత, గత అక్టోబర్‌లో వుహాన్‌లో తన మొదటి డబ్ల్యూటిఏ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడవ ర్యాంక్ క్రీడాకారిణి పెగులాపై 75 నిమిషాల్లో విజయంతో టోర్నమెంట్‌ను ముగించిన గాఫ్ రెండవ సిన్సినాటి కిరీటాన్ని అందించింది. గాఫ్, పెగులా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి 4-0 ఆధిక్యం సాధించింది. పెగులా తన సర్వీస్‌ను నిలబెట్టుకుని, ఒక బ్రేక్‌ను తిరిగి సాధించి స్కోరుబోర్డుపైకి రాకముందే గాఫ్ 5-0తో ఆధిక్యంలో ఉంది. 34 నిమిషాల తర్వాత గాఫ్ మళ్లీ బ్రేక్ చేసి తొలి సెట్‌ను కైవసం చేసుకోవడంతో అది ఒక స్వల్ప ఉపశమనంగా నిలిచింది. రెండవ సెట్ కూడా అదే విధంగా సాగింది, గాఫ్ 3-0 ఆధిక్యం సాధించే క్రమంలో బ్రేక్ చేయగా, పెగులా ఆమెను అందుకోవడానికి ప్రయత్నించింది. అయితే గాఫ్ తన మొదటి మ్యాచ్ పాయింట్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. గాఫ్ విజయంతో ఇద్దరి మధ్య కెరీర్ సిరీస్ చెరో ఐదు విజయాలతో సమమైంది. వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్‌లో తన స్వదేశీయురాలిని ఓడించిన తర్వాత, ఈ సీజన్‌లో పెగులాపై గాఫ్ తన రెండవ మ్యాచ్‌ను గెలుచుకుంది.



# వరల్డ్ ర్యాంకింగ్స్‌లో.. 12 స్థానాలు ఎగబాకిన ట్రీసా-గాయత్రి

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ 12 స్థానాలు ఎగబాకి ప్రపంచ 27వ ర్యాంకును సాధించారు. ఈ మేరకు మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో ఈ భారత్ మహిళల డబుల్స్ జోడీ అనూహ్యంగా పాయింట్లతో పై పైకి చేరింది. ఇటీవల జరిగిన బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన కొద్ది రోజులకే ట్రీసా, గాయత్రిల ఎదుగుదల చోటుచేసుకుంది. స్వదేశంలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో, భారత జంట ప్రపంచ ర్యాంకింగ్‌లో 39వ స్థానంలో ఉండి, అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగింది. ఈ టోర్నమెంట్‌లో వారు రెండు పెద్ద సంచలనాలు సృష్టించారు. వరుస రౌండ్లలో జపాన్‌కు చెందిన ఏడవ సీడ్ రిన్ ఇవానగాకీ నకానిషిని, నాలుగవ సీడ్ జియా యి ఫాన్‌జాంగ్ షు జియాన్‌ను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. సెమీఫైనల్స్‌లో చైనాకు చెందిన ప్రపంచ నంబర్1 జోడీ లియు షెంగ్ షు మరియు టాన్ నింగ్‌లతో తలపడిన ట్రీసాగాయత్రి, 18-21, 21-13, 8-21 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు. కాంస్య పతకం సాధించడం ద్వారా వారికి మొత్తం 10,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించి, తాజా ర్యాంకింగ్స్‌లో వారు ప్రపంచ 27వ స్థానానికి చేరుకున్నారు. ఒకప్పుడు ప్రపంచ 9వ ర్యాంకు వరకు చేరుకున్న భారత జంట, గాయాల సమస్యలు మరియు నిలకడలేని ఫామ్ కారణంగా ఇటీవలి కాలంలో ర్యాంకింగ్‌లో గణనీయంగా వెనుకబడ్డారు. వారు ఈ ఏడాది మార్చిలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 30వ స్థానం కంటే దిగువకు పడిపోయి, జూన్‌లో 58వ స్థానానికి కూడా దిగజారారు. మళ్లీ ఇప్పుడు పైకి ఎదిగారు.

# ఈ యేడాది దీపమ్ ఓఎఫ్ఎస్ లక్ష్యం రూ.80వేల కోట్లు!




**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం కొనసాగింపు ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలోనూ ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం చురుగ్గా కొనసాగనున్నట్లు కేంద్రం సంకేతాలు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.80వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని సాధిస్తామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం ప్రకటించింది. ఇప్పటికే ప్రభుత్వం ఎల్ఐసీ ఆఫర్ ఫర్ సేల్, తాజా హిందుస్తాన్ కాపర్ వాటాల విక్రయం తదితర లావాదేవీల ద్వారా సుమారు రూ.52 వేల కోట్లను సమీకరించింది. లక్ష్యాలను చేరుకోవడంతో పాటు ఫలితాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలుస్తోంది. తదుపరి ఏ ప్రభుత్వ రంగ సంస్థ వాటాలను మార్కెట్‌లో విక్రయించనున్నారనే విషయాన్ని వెల్లడించేందుకు దీపమ్ కార్యదర్శి నిరాకరించారు. మరిన్ని మార్కెట్ ఆఫర్లు కొనసాగుతాయని సూచించారు. పెద్ద మొత్తంలో ఓఎఫ్ఎస్‌లావాదేవీలకు సంబంధించి ప్రభుత్వం సిద్ధం చేస్తున్న ప్రణాళికపై ప్రశ్నించగా, మార్కెట్ ఆఫర్లతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. దీంతో తాజా హిందుస్థాన్ కాపర్ ఒక్కటే కాకుండా, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ సంస్థల వాటాల విక్రయాలు ఉండే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకు దీపమ్‌లో ప్రత్యేక మార్కెట్ రీసెర్చ్ యూనిట్‌తో పాటు కురుక్షేత్ర పేరుతో అంతర్గత ఆపరేషన్స్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. వాటాల విక్రయాలను ప్రారంభించే ముందు మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.

## వాణిజ్యం




# నివాస గృహాల మార్కెట్‌లో మందగమనం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశంలో నివాస గృహాల మార్కెట్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వృద్ధి బాటలో కొనసాగింది. అయితే గత త్రైమాసికంతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన ఇళ్ల ధరల పెరుగుదల వేగం కొంత మందగించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఆర్‌బీఐ ఆల్ ఇండియా హౌస్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం, ఈఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ ధరల సూచీ వార్షికంగా 3.6 శాతం పెరిగింది. అంతకుముందు త్రైమాసికంలో నమోదైన 4.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు కూడా 3.6 శాతమే కావడం గమనార్హం. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆల్ ఇండియా ఇండెక్స్ 117.5కి చేరింది. గత త్రైమాసికంలోని 116.2తో పోలిస్తే ఇది 1.1 శాతం పెరుగుదల. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సూచీ 113.4గా ఉంది. వార్షిక ప్రాతిపదికన గృహ ధరల పెరుగుదలకు ప్రధానంగా చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో నమోదైన ధరల పెరుగుదల దోహదపడింది. త్రైమాసిక ప్రాతిపదికన సూచీ 1.1 శాతం పెరగడానికి ముఖ్యంగా చండీగఢ్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో అధిక ధరలు కారణమయ్యాయి. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుని దేశంలోని 18 ప్రధాన నగరాల్లో నివాస గృహాల ధరల మార్పులను ఈ సూచీ ప్రతిబింబిస్తుంది. ఈ సూచీలో ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, జైపూర్, కాన్పూర్, కొచ్చి, హైదరాబాద్, తిరువనంతపురం, పుణె, ఘజియాబాద్, థానే, గౌతమ్ బుద్ధ నగర్, చండీగఢ్, నాగ్‌పూర్ నగరాలు ఉన్నాయి.

# బ్రెంట్ క్రూడ్ ధరలు 3 శాతం పతనం



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** మధ్యప్రాచ్యంలో మరోసారి పూర్తిస్థాయి ఉద్రిక్తతలు చెలరేగుతాయన్న సంకేతాలతో మంగళవారం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు దాదాపు 3 శాతం పడిపోయాయి. బ్యారెల్‌కు సుమారు 87 డాలర్లకు చేరాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 2.92 శాతం క్షీణించి 87.90 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అమెరికా పలు మధ్యప్రాచ్య దేశాల్లోని రాయబార కార్యాలయాల నుంచి తరలించిన దౌత్య సిబ్బందిని తిరిగి విధుల్లోకి పంపించే అవకాశం ఉందన్న వార్తల క్రమంలో మార్కెట్లలో ధరలు తగ్గాయి. అమెరికా విదేశాంగ సిబ్బంది ఈ వారంలోనే తమ పోస్టులకు తిరిగి వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది. ఇరాన్‌తో మరోసారి పూర్తిస్థాయి సైనిక ఘర్షణలు చెలరేగే అవకాశాన్ని ట్రంప్ ప్రభుత్వం ప్రస్తుతం అంచనా వేయడం లేదనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని మార్కెట్లు భావిస్తున్నాయి. ఇజ్రాయెల్, లెబనాన్, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, ఒమన్, ఇరాక్, కువైట్‌లలోని అమెరికా దౌత్య కార్యాలయాల్లో సిబ్బందిని తిరిగి నియమించే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. వీటిలో బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో తొలుత సిబ్బంది తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంది.

# హెచ్చుతగ్గులున్నా చివరికి లాభాలే!

**ముంబయి, ఆగస్టు 25:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు లాభాలతో ముగిశాయి. ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు, చివరి గంటల్లో కొనుగోళ్లు పెరగడంతో కోలుకున్నాయి. భారీగా పడిపోయిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు ఊరటనిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 286.98 పాయింట్లు లాభపడి 77,656.09 వద్ద ముగిసింది. నిఫ్టీ50 115.50 పాయింట్లు పెరిగి 24,334.55 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 24,115.45 కనిష్ఠ స్థాయికి పడిపోయినా, తిరిగి పుంజుకుని 24,300 మార్క్‌ను తిరిగి అధిగమించింది. హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ రంగాల షేర్లు మంచి ర్యాలీ తీసాయి. ప్రైవేట్ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్ - 1.24 లాభం రిలయన్స్ ఇండస్ట్రీస్ - 0.55 పెరుగుదఐసీఐసీఐ బ్యాంక్ - 0.54 లాభం



నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీకి ముందు ట్రేడర్లు తమ పొజిషన్లను సర్దుబాటు చేసుకోవడంతో మార్కెట్లో అధిక అస్థిరత కనిపించింది. కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానంలో నిర్వహించిన తొలి నెలవారీ నిఫ్టీ ఎక్స్‌పైరీ కావడంతో, చివరి గంట ట్రేడింగ్ మరింత హెచ్చుతగ్గులకు లోనైంది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.37 పెరిగింది. బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.17 తగ్గింది. బీఎస్ఈలో మొత్తం 2,007 షేర్లు లాభపడగా, 2,330 షేర్లు నష్టపోయాయి. 196 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీలు, రూపాయిఅక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.73 డాలర్లు (2.96 ) తగ్గి 89.44 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ 95.4350 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.7000. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడులు 6.872 నుంచి 6.854 కు తగ్గింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.18 తగ్గి రూ.1,62,936 వద్ద ముగిశాయి. శంకేష్ జువెలర్స్ షేరు బీఎస్ఈలో రూ.95.03 వద్ద లిస్ట్ అయి, ఇష్యూ ధర రూ.93పై 2.18 ప్రీమియం నమోదు చేసింది. సన్‌షైన్ పిక్చర్స్ షేరు రూ.368.90 వద్ద లిస్ట్ అయి, రూ.360 ఇష్యూ ధరపై 2.47 ప్రీమియంతో ముగిసింది. నీలి ఫైనాన్స్, 4.74 ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ 6.39 నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా 2.92, లార్సెన్ అండ్ టూబ్రో 0.71, సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ 5 (అప్పర్ సర్క్యూట్)పురవంక 1.73 అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2.42 గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ 0.68చొప్పున పెరిగాయి. ఐపీఓలకు పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించింది. "అన్నూ ప్రాజెక్ట్స్ 0.34 రెట్లు, ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ 105.7 రెట్లు, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ 2.46 రెట్లు, సింబయోటెక్ ఫార్మాల్యాబ్ 1.85 రెట్లు, హైటెక్ ఇంజినీర్స్ 19.31 రెట్లుమొత్తంగా, అంతర్జాతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ముడి చమురు ధరలు తగ్గడం, దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు పెరగడం వల్ల దేశీయ మార్కెట్లు మంగళవారం సానుకూలంగా మార్కెట్లు ముగిసాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# "సర్" రోల్ అబ్జర్వర్‌కు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వాగతం



భీమవరం ఆగస్టు 25 ప్రభాతవార్త పశ్చిమగోదావరి జిల్లా సర్ రోల్ అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్ రోల్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పురోగతిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డికి వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, షెడ్యూల్‌కు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సర్ రోల్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న చర్యలు, నోటీసుల పంపిణీ, పెండింగ్ అంశాలు, సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలపై అబ్జర్వర్ కు వివరించారు. సర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఉచిత ఆధార్ క్యాంపు

తణుకు,ఆగస్టు 25( ప్రభాత వార్త) తణుకు హెడ్ పోస్ట్ ఆఫీస్ లో ఈనెల 27న ఉచిత ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు హెడ్ పోస్ట్ మాస్టర్ చిట్టా వెంకట సుబ్బారావు తెలిపారు. 5 నుండి 7 సంవత్సరాల పిల్లలకు, 15 నుండి 17 సంవత్సరాల పిల్లలకు ఉచితంగా ఆధార్ మొదటి అప్డేషన్ కార్యక్రమం చేస్తారని తెలిపారు. ఇతర అప్డేషన్ కోసం నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల ల్లో,కార్యాలయాలలో అధికంగా అప్డేషన్ అవసరమైన వారు ఉంటే వారి వద్దకే వెళ్లి అప్డేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజు పోస్ట్ ఆఫీస్ వద్ద ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## ఘనంగా ప్రారంభమైన పాఠశాల స్థాయి క్రీడల పోటీలు



ఏలూరు, ఆగస్టు, 25 : ప్రభాతవార్త పాఠశాల విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, శారీరక ధృఢత్వం, క్రమశిక్షణ లక్షణాలు పెంపొందించ డమే ఉద్దేశ్యం తో " పేరు తో స్థానిక ఏలూరు పట్టణం లోని చాటపర్రు రోడ్డు లో గల భాష్యం స్కూల్ పేరుతో పాఠశాల స్థాయి క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెదవేగి, దెందులూరు ఎస్ఐ లు సిహెచ్. రాజశేఖర్, వెంకట్ కుమార్ మరియు భాష్యం వెస్ట్ జోన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివన్నారాయణ రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతో పాటు క్రీడలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు పట్టుదలను, జట్టుగా పని చేయడం నేర్పిస్తాయన్నారు. వెంకట కుమార్ మాట్లాడుతూ విజయాన్ని పరాజయాన్ని సమానంగా భావించే మనస్తత్వాన్ని నేర్చుకోవాలని, విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. భాష్యం వెస్ట్ గోదావరి జోనల్ అధికారి శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ వంటి విభాగాలు ఉంటాయని, పాఠశాల స్థాయిలో గెలిచిన విద్యార్థులు జోనల్ స్థాయిలో, జోనల్ స్థాయిలో విజేతలు గా నిల్చిన వారు రాష్ట్రస్థాయి లో పాల్గొంటారని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన కవాతు అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ , హెచ్.ఎం. 8. సంధ్యారాణి , ఉపాధ్యాయులు, క్రీడల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, ప్రభుత్వులు పాల్గొన్నారు.

## కూటమి మాట ఇచ్చింది నిలబెట్టుకుంది : దేశం రామరాజు



నరసాపురం ఆగస్టు 26 ప్రభాత వార్త నరసాపురంలో ఘనంగా "రెండేళ్ల సంక్షేమం -- అభివృద్ధి, ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నరసాపురం పట్టణంలోని పలు వార్డుల్లో "రెండేళ్ల సంక్షేమం -- అభివృద్ధి, ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల గడపకు చేరాలి.. ప్రజల సమస్యలు పార్టీ నాయకత్వం దృష్టికి చేరాలి" అనే లక్ష్యంతో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామరాజు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, నరసాపురం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి అనారోగ్య బాధితునికి గొప్ప ప్రాణదాత

### 80 మందికి 56 లక్షలు పైగానే సాయం - నాయకర్ కు కృతజ్ఞతలు చెప్పిన బాధితులు





నరసాపురం ఆగస్టు 25 ప్రభాతవార్త డబ్బులు లేవని వైద్యం ఆగిపోకూడదు.. పేదరికం కారణంగా ఏ ప్రాణం ఇబ్బంది పడకూడదు.. ఆసుపత్రి బిల్లు చెల్లించలేక ఏ కుటుంబం అప్పుల పాలుకాకూడదు.." ఈ ఆలోచనతో ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తోంది కూటమి ప్రభుత్వం. నరసాపురం స్థానిక ఎమ్మెల్యే గ క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ, ఆసుపత్రి బిల్లులు చెల్లించడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 80 మంది పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.56,70,616/- విలువైన చెక్కులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పంపిణీ చేశారు.లబ్ధి ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, ఆసుపత్రి మంచంపై ఉన్న తమ కుటుంబ సభ్యుడిని చూసుకుంటూ.. "వైద్యం చేయించాలి.. కానీ డబ్బులు ఎక్కడి నుంచి తీసుకురావాలి?" అని ఆందోళన చెందుతున్న ప్రతి కుటుంబానికి ఒక గొప్ప భరోసాగా నిలుస్తోంది. పేదవాడి బాధను అర్థం చేసుకునే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని కూటమి ప్రభుత్వం కులం చూడదు.. మతం చూడదు.. పార్టీ చూడదు.. ప్రాంతం చూడదు.. కష్టాల్లో ఉన్న వ్యక్తిని ఒక మనిషిగా చూసి, ఆపదలో అండగా నిలబడటమే కూటమి ప్రభుత్వ విధానం. పేద ప్రజలకు వైద్యం అందించడంలో ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ వీలైనంత సహాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. రెండేళ్లలో రూ.7.30 కోట్లకు పైగా వైద్య సహాయం నరసాపురం నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల కాలంలో: 926 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.5,17,44,742/- 64 మంది లబ్ధిదారులకు అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఎల్ ఓ సి ద్వారా రూ.2,13,06,132/- మొత్తంగా రూ.7,30,50,874/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అంతేకాకుండా గతంలో వినాయక చవితి వేడుకల సందర్భంగా జరిగిన విషాద ఘటనలో మృతి చెందిన, గాయపడిన 5 మంది బాధిత కుటుంబాలకు రూ.15 లక్షల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఒక చెక్కు.. ఒక కుటుంబానికి ఎంతో పెద్ద భరోసా మనకు ఒక చెక్కు ఒక కాగితం ముక్కలా కనిపించవచ్చు.. కానీ ఆ చెక్కు అందుకున్న పేద కుటుంబానికి అది ఆశ.. ధైర్యం.. కన్నీటిలో ఓదార్పు.. కష్టకాలంలో ఒక చేయూత. "మా కష్టం ప్రభుత్వం గుర్తించింది.. మా బాధను ఎవరో అర్థం చేసుకున్నారు.. మేము ఒంటరివాళ్లం కాదు" అనే నమ్మకాన్ని ఈ సహాయం కల్పిస్తుంది. పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సహాయం ఒక గొప్ప వరం అని ఎమ్మెల్యే నాయకర్ గారు పేర్కొన్నారు. ప్రజల కష్టం తన కష్టంగా భావించి.. ప్రజల కన్నీటిని తన కన్నీటిగా భావించి.. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు నిరంతరం పనిచేసే ప్రజా ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం. పేదవాడి కష్టంలో తోడుగా.. ఆపదలో అండగా.. అనారోగ్యంలో భరోసాగా.. ప్రతి కుటుంబానికి రక్షణగా.. ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడే ప్రభుత్వం --- కూటమి ప్రభుత్వం. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం.. ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం.. ప్రతి కుటుంబానికి భరోసానే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

## రీ సర్వే ప్రక్రియ పరదర్శకంగా చేయండి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం ఆగస్టు 25 ప్రభాతవార్త జిల్లాలో చివరి దశలో 30 గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను మరింత పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మండల సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల సర్వేయర్లతో జిల్లా కలెక్టర్ రీ సర్వే ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చివరి దశలో ఉన్న 30 గ్రామాల్లో రీ సర్వేను నిర్ణీత నిబంధనల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి, భూ వివరాల్లో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతుకు 9(2) నోటీసులు అందజేసి, తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులకు ఎటువంటి సందేహాలు, ఇబ్బందులు తలెత్తకుండా వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం నుంచి రీ సర్వే ప్రక్రియ కోసం పశ్చిమగోదావరి జిల్లాకు అందించిన అధునాతన ల్యాప్‌టాప్‌లను జిల్లాలోని 20 మండలాలకు చెందిన మండల సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించిన పూర్తి డేటాను ల్యాప్‌టాప్‌లలో ఎప్పటికప్పుడు నమోదు చేసి, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండేలా భద్రపరచాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం కలిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, జిల్లా సర్వే అధికారి కె .జాషువా, మండల సర్వేలు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ' పై సమీక్ష



భీమవరం, ఆగస్టు 25 ప్రభాతవార్త కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో 'సర్ 'ప్రక్రియ పై మంగళవారం ఆఆర్ఓ లు, పొలిటికల్ పార్టీలతో సర్ రోల్ అబ్జర్వర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సాధించిన ప్రగతిని నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఓటర్ల వివరాల ధృవీకరణ, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, క్లెయిమ్స్ అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియపై ఇ ఆర్ఓ ల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటర్ల జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించాలని సూచించారు. సర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, అందిన క్లెయిమ్స్ అభ్యంతరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును సంబంధిత రికార్డులతో పరిశీలించి, అర్హత ఉన్న ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియ పూర్తి చేయడానికి మరోసారి గడువు ఉందని అక్టోబర్ 2 వ తేదీలోగా మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఓటర్ల హియరింగ్ సమయంలో ఏ ఏ డాక్యుమెంట్లు ఓటర్లు సమర్పించాలో బీఎల్ఓ లకు మరోసారి అవగాహన కల్పించ వాలన్నారు. ఇఆర్వోలు, ఏఈఆర్వోలు హియరింగ్ సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో సర్ ప్రక్రియ ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు,ఆచంట, పాలకొల్లు, ఉండి, నియోజకవర్గాల ఇ ఆర్ ఓ లు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఎం సూర్యారావు, జెడ్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కె .సి హెచ్ అప్పారావు, పి.ప్రభాకర్, కె.అనూరాధ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మరపట్ల శ్యాం బాబు (టిడిపి), తోటగంగరాజు, (బిజెపి) ఎన్.మురళీకృష్ణ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) కామన నాగేశ్వరరావు, (వై ఎస్ ఆర్ సి పి) ఇ వి శేఖర్ బాబు (బి ఎస్ పి) ఎం అంజనేయులు (సి పి ఐ) పార్టీల తరఫున పాల్గొన్నారు.

## రాయకుదురులో తెరవని రైతు సేవా కేంద్రం

### రైతులకు తప్పని ఇబ్బందులు..

### అధికారులు స్పందించాలని విజ్ఞప్తి





వీరవాసరం, ఆగస్టు 25 (ప్రభాతవార్త): పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం రాయకుదురు గ్రామంలోని రైతు సేవా కేంద్రం మంగళవారం తెరవకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన పలు సేవలు, సమాచారం అందించాల్సిన కేంద్రం మూసి ఉండటంతో పనుల కోసం వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.రైతు సేవా కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో సేవలు అందేలా రైతు సేవా కేంద్రాన్ని క్రమం తప్పకుండా తెరిచి ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సిబ్బంది హాజరు, కేంద్రం నిర్వహణపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆక్వా ఫీడ్ బలోపేతం చేసేందుకు గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రణాళికలు

భీమవరం, ఆగస్టు 25 ప్రభాతవార్త భారత్‌లోనే అగ్రగామి ఆక్వా ఫీడ్ సంస్థల్లో ఒకటిగా నిలిచేందుకు గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రేజ్ ఆగ్రోవెట్) భవిష్యత్తు ఆధారిత అభివృద్ధి వ్యూహాన్ని సిద్ధం చేసుకుందని, ఇందులో భాగంగా ఆక్వా ఫీడ్ వ్యాపారాన్ని దీర్ఘకాలికంగా మరింత విస్తరించి, బలోపేతం చేయనున్నట్లు కంపెనీ అభివృద్ధి లక్ష్యాలపై మాట్లాడుతూ గోద్రేజ్ ఆగ్రోవెట్ డైరెక్టర్ సునీల్ తెలిపారు. ఈ వ్యూహంలో భాగంగా, గోద్రేజ్ ఆగ్రోవెట్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అ డీ), సాంకేతిక ఆవిష్కరణలలో పెట్టుబడులను పెంచి, ఆక్వాకల్చర్ రైతులకు అత్యుత్తమ నాణ్యత గల దాణా అందించనుంది. మేత వినియోగ సామర్థ్యంలో నిరంతరం మెరుగుదల సాధించడంపై కంపెనీ చూపుతున్న దృష్టి వల్ల రైతులకు ఉత్పత్తి వ్యయం తగ్గి, దిగుబడులు మరియు లాభాలు పెరుగుతాయి. ఈ ప్రయత్నాలు కంపెనీ డిస్ట్రిబ్యూటర్ వ్యవస్థను కూడా మరింత బలపరుస్తాయన్నారు. దీనివల్ల భాగస్వాములు రైతులకు మరింత వేగవంతమైన పరిష్కారాలను అందిస్తూ, గోద్రేజ్ ఆగ్రోవెట్‌తో కలిసి లాభదాయకమైన, సుస్థిరమైన వ్యాపారాలను నిర్మించుకోవడానికి మార్గం సుగమమవుతుందని చెప్పారు. "గోద్రేజ్ ఆగ్రోవెట్‌కు చేపల మేత వ్యాపారమే అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యత అని, మొత్తం యానిమల్ న్యూట్రిషన్ వ్యాపారంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నా అన్నారు. ఈ వ్యాపారాన్ని రెండంకెల వృద్ధితో పెంచాలని అనుకుంటున్నాం. ఈ లక్ష్యానికి అనుగుణంగానే పెట్టుబడులు పెడుతున్నాం. దీనికి తోడు కొత్త సాంకేతికతను జోడిస్తూ, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్‌డీ) ప్రయత్నాలు చేస్తున్నాం అన్నారు. మొత్తానికి ఆక్వా ఫీడ్ వ్యాపారంలో ఉన్న అపారమైన అవకాశాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ రంగంలో మాకు ఉన్న అభివృద్ధి అవకాశాలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. మా లక్ష్యాలు చాలా పెద్దవి, వాటిని సాధించి తీరడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. అభివృద్ధి వ్యూహంలో భాగంగా, గోద్రేజ్ ఆగ్రోవెట్ తన డిస్ట్రిబ్యూటర్ నెట్‌వర్క్‌తో సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందన్నారు.

## సమన్వయ ధోరణితో రాజీకి కృషి చేయాలి

### న్యాయవాదులకు సూచించిన జిల్లా న్యాయమూర్తి





నరసాపురం ఆగస్టు 26 ప్రభాత వార్త సెప్టెంబర్ 12న జరుగనున్న 3వ జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు త్వరితగతిన సమన్యాయం అందించే దిశగా న్యాయవాదులు సహకరించాలని నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎ. వాసంతి న్యాయవాదుల సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో అన్నారు. క్రిమినల్ కేసులతో బాటు ప్రామిస్సరీ నోట్, భూ సంబంధిత కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్ లు, చెక్ బౌన్స్ , కుటుంబ తగాదాలు, ఎక్కువ కాలం నుండి పెండింగ్ లో ఉన్న కేసుల్లో ఇరుపార్టీలను సమన్వయపరిచి లోక్ అదాలత్ ముఖ్యోద్దేశాన్ని వివరించి సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రయత్నించాలని లోక్ అదాలత్ లో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతిరోజూ కోర్టు లో జరుగుతున్న మధ్యవర్తిత్వం ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో కంటే మరింత ఎక్కువ సివిల్ కేసులు రాజీ చేసేలా అందరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. రాజ్య లక్ష్మీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నిడమోలు జ్ఞానానంద్, ఉపాధ్యక్షులు బి. జాన్ కెనడీ , కార్యదర్శి కె. సోమ శేఖర్, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, ప్యానెల్ లాయర్స్, ట్రెయిన్డ్ మీడియేటర్స్ పాల్గొన్నారు.

# తరతరాలకు అంబేద్కర్ మార్గమే స్ఫూర్తిదాయకం

## ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



నరసాపురం ఆగస్టు 26 ప్రభాత వార్త భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ మార్గదర్శకులు, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ నూతన కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠాపనకు నరసాపురం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఈరోజు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొని నూతన కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠాపన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ గారి ఆశయ సాధనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని అన్నారు. అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా డా. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో నూతన కాంస్య విగ్రహ ఏర్పాటుతో పాటు పరిసరాల సుందరీకరణ, అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే రూ.31 లక్షల 50 వేల నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఈ అభివృద్ధి పనులకు ఎలాంటి నిధుల కొరత ఏర్పడినా, అవసరమైన మేరకు తన సొంత నిధులను సైతం వెచ్చించి పనులను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ గారు స్పష్టం చేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ గొప్ప ఆశయాలను భావితరాలకు అందించడంతో పాటు, ఆయన స్ఫూర్తికి ప్రతీకగా నరసాపురం అంబేద్కర్ సెంటర్‌ను మరింత సుందరంగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్ఛార్జ్ పొత్తూరి రామరాజు , ఏఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, జనసేన నాయకులు వర్దనపు ప్రసాద్ ,అర్బన్ బ్యాంక్ చైర్మన్ వలవల నాని, బందెల రవీంద్ర, వట్టిప్రోలు సతీష్, కొల్లా బత్తుల వెంకటేశ్వరరావు,గోడదల శ్రీధర్ , ఇంజేటి దానం, దొండపాటి స్వాములు,నల్లి రాజేష్, కుసుమ కిరణ్ ,కాకిలేటి ఆనంద్, నల్లి ప్రసాద్, బొమ్మిడి కృష్ణమూర్తి,గన్నాబత్తుల సత్యవతి, బందెల భారతి, పోలిశెట్టి నళిని, అంబటి అరుణ, ఈదా జోస్ఫీ, కోట అరుణ ,కొప్పాడ కృష్ణవేణి, సముద్రాల సత్యవతి,పాకాలా రోజా,చాముండేశ్వరి మరియు ప్రజలు, జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళ తదితరులు పాల్గొన్నారు



## ఉన్నత ప్రమాణాలతో జూనియర్ కళాశాల భవన నిర్మాణం


### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (ప్రభాత వార్త) తాడేపల్లిగూడెం పట్టణంలోని గణేష్‌నగర్‌లో పీ4 విధానంలో ప్రజల భాగస్వామ్యంతో ఆధునిక వసతులతో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. రూ.2.55 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఆధునిక వసతులతో కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కళాశాల భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి ప్రజలు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పీ4 కార్యక్రమాలు నియోజకవర్గానికి మరింత ప్రయోజనం చేకూరుస్తాయని, ఈ విధానంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.విద్యా రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా కళాశాల భవనాన్ని అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తెలిపారు.

# ఎన్నో ఏళ్లుగా అన్నీ మంచంలోనే..

- అయినా కరుణించని ప్రభుత్వాలు
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పట్టించుకోని ప్రభుత్వాలు
- ఫెన్షన్ 15వేలకు మార్పు చేయాలని వేడుకోలు



**ప్రభాతవార్త చాట్రాయి** ఏళ్ల తరబడి మంచంలో ఉంటూ అనేక అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలు మాత్రం కరుణించడం లేదు. పుట్టిన నాటి నుండి అంగవైకల్యంతో పరిమితమై 20 ఏళ్లుగా ఉంటున్నారని తల్లిదండ్రులు ఆవేదనతో పెన్షన్ మార్పు చేయాలని వేడుకుంటున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువైన వైనమిది. చాట్రాయి మండలంలో పలు గ్రామాలలో ఈ విధంగా మంచంలో ఇబ్బందులు పడుతున్న వికలాంగులు ఎందరో ఉన్నారు. గతంలో వికలాంగుల పెన్షన్ 40 శాతం నుండి 100 శాతం వరకు ఉన్నా మూడు వేల రూపాయలు వచ్చేది. గత వైసిపి ప్రభుత్వం లో పక్షవాతంతో కానీ, ఏ ఇతర కారణాల వల్ల గాని మంచంలో మగ్గుతున్నట్లు అధికారులు ధ్రువీకరిస్తే వారికి 15 వేల రూపాయలు నెలకు పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రకటించడంతో పాటు అమల్లోకి తీసుకువచ్చింది. అయితే గతంలో ధ్రువీకరణ పొందిన వారికి ఈ అవకాశం ఇవ్వకపోవడంతో ఎన్నో ఏళ్ల నుండి మంచంలో ఉన్న వారికి ఈ పెన్షన్ మార్పు జరగలేదు. దీనిపై ఎన్నోమార్లు ఉన్నతాధికారులకు వికలాంగుల కుటుంబీకులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో అదే పెన్షన్ కొనసాగుతోంది. అయితే ఇటీవల తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని 6000గా మార్పు చేశారు. కానీ ఈ ప్రభుత్వం కూడా మంచంలో మగ్గుతున్న వారి వివరాలను నేటికీ సేకరించకుండా 6000 తోనే సరిపెడుతోంది. ఇప్పటికీ పది సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న వికలాంగులు అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. ఈ మంచంలో ఉన్న వికలాంగుల కోసం నిరుపేద కుటుంబానికి చెందిన వారు పనులకు వెళ్లలేక ఇంటి పోషణ సరిపోక నానా అవస్థలు పడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 మాసాలు పూర్తికాగా ఇప్పటికీ ఈ విషయంపై స్పందించకపోవడంతో వికలాంగుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మంచానికే పరిమితమైన వారి వివరాలను సేకరించి వారికి కూడా 15 వేల రూపాయలు నెలకు పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు ప్రజల భాగస్వామ్యం అవసరం



**చాట్రాయి, ఆగస్టు 25 ప్రభాతవార్త** ప్రజల భాగస్వామ్యం ఉంటేనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని మండల విద్యాశాఖ అధికారి 1 ఎం శ్రీనివాస్ అన్నారు. చాట్రాయి మండలం చీపురుగూడెం పంచాయతీ లో గల మంగపేట ప్రాథమిక పాఠశాల నందు పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు అందరు పాఠశాలకు సుమారు 15000 రూపాయలు ఖర్చు పెట్టి స్మార్ట్ టీవీని అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు మాసగిరి శ్రీనివాస్, బ్రహ్మాచారి టీవీ ని ఆన్ చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్ ను అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరం అని మనకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బడులను మనం కాపాడుకోవాలని, తల్లిదండ్రులు చేసిన వితరణ శ్రీకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంఈఓ 2 వి.బ్రహ్మాచారి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారని అన్నారు. ప్రధానోపాధ్యాయులు గణేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటుచేసి ఉత్తమ విద్య అందిస్తుందని పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు సహకరించడం అభినందనీయమని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో తనతో చేతులు కలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, రాంబాబు, స్వర్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయాన్ని కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి : కోనాల



**భీమవరం టౌన్,ఆగస్టు 25 : ప్రభాతవార్త** సామాజికంగా వెనుకబడిన మరియు అట్టడుగు వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని, వాటి ప్రాధాన్యతను తగ్గించాలని జరుగుతున్న ప్రయత్నాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోం దని ఆ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా కార్య దర్శి కోనాల భీమారావు అన్నారు. రిజర్వేష న్లు ఎవరి దయాదాక్షిణ్యాలతో ఇచ్చినవి కావని, శతాబ్దాలుగా సామాజిక వివక్ష, అసమానత లకు గురైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులని ఆయన పేర్కొన్నారు. సామాజిక, విద్యా, ఆర్థిక అసమానతలు కొనసాగుతున్న పరిస్థితుల్లో రిజర్వేషన్లను రద్దు చేయాలనే డిమాండ్లు సామాజిక న్యాయానికి విరుద్ధమని విమర్శించారు. దేశంలో కుల, సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోని పరిస్థి తుల్లో రిజర్వేషన్ల అవసరం మరింత ఉంద న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతిని ధ్యంలో రాజ్యాంగబద్ధంగా కల్పించిన అవకాశా లను కాపాడటంతో పాటు, రిజర్వేషన్ పోస్టుల న్నింటినీ పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వేషన్ల పరిధిని క్రమంగా కుదించడం కూడా సామాజిక న్యాయంపై దాడేనని భీమారావు అన్నారు. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి, రిజర్వేష న్లను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రిజర్వేషన్ల రక్షణ కోసం జరిగే పోరాటం ఒక వర్గం కోసం మాత్రమే కాదు. సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాం గ పరిరక్షణ కోసం జరిగే పోరాటం. రిజర్వేష న్లను రద్దు చేసే ఏ ప్రయత్నాన్నైనా ప్రజాస్వా మ్య పద్ధతుల్లో ప్రతిఘటిస్తాం. అట్టడుగు వర్గాలు, కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యం గా ఉద్యమిం చాలి అనిభీమారావు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు విస్తృత ప్రజా ఉద్య మాన్ని నిర్మించాలని ఆయన కోరారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



**అత్తిలి, ఆగస్టు 25( ప్రభాత వార్త )** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓ పి ఎస్ ను అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని పి ఆర్ టి యు స్టేట్ కౌన్సిలర్ టెక్కలి గణపతి కోరారు. అత్తిలి మండలం మంచిలి ఉన్నత పాఠశాలలో సిపిఎస్ఈ ఏ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయుల పదవి విరమణ అనంతరం వారికి ఓపిఎస్ భరోసాను ఇవ్వాలని కోరారు. పి ఆర్ టి యు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముగిసిన అంగన్వాడి శిక్షణ కార్యక్రమం



**అత్తిలి, ఆగస్టు 25( ప్రభాత వార్త )** అత్తిలి మండలం మంచిలి ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి కార్యక్రమం కింద ఆరు రోజులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో నూతన విద్యా విధానం, అంగనవాడి కేంద్రాలలో ఆంగ్ల బోధన, నవజాతన శిశువులు, ఆదర్శీల, అంగన్వాడీ కేంద్రాల ప్రణాళిక, రెండో భాషగా ఇంగ్లీష్, సమ్మి ళి త విద్య, వైకల్యాలు, సమాజంలోమద్దతు, ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రత, లింగ సమానత్వ భావన తదితర అంశాలపై అంగన్వాడిలకు శిక్షణ ఇచ్చారు. ఐసిడిఎస్ పర్యవేక్షకులు శ్రీదేవి ఎం విజయ కుమారి ఉపాధ్యాయులు టి గణపతి, వెంకటేశ్వరరావు, జె ఎస్ ఎన్ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ గంగాధరరావు



**పెనుగొండ, ఆగస్టు 25,ప్రభాత వార్త** : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెనుగొండ సబ్ఇన్స్పెక్టర్ జి. గంగాధరరావు సూచించారు. మంగళవారం పెనుగొండ బస్టాండ్లో కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్లైన్ లావాదేవీలు, అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, పాస్వర్డ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. అలాగే మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మహిళలు తమకు ఎదురయ్యే వేధింపులు, బెదిరింపులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు, తమకు తెలిసిన వారికి కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్ఐ కోరారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

## జొన్నలగరువు పంచాయతీలో సిబ్బంది లేక ప్రజలకు ఇబ్బందులు



**భీమవరం రూరల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త)**: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం జొన్నలగరువు గ్రామపంచాయతీలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మంగళవారం ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## డ్రైనేజీ పూడుకుపోవడంతో
# రోడ్డుపై వర్షపు నీరు

### ఇబ్బందులు పడుతున్న స్థానికులు.. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి



**భీమవరం రూరల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త)**: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవానితిప్ప పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో డ్రైనేజీ పూర్తిగా పూడుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం స్థానికులు మాట్లాడుతూ వర్షం కురిసిన ప్రతిసారీ డ్రైనేజీలో నీరు వెళ్లే మార్గం లేక వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిల్వ నీటి కారణంగా దోమలు పెరిగి పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, దీంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే డ్రైనేజీని శుభ్రం చేసి, వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు..

## శ్రీరామంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



**వీరవాసరం, ఆగస్టు 25 (ప్రభాతవార్త)**: పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం నందమూరిగరువు గ్రామంలో వెలసి ఉన్న శ్రీరామంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## కొబ్బరి చెట్ల వేలంపాటతో పంచాయతీకి అదనపు ఆదాయం

### గతం కంటే రూ.1.66 లక్షలు అధికంగా ఆదాయం



**మొగల్తూరు, ఆగస్టు 25 (ప్రభాతవార్త)**: శేరేపాలెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన కొబ్బరి చెట్ల వేలంపాట ద్వారా గ్రామపంచాయతీకి గతం కంటే రూ.1.66 లక్షల అదనపు ఆదాయం లభించిందని శేరేపాలెం స్వర్ణ గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి బొడ్డు కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొబ్బరి చెట్ల వేలంపాటపై గ్రామంలో ముందుగా టామ్‌టామ్ వేయించినట్లు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో మేడిది నవీన్ కిరణ్, డీఎల్‌డీవో సూర్యనారాయణ సమక్షంలో వేలంపాట నిర్వహించినట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో ఉన్న కొబ్బరి చెట్లకు నిర్వహించిన వేలంపాట ద్వారా మొత్తం రూ.4.69 లక్షల ఆదాయం లభించిందని తెలిపారు. గతంలో రూ.3.03 లక్షలకు వేలంపాట జరిగినట్లు పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం జరిగిన వేలంపాటతో పోలిస్తే ప్రస్తుత వేలంపాట ద్వారా పంచాయతీకి రూ.1.66 లక్షల అదనపు ఆదాయం సమకూరిందని కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పి4 న్యూస్‌లెటర్ ఆవిష్కరణ



**జీలుగుమిల్లి, ఆగస్టు 25 (ప్రభాతవార్త)** పోలవరం నియోజకవర్గంలో జూన్, జూలై నెలల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో పి4 టీమ్ రూపొందించిన న్యూస్ లెటర్‌ను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. న్యూస్‌లెటర్‌లో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వివరాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో న్యూస్‌లెటర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పి4 యంగ్ ప్రొఫెషనల్ జగదీశ్వరరావు, టీమ్ సభ్యుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

## కోపెల్ల వంతెనకు డా యల్లా ప్రగడ సుబ్బారావు పేరు నామకరణం చేయడం పట్ల హర్షం



**భీమవరం ఆగష్టు 25 ప్రభాతవార్త** డా యల్లా ప్రగడ సుబ్బారావు పేరును నూతనంగా నిర్మిస్తున్న కోపల్లె వంతెనకు నామకరణం చేయడం గొప్ప విశేషమని డా యల్లా ప్రగడ సుబ్బారావు జయంతోత్సవ కమిటి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఆనంద ఫంక్షన్ హాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఈ విషయాన్ని మాకు తెలియజేసినందుకు హర్షం ప్రకటిస్తున్నామని అన్నారు. కోపెల్ల వంతెనకు డా యల్లా ప్రగడ సుబ్బారావు నామకరణం చేయడం మన జిల్లాకే గర్వకారణమన్నారు. మెంటే పార్థసారధి, నందమూరి రాజేష్, గన్నాబత్తుల శ్రీనివాస్, ప్రయాగ చిరంజీవి పాల్గొని హర్షం ప్రకటించారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో మహనీయుల విగ్రహాలకు కొత్త శోభ

- సొంత నిధులతో ఫ్లెక్సీలు, ముళ్ల పొదలు తొలగించిన మార్కెట్‌యార్డు చైర్మన్ త్రినాధరాజు
- విగ్రహాల ఎదుట ఇక ఫ్లెక్సీలు కడితే చర్యలు తప్పవని హెచ్చరిక



**కైకలూరు: ఆగస్టు 25 (ప్రభాతవార్త)** కైకలూరు తాలూకా సెంటర్‌లోని మహనీయుల విగ్రహాల పరిసరాల్లో పేరుకుపోయిన ఫ్లెక్సీలు, చెత్త, ముళ్ల పొదలను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కైకలూరు మార్కెట్‌యార్డు చైర్మన్ పెనుమత్స త్రినాథరాజు తన సొంత నిధులతో తొలగించారు. మహనీయుల విగ్రహాల వద్ద అపరిశుభ్రత, ఫ్లెక్సీలతో ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితిపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్పందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. దీంతో మార్కెట్‌యార్డు చైర్మన్ త్రినాథరాజు ముందుకు వచ్చి తన సొంత నిధులతో ఫ్లెక్సీలు, ముళ్ల పొదలు, చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో విగ్రహాలు స్పష్టంగా కనిపిస్తూ తాలూకా సెంటర్ పరిసరాలు శుభ్రంగా మారాయి. ఈ సందర్భంగా చైర్మన్ పెనుమత్స త్రినాథరాజు మాట్లాడుతూ "స్వచ్ఛతే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు మహనీయుల విగ్రహాల ఎదుట ఉన్న ఫ్లెక్సీలు, ముళ్ల పొదలు, చెత్తను తొలగించాం" అని తెలిపారు. మహనీయుల విగ్రహాలను గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇకపై విగ్రహాల ఎదుట ఎవరూ ఫ్లెక్సీలు కట్టరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. విగ్రహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని త్రినాథరాజు కోరారు. ఈ చర్యపై ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## జీలుగుమిల్లి పీహెచ్‌సీలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్




**జీలుగుమిల్లి, ఆగస్టు 25 (ప్రభాతవార్త)** మండల కేంద్రం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్ సౌజన్యంతో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ, రొమ్ము క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 145 మంది మహిళలు పరీక్షలు చేయించుకోగా, అవసరమైన వారికి ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. తదుపరి వైద్య పరీక్షలు, సలహాల కోసం 12 మందిని ఆశ్రమ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఈ శిబిరానికి సహకరించిన ఆశ్రం హాస్పిటల్ సిబ్బందికి, వైద్య సిబ్బందికి, పాల్గొన్న మహిళలకు జీలుగుమిల్లి వైద్యాధికారి డా. మణికంఠేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ శ్రీనివాసరాజు, హెల్త్ సూపర్వైజర్ కూరం ప్రసాద్, ఫార్మసిస్టు నాగేశ్వరరావు, మంగ, ఆశ్రం ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## డీఆర్ఓగా ఉద్యోగ బాధ్యత చేపట్టిన పి. గ్లోరియ



**భీమవరం ఆగష్టు 25 ప్రభాతవార్త** పశ్చిమగోదావరి జిల్లా జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ)గా పి. గ్లోరియా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌చార్జి డీఆర్‌ఓగా విధులు నిర్వహించిన పి. ప్రభాకర్ నుంచి ఆమె డీఆర్ఓ బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని పి. గ్లోరియా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కు పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన అంశాలపై సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## స్థానిక ఎన్నికలపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు: సీఐ పి. కృష్ణ

### నకిలీ ఉత్తర్వులు, అధికారిక లోగోలతో తప్పుడు సమాచారం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



**ద్వారకాతిరుమల, ఆగస్టు 25 (ప్రభాతవార్త)**: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని భీమడోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. కృష్ణ సూచించారు. భీమడోలు సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల రెండవ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైందంటూ కొన్ని నకిలీ ఉత్తర్వులు, అధికారిక లోగోలతో కూడిన తప్పుడు సమాచారం విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతోందని తెలిపారు. ఎన్నికల తేదీలు, షెడ్యూల్, నోటిఫికేషన్‌కు సంబంధించిన అధికారిక సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక పత్రికా ప్రకటన లేదా పత్రికా సమావేశం ద్వారా మాత్రమే వెల్లడిస్తుందని స్పష్టం చేశారు. అనధికారిక మూలాల నుంచి వచ్చే ఎటువంటి సమాచారాన్నీ అధికారికంగా భావించరాదని, ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సృష్టించడం, ప్రచారం చేయడం, ఇతరులకు షేర్ చేయడం చట్టరీత్యా నేరమని సీఐ పి. కృష్ణ హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడే వారిపై సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పుడు వార్తలు, అనుమానాస్పద సమాచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి సమాచారం ఏదైనా తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## 30న నీట్ పీజీ పరీక్షలు

**ఏలూరు, ఆగష్టు, 25 : ప్రభాతవార్త** ఈనెల 30 వతేదీన జరగనున్న నీట్ (పిజి) పరీక్షల నిర్వహణపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జిల్లాల కలెక్టర్లతో మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు జిల్లా నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఏలూరు జిల్లాలో నీట్ (పిజి) పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి కి తెలియజేసారు.

## జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల బ్రోచర్‌ను
# ఆవిష్కరించిన కమిషనర్ రామచంద్ర రెడ్డి



**భీమవరం ఆగష్టు 25 ప్రభాతవార్త** ఈనెల 27, 28,29 తేదీల్లో భీమవరంలో క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అన్నారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ కార్యక్రమంలో మూడురోజులపాటు జరిగే జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల బ్రోచర్ ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. బాలలకు క్రీడలపై ఆసక్తి కనబర్చేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 27న క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, 28న సెయింట్ మేరీస్ విద్యార్థులతో 400 అడుగుల జాతీయ జెండాతో క్రీడా ర్యాలీ, 29న క్రీడా దినోత్సవ వేడుకలు, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామని తెలిపారు. భీమవరం వాకర్స్ అసోసియేషన్, భీమవరం యూత్ హాస్టల్స్ అసోసియేషన్, జిల్లా హాకీ అసోసియేషన్ సహకారంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, హాకీ కోచ్ అప్పారావు, తాళ్లపూడి గాంధీ, వడుపు గోపి, టివివి ప్రసాద్, పులపర్తి బాబ్జీ, కే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 200 బత్తాయి పండ్లతో
## బాల త్రిపుర సుందరి అమ్మవారికి అలంకరణ



**భీమవరం ఆగష్టు 25 ప్రభాతవార్త** భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి 200 బత్తాయి కాయలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణానికి చెందిన మద్దాల సత్యనారాయణ, లక్ష్మి బ్రహ్మాజీ దంపతులచే వివిధ రకాల పళ్ళ రసాలతో పంచామృతాలతో అభిషేకాలు, లలిత సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. భక్తుల సహకారంతో 200 బత్తాయి పండ్లతో పూజ చేసి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కార్యక్రమం



**అగిరిపల్లి, ఆగష్టు 25 ప్రభాతవార్త** "మేరా రేషమ్ మేరా అభిమాన్ 2.0" ప్రచార కార్యక్రమంలో భాగంగా, "ఆరోగ్యకరమైన మల్బరీ నుండి నాణ్యమైన పట్టువరకు: ప్రత్యేక సాంకేతిక ప్రచార కార్యక్రమం" అనే అంశంపై అగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామ రైతుల కోసం రైతుల సాంకేతిక ప్రదర్శన నిర్వహించినట్లుకేంద్ర పట్టుపరిశ్రమ బోర్డు పరిశోధన విస్తరణ కేంద్రం సైంటిస్ట్ డా. ఇ .భువనేశ్వరి తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా రైతులకు మల్బరీ తోటల్లో పోషన్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు . ఆరోగ్యకరమైన మల్బరీ మొక్కలను నిర్వహించడంతో పాటు, పట్టు కోకూన్ల నాణ్యతను మెరుగుపరచడానికి నేల మరియు ఆకుల్లోని పోషకాల అంచనా, తగిన పోషక యాజమాన్యం యొక్క ప్రాముఖ్యతను వనరుల వ్యక్తులు వివరించామని, పోషణ ముఖ్య లక్షణాలు, మల్బరీ ఆకులు మరియు కోకూన్ల నాణ్యతను కాపాడడంలో దాని పాత్ర గురించి తెలియజేశామన్నారు. అదనంగా, మల్బరీ సాగులో సమగ్ర సస్యరక్షణ మరియు తెగుళ్ల--వ్యాధుల నియంత్రణ పద్ధతులను వివరంగా తెలియజేశామని, ఇందులో వేప నూనె మరియు మిస్టర్ ప్రో వంటి ఉత్పత్తులను తగిన విధంగా వినియోగించే విధానాన్ని వివరించామన్నారు. ఆరోగ్యకరమైన మల్బరీ ఆకుల ఉత్పత్తి , మెరుగైన నాణ్యత కలిగిన పట్టుపురుగు కోకూన్ల సాధన కోసం శాస్త్రీయ మల్బరీ తోటల యాజమాన్య పద్ధతులను అవలంబించాల్సిన అవసరాన్ని తెలియజేసామన్నారు. ఈ సాంకేతిక ప్రదర్శన ద్వారా రైతులకు శాస్త్రీయ మల్బరీ తోటల యాజమాన్యం, పోషక యాజమాన్యం, తెగుళ్ల మరియు వ్యాధుల నియంత్రణను తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాస్ , పట్టు పరిశ్రమ శాఖ అధికారులు తదితరులుపాల్గొన్నారు.


## వైభవంగా శోభనాచల స్వామి వారి శాంతి కళ్యాణం.





**అగిరిపల్లి ఆగస్టు 25 ప్రభాతవార్త.** శ్రీ శోభనాచల వ్యాగ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి విశేష అర్చన నిత్య హోమములు శ్రీ లక్ష్మీ నరసింహ సుదర్శన మూల మంత్ర హోమము పవిత్రముల విసర్జన మహా పూర్ణాహుతి శ్రీ భూనీలా సమేత శ్రీ శోభనాచల వ్యాగ్ర లక్ష్మీనరసింహస్వామి వార్లకు శాంతి కల్యాణం, ఉభయ దాతలకు ఆశీర్వచనము పవిత్రముల వితరణ నీరాజనం మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగము, నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి చే శ్రీ నరసింహ వైభవం ప్రవచనములు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు లు ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్ సాయి పర్యవేక్షణలో వేదాంతం గోపాలకృష్ణమాచార్యులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి యాజ్ఞిక నిర్వహణలో ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు గుడిపూడి రామ అనంత కృష్ణ వేదాంతం లీలా మనోహర్ ప్రసాద్ లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మొగల్తూరు, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** మొగల్తూరు మండలం సుబ్రహ్మణ్యేశ్వరం గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా కనిపించాయి. మహిళలు, వృద్ధులు, యువతతో పాటు పలువురు భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. పూజల అనంతరం భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో ప్రత్యేక పూజలు కొనసాగడంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

## ఇంటింటికి టీడీపీ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం



**కైకలూరు, ఆగస్టు 25: (ప్రభాతవార్త)** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో "కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం.. ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని మంగళవారం కైకలూరు పట్టణంలోని 111వ బూత్‌లో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు సూచనల మేరకు కార్యక్రమం చేపట్టారు.క్లస్టర్--5 ఇన్‌చార్జి పోలవరపు లక్ష్మీరాణి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో కైకలూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడమట వాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు 6వ వార్డులో పారిశుధ్య సమస్య



**నూజివీడు ఆగస్టు 25 ప్రభాతవార్త =** మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంతో నూజివీడు మున్సిపాలిటీలోని 6వ వార్డులో పారిశుధ్య సమస్య తీవ్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనియన్ బ్యాంక్ ఎదురు సందులో గత మూడు రోజులుగా ఇళ్ల వద్ద నుంచి సేకరించిన చెత్తను తొలగించకుండా గృహాల మధ్యనే ఉంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తను సకాలంలో తరలించకపోవడంతో కుక్కలు, ఆవులు చెత్తను రోడ్లపైకి లాగి వేస్తున్నాయి. దీంతో పరిసరాల్లో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చెత్త నిల్వల కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను మున్సిపల్ చెత్త బుట్టలకు తరలిస్తున్నప్పటికీ, సిబ్బంది వాటిని సకాలంలో తొలగించకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే పరిస్థితి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లోని సందుల్లోనూ కనిపిస్తోందని స్థానికులు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## విద్యార్థుల ఉన్నతికి కెజిఆర్ఎల్ బాటలు



**భీమవరం టౌన్, ఆగస్టు 25 : ప్రభాతవార్త** విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు నైతిక విలువలను పెంపొందించేందుకు కేజీఆర్ఎల్ కాలేజీ ఆధ్వర్యంలో 'జీరో టు హీరో' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు చదువుతో పాటు జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఎథిక్స్, విలువలు, కెరీర్‌పై అవగాహన వంటి అంశాల్లో శిక్షణ పొందనున్నారు. ప్రముఖ విద్యావేత్త, ఎమెరిటస్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కె.వి. సుబ్బరాజు,పి హెచ్ డి. రచించిన సీక్రెట్స్ ఫర్ స్టూడెంట్స్ వంటి అంశాల ఆధారంగా విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించనున్నారు.విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశా లకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధా న లక్ష్యమని కళాశాల యాజమాన్యం తెలి పింది. 'జీరో నుంచి హీరోగా ఎదగడానికి విద్యార్థులకు సరైన దిశానిర్దేశం' అందించడ మే కార్యక్రమం ప్రత్యేకతగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఐ.రామచంద్ర మూర్తి, పీజీ కోర్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రామమూర్తి , జూనియర్ కాలేజీ ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీబీ గంగాధర్ రావు , ఫిషరీస్ డైరెక్టర్ ఛాయా , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు .

## కాళ్ళకూరు వెంకన్నబాబు
# ఆలయ అభివృద్ధికి రూ.1,01,116/- విరాళం



**కాళ్ళ ఆగస్టు 25( ప్రభాతవార్త)** కాళ్ళకూరు స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మాడవీధులు విస్తరణకు స్థలం కొనుగోలు నిమిత్తం దాతలు విరాళం అందజేయడం అభినందనీయమని ఆలయ ధర్మకర్తల మండల అధ్యక్షుడు అడ్డాల శివరామరాజు అన్నారు. మండలంలోని కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి తాడినాడకు చెందిన కి.శే.కంతేటి సూరపరాజు (తాడినాడ శ్రీను)-జ్ఞాపకార్థం, తల్లిదండ్రులు సీతారామ రాజు-అచ్చమ్మ, బార్య రామావతి రూ. 1,01,116/-లు విరాళం అధ్యక్షుడు అడ్డాల శివరామరాజు, ఆలయ నిర్వహణా ధికారి మోకా అరుణ కుమార్లకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.

## ఆఫ్ లైన్ పరీక్ష - అర్హతా మార్కుల తగ్గింపు
### కోరుతూ ఐక్యోపాధ్యాయ సంఘం బైక్ ర్యాలీ



**భీమవరం టౌన్, ఆగస్టు 25 : ప్రభాతవార్త** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిర్వహ ణపై ప్రభుత్వ విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించేందుకు ఉపాధ్యాయ వర్గాలు సమాయత్తమ వుతు న్నాయి. వరుస ఉద్యమాలకు శ్రీకారం చుడు తున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం ఐక్యఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో భీమ వరం టౌన్ హాల్ రోడ్ లోని జిల్లా యుటిఎఫ్ కార్యాలయంనుండి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ టెట్ నోటిఫి కేషన్ లో కూడా ఉపాధ్యాయు ల డిమాండ్లు పరిగణలోకి తీసుకోనందున యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలో భాగంగా బైక్ ర్యాలీకి పిలుపు నిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.విజయ రామరాజు, ప్రధాన కార్యదర్శి పి.క్రాంతికుమార్ ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఉపా ధ్యాయ వర్గాలు కోరుతున్న డిమాండ్లు ఈ విధంగా ఉన్నాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయు లందరికీ టీచర్ ఎలిజిబి లిటీ టెస్ట్ టెట్ రద్దు చేయాలి, విద్యా హక్కు చట్టం సెక్షన్ 23 (1) సవరిం చాలి, ఇన్ సర్వీస్ ఉపా ధ్యాయులకు నిర్వ హించే టెట్ పరీక్షలో అర్హత మార్కుల ను తగ్గించాలి, సంబంధిత సబ్జెక్టు కు మాత్రమే సిలబస్ ను పరిమితం చేయాలి, పరీక్షను ఆఫ్ లైన్ లో నిర్వహించా లన్నవి ప్రధాన డిమాండ్లు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సభలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, పి క్రాంతికుమార్ మాట్లా డుతూ రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ స్పెషల్ టెట్ నోటిఫికేషన్ లో పేరు లోమా త్రమే స్పెషల్ ఉందని, నిబంధనలలో ఏమాత్రం ప్రత్యేకతలు లేవని అన్నారు గత జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జనరల్ టెట్ నోటిఫికేషన్ మాదిరిగానే ఇప్పుడు కూడా అవే నిబంధనలు ఉన్నాయని అన్నారు దీనివల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రయోజనం లేదని, మరింత ఒత్తిడికి గురి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు 2028 ఆగస్టు 31 లోపు సర్వీస్ లో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు టెట్ క్వాలిఫై కావాలని లేనిపక్షంలో ఉద్యోగం నుండి తొలగించ బడతారని ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వంతో, ఎన్సీటీఈ తో మాట్లాడి నిబంధనలు సవరించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ పట్టాభిరామయ్య అధ్యక్షతన సభ జరిగింది. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కి వినతి పత్రాలు అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీపీ రామానుజరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు జి రామకృష్ణంరాజు, కే రామకృష్ణ ప్రసాద్, సిహెచ్ కుమార్ బాబ్జి, మండల పట్టణ శాఖల బాధ్యులు కే త్రిమూ ర్తులు, బిఆర్ఎంకే స్వామి, కే వామనమూర్తి,కే వి మల్లేశ్వర రావు, వీఎస్వీ శ్రీనివాస్, ఏ రాంబా బు, బి నాగబాబు, పివి రమణ రాజు, బి నరేష్, ఎం నరసింహయ్య, కే సూర్య ,జి భవాని ప్రసాద్ ,జి నాగేశ్వర రావు, స్వరూప్ తదిత రులు పాల్గొన్నారు

## అధ్వానంగా మారిన రెండు జిల్లాల మధ్య
# ఆర్అండ్‌బీ రహదారి
### గుంతల్లో వర్షపు నీరు.. ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
### తక్షణ మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్



**మొగల్తూరు, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం పడమర, ఎన్టీఆర్ జిల్లా గొల్లపాలెం గ్రామాల మధ్య ఉన్న రెండు జిల్లాల సరిహద్దు ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వర్షం కురిసినప్పుడు వాటిలో నీరు నిలిచిపోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ రెండు గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు కళాశాల, హైస్కూల్ విద్యార్థులు, రైతులు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలోనే రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు, గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని వారు విమర్శిస్తున్నారు. వర్షాలకు గుంతలు మరింత పెరిగి రహదారిపై నీరు నిలిచిపోవడంతో రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. రెండు జిల్లాలను కలిపే కీలకమైన ఈ ఆర్అండ్‌బీ రహదారి పరిస్థితిని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో పాటు, శాశ్వత ప్రాతిపదికన రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## కాళీపట్నం మాగలేరులో
# మూడు వేట పడవలు ధ్వంసం



**మొగల్తూరు, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం కొత్తోట మాగలేరులో గుర్తుతెలియని దుండగులు మూడు వేట పడవలను ధ్వంసం చేసి నీటిలో ముంచివేసిన ఘటన కలకలం రేపింది. మంగళవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఈ ఘటన జరిగినట్లు బాధిత మత్స్యకారులు తెలిపారు. దుండగులు పడవలను పగలగొట్టి మాగలేరులో ముంచివేయడంతో తీవ్రంగా నష్టపోయామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో పలుమార్లు వేట పడవలను ధ్వంసం చేసి నీటిలో ముంచివేసిన ఘటనలు జరిగాయని, అప్పట్లో ముంచిన కొన్ని పడవల ఆచూకీ ఇప్పటికీ లభించలేదని తెలిపారు. వరుస ఘటనలతో మత్స్యకారుల్లో భయాందోళన నెలకొంది. ముంచివేసిన పడవలను వెంటనే బయటకు తీసి తమకు న్యాయం చేయాలని, ఘటనకు పాల్పడిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

## చిట్టవరంలో మెగా వైద్య శిబిరం




**నరసాపురం రూరల్ ఆగస్టు 26 ప్రభాత వార్త** స్వచ్ఛ్ సేవా భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలోని భారత్ లక్సిండో అగ్రి ఫీడ్స్ లో ఉచిత మెగా వైద్య శిబిరం కిమ్స్ హాస్పిటల్ వైద్యులచే మంగళవారం నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సూచనలు, మందులు అందజేశారు. ట్రస్ట్ మా సంస్థలో పనిచేసే సిబ్బంది కోసం వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యటం అభినందనీయమని యాజమాన్యం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా అందిస్తామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు,రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు రావూరి సుధ అన్నారు. ఈ కార్యక్రమంలో వేరుకొండ దుర్గాప్రసాద్, మడికి శ్రీనివాస్, యాదంరెడ్డి శ్రీనివాస్, పెచ్చేటి కృష్ణాజీ, యడ్ల బాబు, పడవల ఉమా శ్రీనివాస్, శిడగాం అమృత్, చేగొండి బాబీ తదితరులు పాల్గొన్నారు.

## సోమేశ్వర స్వామి కివిశేష పూజలు



**కాళ్ళ ఆగస్టు25( ప్రభాతవార్త)** మండల కేంద్రమైన కాళ్ల గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. పంచ హారతులు ఇచ్చారు. భక్తుల అధిక సంఖ్యలో సోమవారం దర్శించుకున్నారు. శివలింగం బ్రహ్మ సూత్రం కలిగే ఉండడంతో గ్రామం నుంచి కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే స్వామివారిని దర్శించుకుంటారు.

## జగన్మోహన్ రెడ్డిని కలిసిన తాడేపల్లిగూడెం
# వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వడ్డీ రఘురాం



**తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (ప్రభాతవార్త)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాల తీరుతెన్నులు, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, నాయకులు, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై పార్టీ తరపున చేపడుతున్న కార్యక్రమాలపై అధినేతకు వివరించినట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి సమష్టిగా పనిచేస్తామని వడ్డీ రఘురామ్ నాయుడు తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి సూచనలు, సలహాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వడ్డీ రఘురామ్ నాయుడు వెల్లడించారు.

## బీసీల హక్కుల కోసం
# బీపీ మండల్ పోరాటం చిరస్మరణీయం



**తాడేపల్లిగూడెం ఆగస్టు 25 (ప్రభాతవార్త)** బీసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బీపీ మండల్) అని పలువురు బీసీ నాయకులు కొనియాడారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో బీపీ మండల్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షులు కేశవభట్ల విజయ్ మాట్లాడుతూ సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీపీ మండల్ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు, సమాన అవకాశాల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. పెంటపాడు మండల అధ్యక్షులు కాజులూరి దుర్గా మల్లేశ్వరరావు మాట్లాడుతూ కమిషన్ ద్వారా వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీసుకొచ్చి సామాజిక న్యాయం కోసం బలమైన పునాది వేసిన మహానుభావుడు బీపీ మండల్ అని శ్లాఘించారు. బీసీ వర్గాల అభివృద్ధికి బీపీ మండల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. జిల్లా ఉపాధ్యక్షులు బండారు బెనర్జీ బాబు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడి బీసీల రిజర్వేషన్ పితామహుడుగా బీపీ మండల్ గుర్తింపు పొందారని కీర్తించారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం ప్రజలందరికీ రాజ్యాంగ ఫలాలు అందాలని మండల్ పోరాటం చేశారని వివరించారు. అనంతరం నాయకులు బీపీ మండల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బీసీ వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధిలో సమాన అవకాశాల కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.బీపీ మండల్ ఆశయాలే సామాజిక న్యాయానికి మార్గదర్శకం --- బీసీల అభ్యున్నతే మన లక్ష్యమని వివరించారు. ముందుగా బీపీ మండల్ విగ్రహానికి పులమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ కు వెండి వస్తువులు



**భీమవరం ఆగష్టు25 ప్రభాతవార్త** భీమవరం పట్టణం ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి సన్నిధిలో ఉపయోగ నిమిత్తం గొల్లవానితిప్ప కి చెందిన కొప్పర్తి బేబీ శ్రీ ఫణి అనీషా రూ 2,20,000/- లు విలువ చేసే 766 గ్రాముల వెండి పళ్లెం, 200 గ్రాముల వెండి గిన్నె ఉద్ధరిణి సమర్పించారు వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు ఆశీర్వచనాలు నిర్వహించారు, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం తో సత్కరించగా, ఆలయ చైర్మన్ బొండాడ నాగభూషణం, ధర్మకర్తలు ఉదీశి మీనాక్షి, మిర్తిపాటి గున్నేశ్వరరావు, పాపాలు ఏడుకొండలు ప్రసాదం ఫోటో అందచేసారు.